


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

గుంటూరు

: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

6-9-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 218 పేజీలు: 12 వెల: 8.00


ఆఫ్రికా పెద్దది.. గ్రీన్‌లాండ్ చిన్నది! 9లో

లారీని ఢీకొన్న కారు.. 8 మంది యువకుల మృతి

# ప్రతి స్కూలుకు ఓ బ్రాండ్



జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం న్యూఢిల్లీలో టీచర్ అవార్డులు గెలిచిన వారితో మాట్లాడుతున్న ప్రధాని మోడీ

## డ్రగ్స్, మొబైల్స్ నుంచి విద్యార్థులను కాపాడండి

### వారిలో స్క్రీన్ బానిసత్వం తగ్గించండి: టీచర్లకు దిశానిర్దేశం చేసిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 5:** డ్రగ్స్, మొబైల్‌ఫోన్లకు బానిసలు కాకుండా చిన్నారులను నియంత్రించాల్సిన ప్రధాన బాధ్యత ఉపాధ్యాయులదేనని ప్రధాని నరేంద్రమోడీ పేర్కొన్నారు. శనివారం జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవంసందర్భంగా జాతీయ టీచర్ అవార్డులు గెలిచిన వారితో ప్రధాని మోడీ మాట్లాడారు. ఢిల్లీలోని 7, లోక్‌కల్యాణ్ మార్గ్‌లో ఈ కార్యక్రమం జరిగింది. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గెలిచినవారితో మాట్లాడుతూ పిల్లలు ఎక్కువగా స్క్రీన్‌కు బానిసఅవుతున్నట్లు చెప్పారు. >>2

### దేశానికి ఆదర్శంగా రాష్ట్ర విద్యావిధానం

### ఎవరు వచ్చినా టీచర్ల స్థానం భర్తీ కాదు..

### కోర్సులను రీస్ట్రక్చరింగ్ చేయాలి

### ఉపాధ్యాయ దినోత్సవంలో సిఎం చంద్రబాబు




ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం విజయవాడలో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి లోకేష్ ఉన్నారు

**విజయవాడ,సెప్టెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యార్థులను భవిష్యత్ ప్రపంచానికి సిద్ధం చేసే బాధ్యత ఉపాధ్యాయులదేనని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యా వ్యవస్థలో సమూల మార్పులు రావాలని ఆకాంక్షి ంచారు. పాఠశాల స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు కోర్సులను రీస్ట్రక్చరింగ్ చేయాల్సిన అవసరం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ఎఐ, క్వాంటం, రోబోటిక్స్, డేటా అనలటిక్స్‌వంటి ఆధునిక రంగాల్లో విద్యా ర్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపా ధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. దేశ భవిత అయిన విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులం దరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం వేదిక వద్ద ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించి, విద్యాశాఖ చేపడుతున్న కార్యక్రమాలపై వివరాలుఅడిగి తెలుసుకు >>2

## త్వరలో 12వ పిఆర్‌సి

### 2 పెండింగ్ డిఎలు ఇస్తాం: సిఎం

**విజయవాడ, సెప్టెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** ఉద్యోగుల సమన్వయంచేసుకుంటూ ప్రభుత్వం ప్రగతిని సాధిస్తుందని సిఎం చంద్రబాబు అన్నారు. వారు ప్రభుత్వంలో అంతర్భాగంగా అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. వారిసమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అత్యంత బాధ్యతగా ఆలోచిస్తుందన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 12వ పేరివిజన్ కమిషన్ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. అలాగే పెండింగులో ఉన్న 4 డీఏల్లో 2 డిఎల విడుదలకు ముఖ్యమంత్రి అంగీకరించారు. వీటితో పాటు మరికొన్ని ముఖ్యమైన >>2



మహిళల ఆసియా కప్

## భారత్ హ్యాట్రిక్ విక్టరీ

### పాక్‌పై 8.4 ఓవర్లలోనే భారత్ జట్టు విజయం

### సెమీస్‌కు దూసుకెళ్లిన హర్మన్‌ప్రీత్ జట్టు

2లో

## అమెరికా ఉద్యోగం ఆశలు ఆవిరి!

### హెచ్1 బి వీసా ఫీజులు ఇక రెండు లక్షల డాలర్ల పైనే

9లో

## జిల్లా పరిషత్‌ల పునర్వ్యవస్థీకరణ

### 28 కొత్త జడ్పీల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ

**విజయవాడ,సెప్టెంబరు 5, ప్రభాతవార్తప్రతినిధి:** కొత్త జిల్లాల సంఖ్యకు అనుగుణంగా జిల్లా పరిషత్‌ల పునర్వ్యవస్థీకరణ చేయనుంది. ప్రస్తుతం ఉన్న 13 జడ్పీల స్థానంలో 28 కొత్త జడ్పీలు ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగా ఏర్పడిన మార్కాపురం, పోలవరం జిల్లాలకు సైతం జడ్పీల మంజూరు చేసింది. కొత్త జిల్లా పరిషత్‌ల నిర్వహణ కోసం 30 కీలక పోస్టులపై దృష్టి సారిస్తుంది. అదనంగా 15 జడ్పీ సిఇఒ, 15 డిప్యూటీ సిఇఒ పోస్టుల ఏర్పాటుకు ఆమోదించింది. ఈ నెల 24తో ప్రస్తుత జడ్పీ పాలకవర్గాల పదవీకాలం ముగియనుంది. గడువు ముగిసిన వెంటనే 28 కొత్త జడ్పీల వ్యవస్థ అమల్లోకి రానుంది. 660 మండలాలను కొత్త జడ్పీల పరిధిలోకి మ్యాపింగ్ చేయాలని ఆదేశించింది. పనిభారం ఆధారంగా ప్రస్తుత సిబ్బందినే కొత్త జడ్పీలకు ప్రభుత్వం సర్దుబాటు చేయనుంది.

## సోమశిల హైలెవెల్ కాలువ పూర్తిచేస్తాం

### రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం



**మర్రిపాడు (నెల్లూరు), సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** సోమశిల హైలెవల్ కెనాల్‌ను పూర్తిచేసి మర్రిపాడు మండలానికి ఆ సాగునీరు అందించడమే తమ లక్ష్యమని మర్రిపాడు ప్రాంత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం మర్రిపాడు మండలం డిసిపల్లిలో శ్రీకోదండరామస్వామి ఆలయ పునర్నిర్మాణానికి కోటి రూపాయలు దేవాదాయ శాఖ నిధులతో మంత్రి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పురాతన, గ్రామీణ దేవాలయాలను పునర్నిర్మించి ఆధ్యాత్మిక అభివృద్ధికి బాటలు వేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు.

**మర్రిపాడుకు సాగునీరు అందిండచమే లక్ష్యం**

సోమశిల హైలెవల్ కెనాల్ ద్వారా మర్రిపాడు మండలానికి నీరు అందించే విషయంలో ఎలాంటి అనుమానాలు అవసరం లేదన్నారు. కెనాల్‌కు సంబంధించిన పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిని ఒప్పించి సోమశిల హైలెవల్ కెనాల్ ప్రాజెక్టును ప్రారంభించి శంఖుస్థాపన చేసి టెండర్లు పిలిచామన్నారు. మొదటి విడతలో కాల్వల పనులు దాదాపు 68శాతం పూర్తయ్యాయన్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో మిగిలిన 32శాతం పనులను పూర్తిచేయకుండా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ఈ పెండింగ్ పనులనుపూర్తి చేయడం ద్వారా ప్రాజెక్టు ప్రయోజనాలను రైతులకు, గ్రామీణ ప్రజలకు అందించేందుకు >>2



## 2029లోగా 3 డిఎస్సీలు

### పిల్లల జీవితాలను మార్చే శక్తి టీచర్లకే ఉంది: మంత్రి లోకేష్

**విజయవాడ,సెప్టెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యాశాఖలో ఎపి మోడల్ మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా తీర్చిదిద్దుతామని విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ అన్నారు. డిఎస్సీకి, ఎపిపిఎస్సీకి తేడా తెలియనివారు తమపై విమర్శలు చేస్తున్నారని మంత్రి నారా లోకేష్ విమర్శించారు. విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవంలో సిఎం చంద్రబాబు నాయుడితో కలిసి మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. తొలుత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి లోకేష్ మాట్లాడారు. 2029 లోగా మరో 3 డిఎస్సీలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. విద్యాశాఖలో ఎపి మోడల్ మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా తీర్చిదిద్దుతామని అన్నారు. రాష్ట్ర విద్యా వ్యవస్థలో సంస్కరణలు తెచ్చేందుకు కట్టుబడి ఉన్నామని లోకేష్ చెప్పారు. కాయలున్న చెట్టుకే రాళ్లదెబ్బలు తగులుతాయి.

14 డిఎస్సీలు వేసిన వ్యక్తి సిఎం చంద్రబాబు. మా ప్రభుత్వాల హయాంలో 2 లక్షల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం. మా ప్రభుత్వంలో ఏటా డిఎస్సీ నిర్వహిస్తాం. 2029లోగా మరో మూడు డిఎస్సీలువస్తాయి. పిల్లలనుగొప్పవాళ్లుగా తయారు చేసే అద్భుతమైన అవకాశం టీచర్లకేఉంది. టీచర్లను విదేశాలకు పంపిస్తున్నాం స్టడీ చేసి రావాలని కోరుతున్నాం. ప్రాక్టికల్ విద్య అందిస్తేనే పిల్లలు అద్భుతాలుచేస్తారు. రాష్ట్ర విద్యా వ్యవస్థలో సంస్కరణలు తెచ్చేందుకు కట్టుబడి ఉన్నాం. పిల్లల జీవితాలను మార్చే శక్తి టీచర్లకే ఉందని మంత్రి లోకేష్ కొనియాడారు. పిల్లల మానసిక ఎదుగుదలపై టీచర్లు దృష్టిసారించాలన్నారు. వారి ప్రవర్తనలో మార్పులను జాగ్రత్తగా గమనించాలని సూచించారు.

ప్రభుత్వ బడులకు హౌస్‌ఫుల్, నో అడ్మిషన్ బోర్డులు ఉండాలని మంత్రి లోకేష్ అన్నారు. ఆధునికసాంకేతికత వైపు విద్యా >>2



## కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్

### లష్కరే టాప్ కమాండర్ యాసిర్ హతం

**శ్రీనగర్,సెప్టెంబరు 5:** జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత ప్రక్రియ కొనసాగుతోంది. శనివారం మధ్య కశ్మీర్‌లోని బుద్గాం జిల్లాలో భద్రతా బలగాలకు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా (ఎల్‌ఇటి) కమాండర్ యాసిర్ హతమయ్యాడు. యూస్‌మార్గ్ అటవీ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. యూస్‌మార్గ్ >>2

## గ్రామాలకు నీటి భద్రత

### ప్రజలకు నాణ్యమైన మంచినీరు అందించడమే లక్ష్యం

### యుద్ధ ప్రాతిపదికన ఫిల్టర్‌బెడ్‌ల పునరుద్ధరణ

### రూ. 26వేల కోట్లతో అమరజీవి జలధార పనులు

**విజయవాడ,సెప్టెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన మంచి నీరు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మంత్రి పవన్ కల్యాణ్ విస్తృత స్థాయి కార్యచరణకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ తాగునీటి పథకాల పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. ఇందుకోసం ప్రత్యేకంగా రూ. 35 కోట్ల నిధులు కేటాయించి, దాదాపు 370 గ్రామాల పరిధిలోని సమగ్ర రక్షిత మంచినీటి పథకాల్లో పాడైన 340 ఫిల్టర్ బెడ్లు పునరుద్ధరించారు. తద్వారా సుమారు 25 లక్షల మందికి నాణ్యమైన తాగునీటి సరఫరా చేస్తున్నారు. జల్ జీవన్ మిషన్ 2.0 మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులతో గ్రామీణ తాగునీటి వ్యవస్థల నిర్వహణ, సంరక్షణ చర్యలు చేపడుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో మంచి నీటి వ్యవస్థలను బలోపేతం చేయడానికి అవసరమైన అన్ని అవకాశాలను వినియోగించుకుంటూ పవన్ కల్యాణ్ ప్రణాళికలు ముందుకు తీసుకువెళ్తున్నారు. జల్ జీవన్ మిషన్ అమరజీవి జలధారల ద్వారా దాదాపు రూ. 26,000 కోట్ల విలువైన పనులు ముందుకు తీసుకువెళ్తున్నారు. చిత్తూరు, ప్రకాశం, పల్నాడు, ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో రూ. 7,910 కోట్లతో చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకాల ద్వారా వచ్చే 30 యేళ్లలో 1.21 కోట్ల మంది ప్రజల తాగునీటి అవసరాలు తీర్చనున్నారు. మరో పది మల్టీవిలేజ్ స్కీం పథకాలకు రూ. 9,355 కోట్లు మంజూరు




చేశారు. అత్యంత తీవ్ర నీటి ఎద్దడి కలిగిన 3 వేల గ్రామాలను గుర్తించి, రూ. 1,814 కోట్లతో సింగిల్ విలేజ్ వాటర్ స్కీంల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వీటితోపాటు గత ప్రభుత్వం అరకొర పనులు చేసి వదిలివెళ్లిన పులివెందుల, డోన్, ఉద్దానం తదితర మంచినీటి పథకాల పనులు పూర్తి చేస్తున్నారు. వీటితోపాటు పవన్ కల్యాణ్ చొరవతో 7,439 గ్రామీణ తాగునీటి పనుల క్రమబద్ధీకరణ, విస్తరణ నిమిత్తం >>2

ఒంగోలు రోడ్డుపై ఘోరం

## లారీని ఢీకొన్న మినీ లారీ

### ఇద్దరు దుర్మరణం



ప్రమాదంలో తుక్కుతుక్కయిన మినీ లారీ

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త:** ప్రకాశం జిల్లా ఒంగోలులోని 16వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సంఘమిత్ర ఫ్లైఓవర్ సమీపంలో మరమ్మతులకు గురైన లారీని రోడ్డు పక్కన నిలిపి ఉంచారు. విజయవాడ నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న మినీ లారీ అదే మార్గంలో వేగంగా వచ్చి ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ప్రమాద సమయంలో నిలిపి ఉంచిన లారీలో ఉన్న ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. మినీ లారీ డ్రైవర్ కూడా తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఒంగోలు తాలూకా పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. తాలూకా సిఐ విజయకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు వివరాలు సేకరించారు. మృతులను పల్నాడు జిల్లా అమరావతి మండలం జీలుగు గ్రామానికి చెందిన చలంచర్ల తిరుపతమ్మ (27), బాపట్ల వెంకటేశ్వరమ్మ (24)గా గుర్తించారు. మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకుని ఒంగోలు జిజిహెచ్‌లోని మార్చురీకి తరలించారు. గాయపడిన మినీ లారీ డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంతో జాతీయ రహదారిపై కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించి వాహనాలను క్రమబద్ధీకరించారు. ప్రమాద స్థలంలో ఉన్న వాహనాలను పక్కకు తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ప్రమాద ఘటనను పరిశీలించిన >>2



శనివారం ఉద్యోగ సంఘాల నేతలతో సమీక్ష జరుపుతున్న సిఎం చంద్రబాబు

# త్వరలో 12వ పిఆర్‌సి

>> పెండింగ్ అంశాలకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో శనివారం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని ఉద్యోగ సంఘాల నేతలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. గత ప్రభుత్వం పెండింగులో పెట్టిన ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ప్రస్తుతం రాష్ట్రం ఆర్థికంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. రాష్ట్ర ఆదాయవ్యయాల లెక్కలను ఉద్యోగుల ముందు ఉంచారు. రాష్ట్రం ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నా.... ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలతతో ఉన్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ మేరకు కొన్ని కీలక నిర్ణయాలను సీఎం ప్రకటించారు. 12వ పీఆర్సీ నియామకానికి అంగీకరించారు. అలాగే 172024, 112025లకు చెందిన రెండు డీఏల విడుదలకు ఆమోదం తెలిపారు. ఈ రెండు డీఏలను 2026 అక్టోబర్ 1 నుంచి చెల్లించనున్నారు. ఇక 2022 సంవత్సరానికి సంబంధించిన సరెండర్ లీవులను వచ్చే సంక్రాంతికి ఉద్యోగుల ఖాతాలో వేయడానికి అంగీకరించారు. ఇక పోలీసులకు 1 అడిషనల్ సరెండర్ లీవ్‌ను ఈ దసరాకు చెల్లించేందుకు ముఖ్యమంత్రి సుముఖత వ్యక్తం చేశారు. ఇక గత ప్రభుత్వం రద్దు చేసిన పెన్షనర్ల అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను వచ్చే ఏడాది జనవరి నుంచి ఇచ్చేందుకు నిర్ణయించారు. దీంట్లో భాగంగా 70 ఏళ్లు దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్లు దాటిని వారికి 15 శాతం మేర అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ వర్తింప చేయనున్నారు. ఇక ఎంప్లాయిస్ హెల్త్ స్కీంను స్ట్రీమ్ లైన్ చేస్తూ వచ్చే నెల నుంచే ఏ నెలకు ఆ నెల ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు చెల్లింపులు జరపాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల కోసం తీసుకున్న ఈ నిర్ణయాలతో ఏటా రూ.2,880 కోట్లు ప్రభుత్వానికి ఖర్చు కానుంది.

**రూ.30 వేల కోట్లకు పైగా పెండింగ్ బకాయిలు చెల్లించాం.**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ "మన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవాలి. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా... గత రెండేళ్ల కాలంలో ఒకటో తేదీన క్రమం తప్పకుండా జీతాలు ఇస్తున్నాం.. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు ఇస్తున్నాం. 11 వేల మంది సిపిఎస్ ఉద్యోగులకు ఒపిఎస్ వర్తింపచేశాం. ఉద్యోగులకు సంబంధించి ఉన్న పెండింగ్ బిల్లుల్లో ఇప్పటి వరకు రూ.30,849 కోట్లు క్లియర్ చేశాం. గత ప్రభుత్వం ఇష్టానుసారంగా వడ్డీలకు అప్పులు తెచ్చింది. ఆర్థిక సంస్థలతో చర్చించి రూ.1.50 లక్షల కోట్ల మేర అప్పులపై భారీగా ఉన్న వడ్డీలను రీ షెడ్యూల్ చేసి తగ్గించుకోగలిగాం. ప్రస్తుతం సరాసరి 9.1 శాతం వడ్డీని ప్రభుత్వం అప్పులపై చెల్లిస్తోంది. ఈ భారాన్ని ఇంకా తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం. విధ్వంసమైన వ్యవస్థలను నెమ్మదిగా గాడిన పెడుతున్నాం. గత పాలకులు ఉద్యోగులను దగ్గరకే రానీయలేదు. రివర్స్ పీఆర్సీ ఇచ్చారు... అలాంటి పరిస్థితులు ఉద్యోగులు మరిచిపోవద్దు. గత ప్రభుత్వం రిటైరైన ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్‌ను కూడా పెండింగులో పెట్టింది. ఉద్యోగులను అవమానించేలా వాలంటరీలతో కరపత్రాలు పంపిణీ చేయించారు.. హోర్డింగులు పెట్టించారు. పేపర్లో ప్రకటనలు ఇచ్చారు. ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మధ్యవర్తులతోనే మాట్లాడే పరిస్థితి నాడు ఉండేది. సమస్యల పరిష్కారం కోసం నాటి సిఎం కాళ్లు పట్టుకోవాలని అప్పుడు మంత్రులుగా ఉన్న వారు కామెంట్లు చేశారు... అవమానించారు. మంచికి చెడుకు ఉన్న వ్యత్యాసాన్ని ఉద్యోగులందరూ గుర్తించాలి. మేం ఉద్యోగులను గౌరవిస్తున్నాం... సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధితో ఉన్నాం. రిటైర్డ్ ఉద్యోగులు ఇబ్బందులు పడకూడదని వారి సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిచ్చాం. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ సానుకూలంగా ఉంటాం. ఆర్థిక వెసులుబాటు ఉంటే ఉద్యోగులకు సంబంధించిన ప్రతి సమస్యను పరిష్కరిస్తాం. 2014లో నాడు విభజన తర్వాత ఉద్యోగుల సంక్షేమానికి పెద్ద పీట వేశాం. విభజనకు వ్యతిరేకంగా పోరాడింది ఉద్యోగులే. వారిని గౌరవించాలని.. ఇబ్బందులు వస్తాయని తెలిసినా... 43 శాతం ఫిట్మెంట్ ఇచ్చాం. ఉద్యోగులు వారి సమస్యల గురించి.. యూనియన్ల కోసం పని చేస్తారు. నేను రాష్ట్రం కోసం... ప్రజల కోసం ఆలోచించాలి. ఇందులో ఉద్యోగులూ భాగమే."అని ముఖ్యమంత్రి చెప్పారు.

# లారీని ఢీకొన్న మినీ లారీ

>> పోలీసులు లారీలు నిలిపిన ప్రదేశం, రహదారి పరిస్థితులపై వివరాలు నమోదు చేసుకున్నారు. మినీ లారీ డ్రైవర్ వేగంగా వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ పరిస్థితిపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. ఘటనకు సంబంధించిన ప్రత్యక్ష సాక్షుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో రహదారిపై ఉన్న ఇతర వాహనాల వివరాలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వారి కుటుంబాల్లో విషాదం నెలకొంది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## కాంగ్రెస్ ఎపి వ్యవహారాల ఇంచార్జిగా పివి మోహన్

**విజయవాడ,సెప్టెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** కాంగ్రెస్ ఎపి వ్యవహారాల ఇంచార్జిగా పి.వి మోహన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ఆదేశాలు జారీ చేశారు. కాంగ్రెస్ ఎపి వ్యవహారాల ఇన్‌చార్జిగా ప్రస్తుతం బాధ్యతలు నిర్వర్తిస్తున్న మాణిక్యం ఠాగూర్ స్థానంలో పి.వి. మోహన్‌ను నియమిస్తూ కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు ఎపి ఇన్‌చార్జిగా పనిచేసిన మాణిక్యం సేవలను అధిష్ఠానం కొనియాడింది. అంతేకాకుండా, కాంగ్రెస్ హై కమాండ్ ఎపితో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ నూతన ఇన్‌చార్జ్‌లను, ఎఐసిసి ప్రధాన కార్యదర్శులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# రాష్ట్రంలో కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్లు!

**విజయవాడ,సెప్టెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్లు ఏర్పాటు చేసే దిశలో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాజమండ్రి, గుంటూరు, తిరుపతి, కర్నూలు నగరాల్లో పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటుకు పోలీస్ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఇవి ఆమోదం పొందితే విజయవాడ, విశాఖతో కలిపి 6 కమిషనరేట్లు అవుతాయి. దీనివల్ల సైబర్ క్రైమ్ కట్టడి, సిసి కెమెరాల నెట్వర్క్, ట్రాఫిక్ శాంతిభద్రతల విభాగాల మధ్య సమన్వయం మెరుగుపడుతుందని, ప్రజలకు మెరుగైన భద్రత అందుతుందని అధికారులు భావిస్తున్నారు.

# గ్రీస్‌లో ఎయిర్‌షోలో కూలిన యుద్ధ విమానం

**ఏథెన్స్, సెప్టెంబర్ 5:** గ్రీస్ రాజధాని ఏథెన్స్‌కు ఉత్తరంగా శనివారం నిర్వహించిన వైమానిక ప్రదర్శనలో గ్రీక్ వైమానిక దళానికి చెందిన యుద్ధ విమానం కుప్పకూలింది. ప్రమాదం జరిగిన వెంటనే ఆకాశంలోకి భారీగా నల్లటి పొగలు ఎగసిపడ్డాయి. ఈ ఘటనను చూసిన వేలాది మంది ప్రేక్షకులు భయాందోళనకు గురయ్యారు.రెండు సీట్లున్న ఫాంటమ్ ఎఫ్4 యుద్ధ విమానం ప్రదర్శనలో భాగంగా ఎగురుతుండగా కూలిపోయింది. ప్రమాదంలో ప్రేక్షకుల్లో ఎవరైనా గాయపడినట్లు తక్షణ సమాచారం అందలేదు. అయితే విమానంలో ఉన్న పైలట్లు ప్రమాదానికి ముందే సురక్షితంగా బయటకు దూకారా అన్న విషయం వెంటనే స్పష్టం కాలేదని వైమానిక దళ అధికారులు తెలిపారు.

# ప్రతి స్కూలుకు ఓ బ్రాండ్

>> రాష్ట్రంలో అమలు చేస్తున్న విద్యా సంస్కరణలను ముఖ్యమంత్రికి వివరించారు. ఎఐ వంటి వ్యవస్థలు వచ్చినా ఉపాధ్యాయుల స్థానాన్ని ఏదీ భర్తీ చేయలేదని. టీచర్ల వద్ద లేని సమాధానం ఎఐ కూడా చెప్పలేదని చంద్రబాబు అన్నారు. సాంకేతికతతో పాటు విద్యార్థుల్లో విలువలు, సంస్కృతి, దేశభక్తి, ప్రకృతి పట్ల ప్రేమను పెంపొందించాలని సూచించారు. పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై మరింత పెరిగిందన్నారు. విద్య కేవలం థియరీకి పరిమితంకాకూడదని, విద్యార్థులు బయటకు వెళ్లి అనుభవపూర్వకంగా నేర్చుకునేలా అవకాశాలు కల్పించాలని సూచించారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యా విధానం ఉండాలన్నదే తన ఆలోచనగా వెల్లడించారు. భవిష్యత్తును ముందుగానే ఊహించి నిర్ణయాలు తీసుకోవడం వల్లే ఐటీ విప్లవాన్ని అందిపుచ్చుకున్నామని సీఎం చెప్పారు. పాలనా సంస్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి అంశాలు తెలుగు వారిని అగ్రస్థానంలో నిలిపాయని పేర్కొన్నారు. వచ్చే 1015 ఏళ్లలో విభిన్నమైన భారతదేశాన్ని చూడబోతున్నామని అన్నారు.

**2027 నాటికి సంపూర్ణ అక్షరాస్యత.**

ఉపాధ్యాయులు తమ తమ పాఠశాలలను ప్రత్యేక బ్రాండ్‌గా తీర్చిదిద్దాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. చదువుకునే వయసులో ప్రతి విద్యార్థి బడిలో ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివేలా ప్రోత్సహించాలని, ఆవిష్కరణలు, సృజనాత్మకత, కష్టాలను ఎదుర్కొనే తత్వాన్ని వారిలో పెంచాలని సూచించారు. ఏడో తరగతి చదివే విద్యార్థులు సైతం ఎఐలో ప్రావీణ్యం సాధించేలా తీర్చిదిద్దాలని అన్నారు. ప్రతి పాఠశాలా మోడల్ స్కూల్‌గా మారితే కుటుంబాలు, గ్రామాలు, చివరకు దేశం మారుతుందని చెప్పారు. విద్యార్థులను నాయకత్వ లక్షణాలతో తీర్చిదిద్దాలని కోరారు. క్రీడలు, ప్రకృతితో విద్యార్థులను అనుసంధానం చేయాలని, ప్రతి శనివారం నో బ్యాగ్ డే సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. 2027 నాటికి రాష్ట్రంలో వంద శాతం అక్షరాస్యత సాధించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం తెలిపారు. క్లిక్కర్, ఎఐ ట్యూటర్ వంటి సాంకేతికతలను ఉపయోగించి బోధనలో మార్పులు తీసుకొస్తున్నామని చెప్పారు. 2047 నాటికి భారత్ ప్రపంచంలో అగ్రస్థానంలో ఉంటే.. ఆంధ్రప్రదేశ్ దేశంలో నంబర్ వన్‌గా ఉండాలని ఆకాంక్షించారు. ఆ లక్ష్యానికి పునాది పాఠశాలల్లోనే పడాలని, దాన్ని సాధించేది ఉపాధ్యాయులేనని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఉపాధ్యాయుల నియామకాలు అవసరమనే ఆలోచనతో తమ హయాంలోనే డిఎస్సీ నోటిఫికేషన్లు ఇచ్చామని చంద్రబాబు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి సంతకం మెగా డిఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామకంపైనే చేశామని చెప్పారు. నియామకాలను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు 350కి పైగా పిటిషన్లు వేసినా వాటన్నింటినీ అధిగమించి ఉద్యోగాలు ఇచ్చామన్నారు. ఉపాధ్యాయుల ప్రతిభే వారికి కొలమానంగా ఉండేలా కౌన్సెలింగ్ ప్రక్రియను తీసుకొచ్చామని చెప్పారు. ఇందుకోసం ప్రత్యేక చట్టం తీసుకొచ్చామని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిలో మహిళల భాగస్వామ్యం పెంచేందుకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని చెప్పారు.

**సవాళ్లను సమర్థంగా ఎదుర్కొందాం**

టెక్నాలజీతో ఉపాధ్యాయులకు కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయన్నారు. టీచింగ్ ప్రొఫెషన్ పూర్తిగా మారిపోయిందని ఆయన అన్నారు. గతంలో దండనతో అయినా పాఠాలు నేర్పించేవారని ఇప్పుడు కనీసం తిట్టినా ఇబ్బందులు ఎదురవుతున్నాయని సిఎం వ్యాఖ్యానించారు. సున్నితమైన పరిస్థితుల మధ్య ఉపాధ్యాయులు వివేకంతో ఆలోచన చేసి వ్యవహారాన్ని చక్కబెట్టాలని అన్నారు. మానసిక బలహీనతతో తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారని.. సామాజిక మాధ్యమాల ప్రభావంతో చెడు అలవాట్లకు బానిస అవుతున్నారని ఈ పరిస్థితులు ఆవేదన కలిగిస్తున్నాయని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు ఈ తీరుకు అద్దం పడుతున్నాయన్నారు. పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ప్రిన్సిపల్‌ను చంపేశారని, విజయనగరంలో ఓ పిల్లాడు తల్లినే హత్యచేశాడని అన్నారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో విద్యాబోధన సవాళ్లతో కూడిన అంశంగా మారిపోయిందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. దీనికి పరిష్కారంగా ఆధ్యాత్మికతను, యోగా, ధ్యానంలాంటి ఉత్తమ పద్ధతుల్ని అలవాటు చేయాలని సిఎం పిలుపునిచ్చారు.

**ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వరాలు**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సిఎం పలు వరాలు ప్రకటించారు. 12వ పిఆర్సీ నియామకానికి అంగీకారం తెలిపామని చెప్పారు. రెండు డిఎలను అక్టోబరు నుంచి ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. 2022 సరెండర్ లీవ్ మొత్తాన్ని సంక్రాంతికి ఉద్యోగుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. పోలీసులకు ఈ దసరాకు అదనపు సరెండర్ లీవ్ ఇస్తామన్నారు. పెన్షనర్లకు అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను 10-15 శాతం పెంచుతున్నట్లు ప్రకటించారు. ఎంప్లాయిస్ హెల్త్ ఇన్సూరెన్స్ మొత్తాన్ని ప్రతి నెలా జమ చేసేలా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఎప్పుడూ గౌరవం ఇస్తుందని స్పష్టం చేశారు. భారతీయ సంస్కృతి ప్రపంచంలోనే అత్యుత్తమం అని సిఎం అన్నారు. విలువలను, సంస్కృతి, సంప్రదాయాలు, దేశభక్తి, ప్రకృతి పట్ల ప్రేమను విద్యలో భాగం చేయాలని సూచించారు. జీవితాంతం నేర్చుకునే విధానాన్ని అలవాటు చేసుకోవాలని చెప్పారు. భారత్ మళ్లీ విశ్వగురు స్థానానికి రావాలంటే అది ఉపాధ్యాయుల వల్లే సాధ్యమని... విద్యార్థులను భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దాలని సిఎం ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.

**ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం**

రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 175 మంది ఉపాధ్యాయులను ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సత్కరించారు. వారికి ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. అవార్డు సాధించిన దివ్యాంగ ఉపాధ్యాయుడు ఎం.పద్మనాభంను సత్కరించేందుకు ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి స్వయంగా వేదిక దిగివెళ్లారు. ఆయనను సత్కరించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్, ఎమ్మెల్సీ వర్లరామయ్య,ఎంపీ కేశినేని శివనాథ్ సహ విద్యాశాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

### 10 నుండి
### తిరుపతి -విజయవాడల మధ్య
## కొత్త విమానసర్వీసు

**విజయవాడ, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :** విజయవాడ ప్రాంతం నుండి తిరుపతి వెళ్లే భక్తులకు కొత్త విమానసర్వీసు అందుబాటులోకి రానుంది. ఈనెల 10 వతేదీ నుండి ఫ్లై 91 విమానసంస్థ వారంలో నాలుగురోజులపాటు ఈరెండు పట్టణాల మధ్య విమాన సర్వీసును నడిపేందుకు షెడ్యూల్ ప్రకటించింది. ప్రతి గురువారం, మంగళవారం, శనివారం, ఆదివారం ఉదయం 8.05గంటలకు తిరుపతిలో బయలుదేరిన విమానం 9.15 గంటలకు గన్నవరం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఉదయం 9.45గంటలకు విజయవాడలో బయలుదేరి 10.50 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. కాగా విజయవాడ తిరుపతి మధ్య ఇప్పటికే ఇండిగో సంస్థ విమానసర్వీసును నడుపుతుంది. ఇండిగో సంస్థ సోమవారం, బుధవారం, శుక్రవారం మూడురోజులపాటు డైరెక్ట్ విమాన సర్వీసును నడుపుతుంది. తిరుపతిలో మధ్యాహ్నం 12.25గం.కు బయలుదేరినవిమానం మధ్యాహ్నం 13.35 గంటలకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుని 2.15గంటలకు విజయవాడ నుండి బయలుదేరి మధ్యాహ్నం 3.20గంటలకు తిరుపతి చేరుకుంటుంది. విజయవాడ తిరుపతి మధ్య ప్రతిరోజూ విమానసర్వీసు అందుబాటులోకి రావటంతోపాటు టిక్కెట్‌ధరలు సైతం అందుబాటులో ఉండటంతో వెంకన్న భక్తులు అనందం వ్యక్తం చేస్తున్నారు.

## వారం - వర్జ్యం

06-09-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, పుబ్బ కార్తె,
తి.దశమి రా.7.29, న.ఆరుద్ర రా.7.52
వ. లేదు
దు.సా.4.33 - సా.5.22
రాహు. సా.4.30-సా.6.00
శుభ ఉ.6.00-ఉ.7.00.

## వారఫలం

**మేషం :** ఉద్యోగయత్నాలకు అనుకూలమైన కాలం. కుటుంబ సభ్యులతో ఏర్పడిన మాటపట్టింపులు తొలగుతాయి.

**వృషభం :** ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. భూవివాదాలు తీరి లబ్ధి పొందుతారు.

**మిథునం :** కాంట్రాక్టులు పొందుతారు. వివాహ యత్నాలు ఫలిస్తాయి. వస్తు, లాభాలు పొందుతారు.

**కర్కాటకం :** నూతన వ్యాపారాలు ప్రారంభించి విజయవంతంగా పూర్తి చేస్తారు. ఉద్యోగాలలో హోదాలు పొందుతారు.

**సింహం :** కొత్త వ్యాపారాలలో తొందరపాటు వద్దు. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి. కొత్త పరికరాలు కొనుగోలు .

**కన్య :** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆశ్చర్య పరుస్తాయి. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు.

**తుల :** ప్రముఖుల నుండి ఆహ్వానాలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి సంతృప్తి కరంగా వుండును. నూతన వస్తు, వస్త్ర కొనుగోలు.

**వృశ్చికం :** పాత మిత్రులను కలిసి ఉల్లాసంగా గడువుతారు. సోదరుల నుండి కీలక సమాచారం అందుతుంది.

**ధనుస్సు :** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. పనుల్లో జాప్యం జరిగినా చివరికి పూర్తి చేస్తారు.

**మకరం :** పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. జీవిత భాగస్వామి సలహాతో ముందుకు సాగుతారు.

**కుంభం :** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. విందు, వినోదాలు, శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**మీనం :** పనులు సకాలంలో పూర్తిచేస్తారు. దూరప్రాంతాలనుండి విలువైన సమాచారం అందుతుంది. ప్రోత్సాహం లభిస్తుంది.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శనివారం న్యూఢిల్లీలో మెట్రో రైలులో ప్రయాణిస్తూ పిల్లలతో మాట్లాడుతున్న ప్రధాని మోడీ

# మెట్రోలో ప్రయాణించిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 5:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శనివారం శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ శతాబ్ది వేడుకలకు హాజరయ్యేందుకు ఢిల్లీ మెట్రోలో ప్రయాణిస్తూ కళాశాలకు చేరుకున్నారు. ఎస్‌ఆర్‌సిసి శతాబ్ది వేడుకల్లో ప్రసంగించేందుకు వెళ్లే ముందు మోడీ మెట్రో కార్డుతో రైలులో ప్రయాణించారు. ఈ సందర్భంగా మెట్రోలో ఉన్న ప్రయాణికులు, విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. సాధారణ ప్రయాణంగా ఉండే మెట్రో ప్రయాణం ప్రధాని తమతో కలిసి ప్రయాణించడంతో అక్కడి వారికి ప్రత్యేక అనుభవంగా మారింది.మెట్రోలో ప్రయాణిస్తున్న సమయంలో మోడీ పలువురు ప్రయాణికులు, విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఎస్‌ఆర్‌సిసికి చేరుకున్నారు. ఎస్‌ఆర్‌సిసి స్థాపించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శతాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ వేడుకలు నిర్వహించటం విశేషం.

# విద్యార్థులను కాపాడండి

>> మొబైల్ ఫోన్లకు పిల్లలు హత్తుకుపోతున్నారన్న ఉద్దేశాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఒకవేళ క్రీడల పట్ల పిల్లల్లో ఆసక్తి పెరిగితే, అప్పుడు ఆ స్క్రీన్ బానిసత్వం నుంచి వాళ్లు బయటపడే అవకాశాలు ఉంటాయని ప్రధాని మోడీ అన్నారు. క్రీడలు అంటే వీడియో గేమ్స్ కాదు అని ఆయన స్పష్టం చేశారు. పిల్లల్లో సృజనాత్మక పెంచాలని, వారిలో ఆటల పట్ల ఆసక్తి పెంచేలా చేయాలన్నారు. ఈ నేపథ్యంలో ఇలాంటి ప్రోగ్రామ్‌లను డిజైన్ చేయాలని టీచర్లకు ప్రధాని సలహా ఇచ్చారు. డ్రగ్స్ అంశాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. కొన్ని ప్రధాన నగరాలు, యూనివర్సిటీల్లో ఈ సమస్య ఉందని, కానీ దీని పట్ల సరైన అవగాహన లేదని, ఎటువంటి వివరణ లేకుండానే కొన్ని సార్లు ఆంక్షలు అమలు చేస్తున్నారని అన్నారు. పిల్లల ప్రవర్తన పట్ల టీచర్లు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, వారిలో జరుగుతున్న బీహేవియర్ మార్పులను పరిశీలించాలన్నారు. యావత్ విద్యా వ్యవస్థకు తాను ఒక్క విషయాన్ని చెప్పాలనుకుంటు న్నానని, కేవలం పాఠ్య పుస్తకాల బోధనలతో మాత్రమే కాదు, పిల్లలతో మమేకంగా కలిస్తేనే వారిలో మార్పు వస్తుందన్నారు. బాల్యాన్ని అంతం చేయవద్దు అని, ఆ బాల్యాన్ని రక్షించే సామర్థం టీచర్లకు ఉందని, పిల్లలు సజీవంగా ఉండేందుకు కావాల్సిన చర్యలన్నీ చేపట్టడమే టీచర్ల బాధ్యత అని ప్రధాని మోదీ తెలిపారు. టీచర్స్ డే సందర్భంగా ఆయన మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎస్ రాధాకృష్ణన్‌కు నివాళి అర్పించారు.

# 2029లోగా 3 డిఎస్సీలు

>> వ్యవస్థను నడిపించాలన్నారు. విద్యాశాఖలో ఎపి మోడల్ మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండాలని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం 117 జీవో తెచ్చి పిల్లలను పాఠశాలలకు దూరం చేసిందని ఆరోపించారు. కుటమి ప్రభుత్వం నేటి కాలానికి అనుగుణంగా పాఠశాల సిలబస్ మారుస్తున్నామన్నారు. నిడమర్రులో లీప్ స్కూల్ మోడల్ ఏర్పాటు చేశామని, తాము తీసుకున్న చర్యల వల్ల వేలమంది పిల్లలు ప్రభుత్వ బడుల్లో చేరారని మంత్రి లోకేష్ వివరించారు. ప్రభుత్వ బడుల్లో వసతుల గురించి పలువురు టీచర్లు ప్రచారం చేస్తున్నారని అభినందించారు. ఇంప్రూవ్‌మెంట్, పర్‌ఫెక్షన్ అనేవి జర్నీ మాత్రమే లక్ష్యం కాదన్నారు. ప్రభుత్వ బడుల్లో చదివిన పిల్లలను పోటీపరీక్షలకు సిద్ధం చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రతిభావంతులైన పిల్లలను పరిశోధన వైపు ప్రోత్సహిస్తున్నామన్నారు. గంగాధర్, అరుణ్‌కుమార్ లాంటి టీచర్లు ఎంతో కష్టపడుతున్నారని ఉపాధ్యాయులను మెచ్చుకున్నారు.కార్యక్రమం ప్రారంభానికి ముందు మంత్రి లోకేష్ ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రదానోత్సవ ప్రాంగణంలో పాఠశాలలకు సంబంధించిన వివిధ ప్రదర్శనలు తిలకించారు. ఉత్తమ ఉపాధ్యాయులు, వారి కుటుంబసభ్యులతో మాట్లాడారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన 175 మంది టీచర్లకు అభినందనలు తెలిపారు.

# కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్

>> ప్రాంతంలో ఉగ్రవాదుల సంచారంపై నిఘా వర్గాల నుంచి అందిన కచ్చితమైన సమాచారంతో స్పెషల్ ఫోర్సెస్, 53 రాష్ట్రీయ రైఫిల్స్ దళాలు సంయుక్తంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. భద్రతా బలగాల రాకను గమనించిన ఉగ్రవాదులు కాల్పులకు తెగబడటంతో దళాలు ప్రతిదాడి చేశాయి. ఈ కాల్పుల్లో యాసిర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు అధికారులు ధ్రువీకరించారు. యాసిర్ గతంలో లష్కరే తోయిబాలోని సులేమాన్ మూసా గ్రూప్‌లో సభ్యుడిగా ఉండేవాడని, అయితే సుమారు యేడాది క్రితం ఆ విభాగం నుంచి విడిపోయి సొంతంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు భద్రతా వర్గాలు వెల్లడించాయి. గత కొంతకాలంగా యూస్‌మార్గ్ పరిసర ప్రాంతాల్లో అతడి కదలికలపై నిఘా ఉంచినట్లు అధికారులు తెలిపారు. యాసిర్ మృతి నేపథ్యంలో అతడి నెట్‌వర్క్, లష్కరే సభ్యులతో ఉన్న సంబంధాలు, అలాగే ఇటీవల జమ్ము కశ్మీర్‌లో జరిగిన ఉగ్ర దాడుల్లో అతడి ప్రమేయంపై దర్యాప్తు సంస్థలు విచారణ జరుపుతున్నాయి. కాగా, 2025 పహల్గాం ఉగ్రదాడికి సూత్రధారి అయిన సులేమాన్ మూసాను గతంలోనే భద్రతా బలగాలు హతమార్చిన సంగతి తెలిసిందే. కశ్మీర్‌లో ఉగ్రవాద నిర్మూలనకు చేపట్టిన ఆపరేషన్లలో యాసిర్ ఎన్‌కౌంటర్ కీలక విజయమని అధికారులు పేర్కొన్నారు.

## మహిళల ఆసియా కప్
# భారత్ హ్యాట్రిక్ విక్టరీ

**దుబాయి, సెప్టెంబరు 5:** మహిళల ఆసియా కప్‌లో భారత జట్టు హ్యాట్రిక్ విజయం సాధించింది. తక్కువ స్కోరింగ్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను టీమిండియా చిత్తుగా ఓడించింది. శ్రీ చరణి37, ప్రేమా రావత్39ల విజృంభణతో 55పరుగులకే పాక్ కుప్పకూలగా భారత మహిళ జట్టు స్వల్ప లక్ష్యాన్ని 8.4 ఓవర్లలోనే ఛేదించింది. టాపార్డర్‌ను ఫాతిమా సనా(3-17) త్వరగా వెనక్కి పంపినా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(18 నాటౌట్), దీప్తి శర్మ(12 నాటౌట్)లు ఒత్తిడికి లోనవ్వకుండా ఆడారు. దాంతో ఈ మెగా టోర్నీలో దాయాదిపై ఏడో విజయంతో సెమీస్‌కు దూసుకెళ్లింది భారత్. ఆసియా కప్‌లో భారత మహిళల జట్టు జైత్రయాత్ర కొనసాగుతోంది. వరసగా రెండు విజయాలతో జోరుమీదున్న టీమిండియా ఎప్పటిలానే పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. ఏకపక్ష పోరులో పాక్‌ను వికెట్ల తేడాతో ఓడించింది. తొలుత స్పిన్నర్లు పంజా విసరడంతో దాయాదిని 55కే కట్టడి చేసిన భారత్ చిన్న లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. అ టీమిండియా స్పిన్నర్లు చెలరేగిన చోట పేసర్ ఫాతిమా సనా(3-17) చకచకా మూడు వికెట్లు తీసింది.తన మొదటి ఓవర్లోనే డేంజరస్ ఓపెనర్ షఫాలీ వర్మ(12)ను ప్రతీకా రావల్(4)ను ఔట్ చేసింది. ఆ తర్వాతి బౌండరీతో ఆత్మవిశ్వాసంగా కనిపించిన స్మృతి మంధాన(9)ను సైతం ఎల్బీగా వెనక్కి పంపింది పాక్ కెప్టెన్. దాంతో 29 పరుగులకే మూడు వికెట్లు పడ్డాయి. ఆ తర్వాత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(18 నాటౌట్), దీప్తి శర్మ(12 నాటౌట్) నింపాదిగా ఆడి పవర్ ప్లేలో వికెట్ ఇవ్వలేదు. నష్ర వేసిన 9వ ఓవర్లో వరసగా 4, 6 బాదిన కౌర్ జట్టుకు 7 వికెట్ల విజయాన్ని అందించింది. అనిశ్చితికి కేరాఫ్ అయిన పాకిస్థాన్ ఆసియా కప్‌లో టీమిండియా స్పిన్నర్లకు తలొగ్గింది. టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న పాక్‌కు షఫాలీ షాకిచ్చింది. ఓపెనర్ మునీబా అలీ(13)ని బౌల్డ్ చేసి తను బ్రేకివ్వగా అక్కడి నుంచి చరణి, రావత్ చుట్టేశారు. మరో ఓపెనర్ జుల్ఫికర్(14)ను చరణి ఎల్బీగా వెనక్కి పంపింది. వీరిద్దరూ స్పిన్ మ్యాజిక్ చూపించగా పాక్ బ్యాటర్ల తడబాటు మొదలైంది.భారత బౌలర్ల ధాటికి నలుగురు డకౌటవ్వగా మునీబ చేసిన 13 రన్స్ మినహా ఎవరూ రెండంకెల స్కోర్ దాటలేదు. దాంతో.. 18.1 ఓవర్‌లో 55 పరుగులకే దాయాది జట్టు ఆలౌటైంది.

# హైలెవెల్ కాలువ పూర్తిచేస్తాం

>> ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. 32శాతం పనులు పూర్తయితే పొంగూరు, ఇస్కపల్లి, పెగళ్ళపాడు ప్రాంతాల్లోని చెరువులు, వాగులు నీటితో నిండుతాయన్నారు. తద్వారా చుట్టుప్రక్కల అనేక గ్రామాలకు తాగునీరు, సాగునీరు అందిఏ అవకాశం ఉంటుందన్నారు. సోమశిల హైలెవల్ కెనఆల్ పనులను ఖచ్చితంగా పూర్తి చేసి తీరుతామని మంత్రి పునరుద్ఘాటించారు. కోనసముద్రం రైతులు తన దృష్టికి తెచ్చిన సమస్యపై కూడా మంత్రి స్పందించారు. సోమశిల నార్త్ కెనాల్‌లోని స్లూయిజ్‌ను పూర్తిస్థాయిలో పునర్నిర్మించడంతోపాటు సుమారు 300మీటర్ల మేర కాలువ పనులు చేపట్టి నీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఇప్పటికే పలు ప్రాంతాలకు నీరు చేరుతోదని, భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. మర్రిపాడు, ఉదయగిరి ప్రాంతాలకు నీరు అందించే విషయంలో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతోందన్నారు.

# గ్రామాలకు నీటి భద్రత

>> రూ. 4,054 కోట్ల కేటాయింపులకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది పవన్ కల్యాణ్ గ్రామీణ మంచి నీటి సరఫరా విభాగం బాధ్యతలు చేపట్టిన క్షణం నుంచి ప్రతి ఇంటికీ నాణ్యమైన తాగునీరు చేరాలన్న లక్ష్యాన్ని ముందుకు తీసుకువెళ్తున్నారు. గ్రామాల్లో ఫిల్టర్ బెడ్ల సమస్యలు ఉన్న విషయం ఆయన దృష్టికి వచ్చింది. గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో గ్రామీణ తాగునీటి పథకాలను పూర్తిగా నిరక్ష్యం చేయడంతో ఫిల్టర్ బెడ్లు దెబ్బతిని, నీటి నాణ్యత తగ్గిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనేక ప్రాంతాల్లో రంగు మారిన నీరు సరఫరా కావడం, శుద్ధి వ్యవస్థలు సక్రమంగా పని చేయకపోవడం వంటి సమస్యలు తీవ్రంగా ప్రభావం చూపాయి. గ్రామాల్లో సైతం ప్రజలు తాగునీటి అవసరాలు తీర్చుకునేందుకు డబ్బు వెచ్చించాల్సి వచ్చేది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని పవన్ కల్యాణ్ గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థల సమగ్ర పరిశీలనకు ఆదేశాలు జారీ చేశారు. సమస్య తీవ్రత, స్థానిక అవసరాలు మరియు ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల ఆధారంగా ప్రాధాన్యత క్రమంలో పునరుద్ధరణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**గుడివాడ గ్రామీణ తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం**

కృష్ణా జిల్లా, కంకిపాడు వేదికగా పల్లెపండుగ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు పవన్ కల్యాణ్ వెళ్లిన సందర్భంలో ఆ వేదికపైన గుడివాడ శాసనసభ్యులు తమ నియోజకవర్గ గ్రామీణ ప్రాంతంలో ప్రజలు తాగునీటి సరఫరాలో నాణ్యతా లోపాల కారణంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులు వివరించారు. ఈఅంశంపై తక్షణం స్పందించిన ఉపముఖ్యమంత్రి ఆనియోజకవర్గంలో తాగునీటి నాణ్యతపై క్షేత్రస్థాయి సర్వేకు ఆదేశాలు ఇచ్చారు. 44 గ్రామాల తాగునీటి అవసరాలు తీర్చే 40 ఫిల్టర్ బెడ్లు దెబ్బతిన్నట్లు గుర్తించి, రూ. 3.80 కోట్లతో వాటి పునరుద్ధరణ ప్రక్రియ తక్షణం పూర్తి చేశారు. అంతేకాదు వలివర్తిపాడు, మల్లాయపాలెం గ్రామాల్లో జరుగుతున్న నీటి శుద్ధి పనులను స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. విజయనగరం గొర్ల గ్రామంలో అతిసారం ప్రబలినప్పుడు ఆ ప్రాంత పర్యటనలో భాగంగా తాగునీటి సరఫరాలో లోపాలను గుర్తించి, తక్షణ మరమ్మతులకు ఆదేశాలు ఇచ్చారు. దేశంలో ఉన్న ప్రతి ఒక్కరికీ రోజుకు 55 లీటర్ల స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలన్న గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జల్ జీవన్ మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా, ప్రతి గ్రామానికీ సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో సిఎం నారా చంద్రబాబు నాయుడు సహకారంతో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తున్నట్టు పవన్ కల్యాణ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు

## తిరుమల సమాచారం

### వెంకన్న సర్వదర్శనానికి 24గంటలు

**తిరుమల,సెప్టెంబరు 5ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఆరంభానికి ముందే తిరుమల భక్తజనసంద్రంగా మారింది. శనివారం సాయంత్రానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్ లలోని 32 కంపార్టుమెంట్లు నిండిపోయి భక్తులు వెలుపల క్యూలైన్లలో శిలాతోరణం వరకు బారులుతీరారు. దీంతో స్వామి వారి సర్వదర్శనానికి మధ్యాహ్నానికి 24గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనానికి ఆరుగంటలపైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు. సాయంత్రం వరకు 42వేలమందికి మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 20 వేలమంది అర్ధరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి.



### కోలాహలంగా ఉట్లోత్సవం: వీక్షించిన మలయప్పస్వామి

**తిరుమల,సెప్టెంబరు 5ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణజన్మాష్టమి వేడుకల్లో భాగంగా తిరుమలలో శనివారం సాయంత్రం ఉట్లోత్సవం కోలాహలంగా జరిగింది. వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోకులాష్టమి ఆస్థానం నిర్వహించిన మరుసటి రోజు ఉట్లోత్సవాన్ని (శిక్యోత్సవం) నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా మలయప్పస్వామి బంగారు తిరుచ్చిపై, కృష్ణస్వామి మరో తిరుచ్చిపై తిరువీధుల్లో ఊరేగుతూ పలుప్రాంతాల్లో ఉట్లోత్సవాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, శ్రీవారి ఆలయ ఇన్ ఛార్జ్ డిప్యూటీ ఇఒ భయ్యాల భాస్కర్, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఎవిఒ అశోక్ పాల్గొన్నారు.

### సంస్థ ప్రతిష్ఠను కాపాడుకోవడం ముఖ్యం

**ఉద్యోగులు అంకితభావంతో సేవలందించాలి: అదనపు ఇఒ**



**తిరుమల,సెప్టెంబరు 5ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల తిరుపతి దేవస్థానంలో దేవుని చెంత పనిచేసే అవకాశం కలగడం గొప్ప అదృష్టమని, ఉద్యోగులు అంకితభావంతో సేవలందించడమే ప్రధానమని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి అభిప్రాయం వెలిబుచ్చారు. వ్యక్తిగతంగా ఎవరూ కూడా సంస్థకు నష్టం కలిగించరాదన్నదే ఆయన మనసులో మాట వెలిబుచ్చారు. ఉద్యోగులు, సిబ్బంది సమన్వయంతో సహకారంతో పనిచేయాల్సి ఉంటుందన్నారు. సాకులు దృష్టితో ఆలోచనకూడదని దేవుని చెంత టిటిడిలో పనిచేస్తూ,తప్పుచేయకూడదని అనే భావనతో విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఇటీవల టిటిడిలో చోటుచేసుకున్న కొన్ని ఘటనల నేపధ్యంలో శనివారం ఉదయం తిరుమలలో మీడియాప్రతినిధులతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. అందులో లక్షలాదిమంది భక్తులకు ఉద్యోగుల సేవలు, అధికారుల పనితీరు చాలావరకు బావుందని కితాబిచ్చారు. ఇటీవల 'వార్తదినపత్రికలో' వెలువడిన 'ఏసీబీ వలలో అక్రమార్కులు ఇంకా ఉన్నారట' టిటిడిలో అవినీతి తిమింగలాలో గుబులు!' అంశంపై కూడా ఆయన స్పందించారు. రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు కూడా ఆయా శాఖల్లో పనిచేస్తున్నారని, ఇక్కడ సంస్థ ముఖ్యమని అన్నారు. అలాంటి పరిస్థితుల్లో ఉద్యోగులు సంయమనంతో పనిచేయాల్సి ఉంటుందని అభిప్రాయాన్ని వెల్లడించారు. అనంతరం వెంకయ్య చౌదరి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, భక్తులకు సౌకర్యాలపై వివరించారు.



### శ్రీవారి పేరుతో నడిచే సంస్థలకు భారీ విరాళం

**ఎస్‌బిఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి**

**తిరుమల,సెప్టెంబరు 5ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవారి పేరుతో నడిచే సంస్థలకు ఎస్‌బిఐ భారీ విరాళాలందించింది. తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో పీడియాట్రిక్స్ క్రిటికల్ కేర్ యూనిట్ ఏర్పాటుకు 57 లక్షల రూపాయలు ఆర్థిక సాయాన్ని ఎస్‌బిఐ అధికారులు స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ జగదీష్‌కు విరాళం చెక్కును అందజేశారు. తిరుపతి బర్డ్‌కు 15 లక్షల రూపాయలు, తిరుపతిలోని రాస్ పరిధిలో మహిళలకు కుట్టు మిషన్ల కోసం 15 లక్షల చెక్కును ఇచ్చారు. భారతీయ స్టేట్ బ్యాంక్ సిఎస్ఆర్ (కార్పొరేట్ సామాజిక బాధ్యత) కింద సమాజ శ్రేయస్సు, ప్రజావైద్యం, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా దాదాపు 87.26 లక్షల విరాళాలను అందజేయడం జరిగిందని ఆ బ్యాంక్ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులుశెట్టి, ఉన్నతాధికారులు తెలిపారు.





### శ్రీవారి ఆశీస్సులతో శుభాలు కలగాలి: పలువురు ప్రముఖులు

**తిరుమల,సెప్టెంబరు 5ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు ప్రజలు సుఖసంతోషాలతో వుండాలని, రాష్ట్రప్రజలకు అంతామంచి జరగాలని తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని ప్రార్థించినట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. శనివారం ఉదయం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని భారత్ బయోటెక్ ఛైర్మన్ కృష్ణ ఎల్ల,టిడిపి నాయకులు గంటా శ్రీనివాసరావు, దేవినేని ఉమామహేశ్వర రావు, బుచ్చయ్య చౌదరి ,సినీ నిర్మాత డి వి వి దానయ్య కుటుంబ సభ్యులతో కలసి వేర్వేరుగా స్వామివారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. శ్రీవారి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



### బ్రహ్మోత్సవాలకు పటిష్ఠ భద్రత: టిటిడి సివిఎస్ఒ మురళీకృష్ణ

**తిరుమల,సెప్టెంబరు 5ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామివారిని దర్శించుకునేలా, వాహన సేవలను ఆనందంగా తిలకించేలా పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు టిటిడి సివిఎస్ఒ కె వి మురళీకృష్ణ తెలిపారు. తిరుమల ఆలయ నాలుగు మాడ వీధులతోపాటు ఇతర ప్రాంతాల్లో చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై శనివారం తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఇతర అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సివిఎస్ఒ మాట్లాడుతూ గత బ్రహ్మోత్సవాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి టిటిడి విజిలెన్స్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో పకడ్బందీ భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం రోజున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన నేపథ్యంలో పటిష్ఠమైన బందోబస్తు, బ్యారికేడింగ్ తదితర ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు ఐ.రామకృష్ణ, రవి మనోహరాచారి,వివిఎస్ఒ సురేంద్ర, తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# మన దృష్టి అంతా పిల్లల సంక్షేమంపైనే

## జువెనైల్ జస్టిస్ చట్టం అమలుపై కార్యక్రమంలో హైకోర్టు సిజె జస్టిస్ లీసాగిల్



**విజయవాడ, సెప్టెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** చట్టంతో వైరుధ్యం ఉన్న పిల్లవాడైనా, రక్షణ, సంరక్షణ అవసరమైన పిల్లవాడైనా.. మన దృష్టి ఎల్లప్పుడూ ఆ పిల్లల సంక్షేమం పైనే ఉండాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ అన్నారు. జువైనల్ జస్టిస్ చట్టం అమలులోకి వచ్చి పదేళ్ల అవుతున్న సందర్భంగా విజయవాడలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసాగిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు సామాజిక నిర్లక్ష్యానికి, పేదరికానికి బాధితులుగా మారుతుంటారని, పిల్లలలో సహజంగానే ఒక ప్రత్యేకమైన సున్నితత్వం ఉంటుందని ఆమె అన్నారు. వివిధ జువైనల్ జస్టిస్ బోర్డులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, చైల్డ్ ప్రొటెక్షన్ సొసైటీలు, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లు, స్పెషల్ జువైనల్ పోలీస్ యూనిట్లు అన్ని జిల్లాల్లోని ప్రత్యేక చైల్డ్ కేర్ హోమ్‌ల ఏర్పాటు, పనితీరు గురించి మాట్లాడుకుంటాం. చట్టం లక్ష్యాలు, ఉద్దేశాలకు అనుగుణంగా పిల్లలకు అనుకూలమైన విధానాలను అవలంబించడం గురించి మాట్లాడుతాం. ఇది పునరావాస న్యాయం, సంస్థాగత జవాబుదారీతనంపై ఆధారపడి ఉం టుందన్నారు. మన దత్తత ప్రక్రియలను సరళీకృతం చేశామని కూడా గర్వంగా చెప్పుకుంటాం, నిజానికి ఇక్కడ చేరిన మన మందరం మనల్ని మనం ప్రశ్నించుకోవాలన్నారు. మన ప్రయత్నాలలో మనం ఎంతవరకు విజయం సాధించామో తెలుసుకోవాలన్నారు. నిజానికి ఈ పిల్లలే మన దేశపు భవిష్యత్. మన భవిష్యత్ ఈ పిల్లల భద్రతపైనే ఆధారపడి ఉంది. మనం చాలా దూరం వచ్చాం. కానీ, ఇక్కడ కూర్చున్న మనలో ప్రతి ఒక్కరికీ మన వ్యవస్థలో ఉన్న స్పష్టమైన, నిలకడలేని లోపాల గురించి బాగా తెలుసు. ఆ లోపాలు మన కళ్లముందే స్పష్టంగా కనిపిస్తున్నాయి. నా దగ్గర పూర్తి గణాంకాలు, వివరాలు ఉన్నప్పటికీ, ఈ సమయంలో నేను ఆ వివరాల్లోకి వెళ్లడం లేదు. నైపుణ్యం కలిగిన సిబ్బంది కొరతతో మనం ఇబ్బంది పడుతున్నామన్నారు. మనం ఎదుర్కొంటున్న మరొక పెద్ద సవాలు డిజిటల్ ప్రపంచం నుంచి వస్తోంది. సైబర్ బుల్లీయింగ్, ఆన్‌లైన్ బాల లైంగిక వేధింపులు, పిల్లలకు అందుబాటులో ఉన్న అపరిమితమైన డిజిటల్ ఎక్స్‌పోజర్ ఇవన్నీ మనం తక్షణమే పరిష్కరించాల్సిన సమస్యలన్నారు. జస్టిస్ భట్టు దేవానంద్ మాట్లాడుతూ భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించేందుకే సమావేశం ఏర్పాటు చేశాం. పిల్లల సమస్యలకు సమగ్ర పరిష్కారం చూపడానికి రూపొందించారు. పిల్లలు పలు రకాల ఇబ్బందులకు గురై, బాధితులుగా మారుతున్నారు. నిరుపేద పిల్లల సంరక్షణ గృహాలు రక్షణలో ముఖ్యమైన భాగాలు. శిక్ష, నిర్బంధమే కాకుండా పునరావాసం, మానసిక పరివర్తనపై దృష్టి పెట్టాలన్నారు. అంచనాలపై కాకుండా కచ్చిత డేటా ఆధారంగా విధానాలను రూపొందించాలని జస్టిస్ భట్టు దేవానంద్ తెలిపారు.

# వశిష్టలో దూకి నలుగురు ఆత్మహత్యాయత్నం

**సూసైడ్ నోట్లో 'అమ్మా నన్ను క్షమించు'**

**మృత్యువుతో పోరాడుతున్న పద్మిని**

**నదిలో కొట్టుకుపోయిన భర్త, ఇద్దరు పిల్లలు**

**ఆర్థిక సమస్యలే బలవన్మరణానికి కారణం**



నంబూరి శ్రీనివాస్, ఇద్దరు చిన్నారులు(ఫైల్)

**నరసాపురం(చించినాడ) తణుకు సెప్టెంబరు 5 ప్రభాతవార్త:** పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం డివిజన్ ఎలమంచిలి మండలం చించినాడ వంతెన పైనుండి దూకి శనివారం నలుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరిలో కుటుంబ యజమాని నంబూరి శ్రీనివాస్ అతని ఇద్దరి పసిబిడ్డలు నదిలో కొట్టుకుపోయారు. శ్రీనివాస్ భార్య పద్మినిని మత్స్యకారులు రక్షి ంచడంతో ఆమెను పాలకొల్లు ఆసుపత్రికి తరలించి ఆ తరువాత మెరుగైన వైద్యం కోసం తణుకు తీసుకువెళ్లారు. రెండు స్కూటీల పై వచ్చి వారు ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. ఆ రెండు వాహనాలు వంతెన పైనే ఉన్నాయి. ఆర్థిక కారణాలతో వారు బలవన్మరణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ వారంలోనే వేల్పూర్‌కి చెందిన దంపతులు కేవలం అరకాసు ఉంగరం సమస్యతో తమ బిడ్డ ను స్కూటీ వద్ద వదిలి నదిలోకి దూకి చని పోయారు. ఆ మృతదేహాలు ఇంత వరకు దొర కలేదు. ఈ లోగానే మరో ముగ్గురు నది కెరటా లకు అంకితమయ్యారు. గత పదిహేను రోజులుగా వశిష్ట నది వరద నీటితో నిండి ఉంది. దీంతో మృతదేహాలు కూడా దొరకడం లేదు. నరసాపురం ప్రాంతంలో పేరుపాలెం బీచ్ చించినాడ వంతెన మృత్యుకుహరాలుగా మారాయి. పేరుపాలెం బీచ్ లో ప్రతి పది రోజులకి ఎవరో ఒకరు కెరటాలకు అంకితం అవుతూనే ఉన్నారు. ఇప్పుడు చించినాడ వంతెన డెత్ స్పాట్‌గా మారింది. తణుకు చెందిన శ్రీనివాస్ కిళ్ళీ కొట్టు నడుపుతారు. ముక్కు పచ్చలా రని పిల్లలను సైతం వారి ఆర్థిక సమస్యలకు బలి చేశారు. పద్మిని చివరిగా రాసిన నోట్లో రెండు లక్షల 60వేలు చెల్లించి ఇంటి దస్తావేజులు తీసుకో మని ఒకరికి రాస్తూ చివరిగా అమ్మ నన్ను క్షమిం చు అని కూడా పెట్టారు. పద్మిని మృత్యువుతో పోరాడుతోంది. ఆమె ఆత్మహత్యాయత్నం నుండి బయటపడింది కాబట్టి ఆత్మహత్య కారణాలు బయటకు రావచ్చు. చించినాడ వంతెన వద్ద జరిగిన రెండు ఆత్మహత్యలు కూడా తణుకు ప్రాంతం వారివే కావడం మరో విశేషం.

# వెలిగొండ ఫీడర్ కాలువలో ఇద్దరు యువకుల గల్లంతు

**ముమ్మరంగా కొనసాగుతున్న గాలింపు**



గల్లంతయిన యువకులు(ఫైల్)

**పెద్ద దోర్నాల సెప్టెంబరు 5 ప్రభాతవార్త:** శ్రీ పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలవలో ఇద్దరు యువకులు గల్లం తైన ఘటన కలకలం రేపుతోంది. పెద్ద దోర్నాల మండలం కటకానిపల్లెకు చెందిన యువకులు ఫీడర్ కాలువ చూసేందుకు వెళ్లారు. ముగ్గురు కాలువలోకి దిగారు. ఒకరు నీటి ప్రవాహం లో తప్పించుకోగా వారిలో రాజు(23) వినయ్(22)లు గల్లం తయ్యారు. ఆగస్టు 31వ తేదీ వెలుగొండ ప్రాజెక్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభోత్సవం చేశారు. కృష్ణా జలాలను చూసేందుకు ప్రజలు ఫీడర్ కాలువకు తరలివస్తున్నారు. ఇద్దరు యువకులు గల్లంతయిన సమాచారం అందుకున్న ఎర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గూడూరి ఎలక్షన్ బాబు కటకానపల్లెకు చేరుకొని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

అధికారులను అప్ర మత్తం చేసి సహాయక చర్యలు మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు.

ఈ సహా యక చర్యలలో మార్కాపురం ఆర్డీవో శివరా మిరెడ్డి, దోర్నాల మండల తాసిల్దార్ సిహెచ్ అశోక్ కుమార్ రెడ్డి, ఎర్రగొండపాలెం సిఐ కె అజయ్ కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

# కోటలో మహిళ దారుణ హత్య



**కోట (నెల్లూరు), సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** కోటలోని కోటమ్మగుడి కాలనీలో శుక్రవారం రాత్రి ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. కాలనీలో నివాసం ఉంటున్న యశోదమ్మ భర్త నాగరాజుతో సమీప బంధువైన నాగభూషణమ్మ గత కొంత కాలంగా చిల్లకూరు మండలం రామారెడ్డిపాళెంలో సహజీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో యశోదమ్మ శుక్రవారం తన ఇంటికి రమ్మని నాగభూషణమ్మను పిలిపించుకుంది. శుక్రవారం రాత్రి యశోదమ్మ భర్త నాగరాజు ఓజిలికి వివిధ పనులపై వెళ్లాడు. దీంతో పక్కాపథకంతో యశోదమ్మ ఇనుప రాడ్డుతో నాగభూషణమ్మ తలపై కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. నాగభూషణమ్మకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. తన భర్త చనిపోవడంతో కొంతకాలంగా నాగరాజుతో రామారెడ్డిపాళెంలో సహజీవనం చేస్తుంది. ఈ విషయం యశోదమ్మకు కూడా తెలుసు. అయితే తన బంధువు కావడంతోనే ఆమె చూసీచూడనట్లు వ్యవహరిస్తూ వచ్చింది. మనసులో కక్ష పెట్టుకుని ఈ ఘాతుకానికి పాల్పడిందని మృతురాలు నాగభూషణమ్మ తల్లి రోశమ్మ శనివారం కోట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు గూడూరు వన్‌టౌన్ సీఐ మాలకొండయ్య, కోట ఎస్ఐ పవన్ కుమార్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీమ్ నిపుణులు యశోదమ్మ ఇంటికి వెళ్లి వేలిముద్రలు సేకరించారు. హత్యకు ఉపయోగించిన ఇనుపరాడ్డును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలు యశోదమ్మ పరారీలో ఉంది. యశోదమ్మ హత్య చేసి ఉండవచ్చనని ఆకోణంలో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.అయితే మహిళను సహతోటి మహిళే హత్య చేసిందా? లేక ఇతర వ్యక్తులు ఎవరైనా ఈ హత్యలో పాల్గొన్నారో అనేది కూడా ప్రస్తుతం కాలనీలో చర్చనీయమైంది.పోలీసులు టెక్నికల్‌గా అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేస్తే ఈ హత్యలో ఎవరో ఎవరో పాల్గోనది తెలుస్తుంది. యశోదమ్మ గత రెండు రోజులుగా వాడిన ఫోన్ కాల్స్ డేటాను పరిశీలిస్తే కొంత మేర సమాచారం తెలస్తుంది.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం: అనంత జిల్లా వాసి దుర్మరణం




నిస్సార్(ఫైల్)

**అనంతపురం క్రైమ్, సెప్టెంబరు5 ప్రభాతవార్త:** ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిన అనంతపురం జిల్లాకు చెందిన ఓ యువకుడికి రోడ్డు ప్రమాదం కబళించింది. తాజాగా అమెరికాలోని అర్కాన్సాస్ రాష్ట్రంలో సంభవించిన ఘోర రోడ్డు ప్రమాదంలో అనంతపురం జిల్లాకు చెందిన నిస్సార్ అనే యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. విదేశాల్లో ఉన్నత చదువులు, ఉద్యోగం కోసం వెళ్లిన కుమారుడు అకాల మరణం చెందాడనే వార్త తెలియడంతో అనంతపురం జిల్లాలోని లోని ఆయన కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.ప్రమాదం జరి గిన తీరు, దానికి దారి తీసిన కచ్చితమైన పరిస్థితులపై స్థానిక అమెరికా పోలీసులు కేసునమోదు చేసి సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు. కారువేగం వల్ల అదుపుతప్పి ప్రమాదానికి గురైందా లేక ఎదురుగా వచ్చిన మరొక వాహనం ఢీకొట్టడం వల్ల ఈ దుర్ఘటన జరిగిందా అనే కోణంలో అధికారులు ఘటనా స్థలి నుంచి సాక్ష్యాధారాలు, సీసీటీవీ ఫుటేజీలను సేకరిస్తున్నారు. నిస్సార్ భౌతికకాయాన్ని స్వదేశానికి వేగంగా తరలించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని స్థానిక తెలుగు సంఘాల ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# వరుస దొంగతనాల కేసుల్లో ఇద్దరి అరెస్టు

## రూ.13 లక్షల విలువైన నగదు, బంగారం, వెండి స్వాధీనం



**పులిచెర్ల (తిరుపతి జిల్లా), సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** కల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రూ.13 లక్షల విలువైన దొంగసొత్తును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు 106 రామిరెడ్డిగారిపల్లి గ్రామానికి చెందిన ఎం. శంకర్‌రెడ్డి ఇంట్లో మే 15న రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి 8 గ్రాముల బంగారు గొలుసు, రూ.20 వేల నగదు అపహరించారు. దీనిపై కల్లూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా చిత్తూరు ఫింగర్‌ప్రింట్స్ బ్యూరో సిబ్బందితో పరిశీలన చేయించగా రొంపిచెర్ల మండలం దద్దాలవారిపల్లికి చెందిన ఆవులకుంట నరేష్ వేలిముద్రలుగా గుర్తించినట్లు నిర్ధారణ అయింది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం పులిచెర్ల రైల్వే స్టేషన్ వద్ద నరేష్‌తో పాటు అతనికి సహకరించిన పిన్న బోయున శ్రీనివాసులును పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో నరేష్ 2025లో కొత్తపేటలోని అబ్దుల్ మునాఫ్ ఇంటితో పాటు, కల్లూరు- పులిచెర్ల ంపా దారిలో వగాళ్లవారిపల్లి సమీపంలోని ఎల్లమ్మ ఆలయం, 106 రామిరెడ్డిగారిపల్లి, బలిజపల్లిలో ఏకాంబరం ఇంట్లో దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. అలాగే పీలేరు, చంద్రగిరి మండలాల్లోని ఆలయాల్లోనూ దొంగతనాలు చేసినట్లు అంగీకరించినట్లు పేర్కొన్నారు. దొంగతనం చేసిన బంగారాన్ని వివిధ బంగారు ఆభరణాల దుకాణాల్లో విక్రయించేందుకు శ్రీనివాసులు సహకరించినట్లు విచారణలో తేలిందన్నారు. నిందితుల నుంచి రూ. 2.42 లక్షల నగదు, 78 గ్రాముల బంగారం, 30 గ్రాముల వెండి కలిపి సుమారు రూ.13 లక్షల విలువైన దొంగసొత్తును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ దూడీ ఆదేశాల మేరకు చిత్తూరు డీఎస్పీ వెంకట నారాయణ ఆధ్వర్యంలో కల్లూరు సీఐ ఎం. జయరామయ్య పర్యవేక్షణలో ఎస్ఐ యు. వెంకటేశ్వర్లు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేశారు.

## రాజకీయ భవిష్యత్తుపై రేపు విజయసాయి ప్రకటన



**విజయవాడ,సెప్టెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తన భవిష్యత్తుపై కీలక నిర్ణయం తీసుకోనున్నారు.ఆయన ఈ నెల 7వ తేదీ మధ్యా హ్నం 1:15 నిమిషాలకు విజయవాడ లెమన్ ట్రీ ప్రీమియర్ హోటల్లో ప్రెస్ మీట్‌ను విజయసాయి నిర్వహిస్తున్నారు. ఈ ప్రెస్ మీట్‌లో భవిష్యత్తు రాజకీయ విధానం గురించి కీలక ప్రకటన చేస్తానని ఎక్స్‌లో విజయసాయిరెడ్డి పోస్ట్ చేసారు.విజయసాయి రెడ్డి ఇటీవల తానెందుకు వైసిపికి రాజీనామా చేయాల్సి వచ్చింది బహిరంగ లేఖలో వెల్లడించారు.తనపై సజ్జల రామకృష్ణారెడ్డి భౌతిక దాడికి పాల్పడిన విషయాన్ని విజయసాయి వెల్లడించారు.ఈ అంశాన్ని జగన్ పట్టించుకోలేదన్నారు.నూతన పార్టీని త్వరలోనే ప్రకటిస్తానంటూ ఇదివరకే వెల్లడించారు సాయిరెడ్డి. దీంతో ఆయన ఏర్పాటు చేసిన ఈ ప్రెస్ కాన్ఫరెన్స్ పై అందరి చూపూ నిలిచింది. ఎలాంటి ప్రకటన చేయబోతోన్నారనేది ఇప్పటి నుంచే చర్చనీయాంశంగా మారింది.ఈ క్రమంలో ఏపీలో ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ తెరమీదికి రావాల్సిన అవసరం ఉందంటూ విజయసాయిరెడ్డి తాజాగా ఓ ట్వీట్ పోస్ట్ చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

## హైవే వంతెనపై ప్రమాదం

### బస్సు డ్రైవర్ మృతి, మహిళకు తీవ్రగాయాలు



**మనుబోలు (నెల్లూరు), సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** మనుబోలు మండలంలోని గురవిందపూడి క్రాస్ రోడ్ సమీపంలోని కృష్ణపట్నం క్రాస్‌రోడ్డు వద్దహైవేవంతెన పై శనివారం తెల్లవారు జామున ఘోరరోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ముందు వెళుతున్న లారీని వెనుక నుండి ట్రెవల్ బస్సు ఢీకొనడంతో బస్సు డ్రైవర్ అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో ఒక మహిళకు తీవ్ర గాయాలు అయ్యాయి. మరో 18 మంది ప్రయాణికులకు స్వల్పగాయాలు అయ్యాయి. పోలీసుల వివరాలు మేరకు తిరుపతి నుండి విజయవాడకు సుమారు 30 మంది ప్రయాణికులతో వెళుతున్న ట్రావెల్ బస్సు కృష్ణపట్నం క్రాస్‌రోడ్డు సమీపంలోని హైవే వంతెనపైకి చేరుకున్న సమయంలో ముందు వెళుతున్న లారీని వేగంగా ఢీకొంది. దీంతో బస్సు ముందు భాగంగా తీవ్రంగా దెబ్బతినడంతో డ్రైవర్ లారీ వెనుక భాగంలో ఇరుక్కుపోయి మృతి చెందాడు. డ్రైవర్ పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాద సమాచారం అందుకున్న హైవే మొబైల్ సిబ్బంది హెడ్‌కానిస్టేబుల్ మస్తాన్, కానిస్టేబుల్ మహేష్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని బయటకు తీసి చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. ఈఘటనపై పోలీసుల వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉత్తమ జర్నలిస్టు అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

### 12 విభాగాల్లో పురస్కారాలు

### 28లోగా దరఖాస్తులు అందాలి

**విజయవాడ, సెప్టెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** జర్నలిజం రంగంలో విశేష సేవలందిస్తూ, వృత్తిపరమైన ప్రతిభను కనబరిచిన పాత్రికేయులను ప్రోత్సహించి, వారి సేవలను గుర్తించి గౌరవించేందుకు 2025 సంవత్సరానికి 12 విభాగాల్లో ఉత్తమ జర్నలిస్టు అవార్డులు అందజే యాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ అవార్డులకు అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు ఆయా విభాగాలకు చెందిన జర్నలిస్టుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలిపారు.అర్హులైన జర్నలిస్టులు తమ దరఖాస్తులను 2026 సెప్టెంబరు 28వ తేదీ సాయంత్రం 5.00 గంటల్లోగా కింది చిరునామాకు పంపించాలని ఆయన సూచించారు.డైరెక్టర్,సమాచార పౌరసంబంధాల శాఖ, 2వ అంతస్తు, ఎన్టీఆర్ పరిపాలన భవనం,పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్, విజయవాడ-520013..కమిటీ విచక్షణాధికారంతో ఎంపిక చేసే పురస్కారాలు .కింది మూడు పురస్కారాలకు జర్నలిస్టుల నుంచి ప్రత్యేకంగా దరఖాస్తులు స్వీకరించకుండా, ఎంపిక కమిటీ తన విచక్షణాధికారంతో పురస్కార గ్రహీతలను ఎంపిక చేస్తుంది. 1.వి.ఆర్.నార్ల జీవిత సాఫల్య పురస్కారం. 2. కొక్కు అహో బలరావు ఉత్తమ ఫోటో జర్నలిస్టు అవార్డు 3. మద్దూరి అన్నపూర్ణయ్య పేరిట రాష్ట్రంలోని చిన్న,మధ్యతరహా వార్తాపత్రికల సంపాదకులకు అందించే అవార్డు.



రైతులతో మాట్లాడుతున్న రోణంకి కూర్మనాధ్

## వచ్చే మార్చికి భూవివాదాలు లేని రాష్ట్రంగా ఎపి : రోణంకి కూర్మనాధ్

**విజయవాడ, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** వచ్చే ఏడాది మార్చి నాటికి రీసర్వే పనులు పూర్తిచేసి రాష్ట్రాన్ని భూవివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, సిబ్బంది కృషిచేస్తున్నట్లు రాష్ట్రసర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ రోణంకి కూర్మనాధ్ రైతులకు భరోసా ఇచ్చారు. ఎన్‌టిఆర్‌జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలో నిర్వహిస్తున్న భూముల రీసర్వే పనులను శనివారం ఉదయం ఆయన ఆకస్మిక తనిఖీ చేసారు. ఈసందర్భంగా కూర్మనాధ్ మాట్లాడుతూ రీసర్వేలు తప్పులు జరుగకుండా ఉండేందుకు రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వే చేసే రోజున సంబందిత రైతు లేదా వారి కుటుంబసభ్యులు క్షేత్రస్థాయిలో ఉండాలని, సర్వేపూర్తయిన తరువాత డాక్యుమెంట్ వెరిఫికేషన్ ద్వారా సరిహద్దుల నిర్ణయం రైతు సమక్షంలోనే జరగాలన్నారు. రైతు చేతికి సరైన కొలతలతో కూడిన పట్టాదారు పాసుపుస్తకం అందచేసే వరకు సమాచారం తప్పనిసరిగా అందించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యా ప్తంగా 2,800 బృందాలతో అత్యాధునిక రోవర్స్‌తో సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులతో మాట్లాడి సర్వే పై రైతుల అభిప్రాయాలు సేకరించారు. ఈకార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలపై కొత్త నిబంధనలు

**విజయవాడ,సెప్టెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో నగరపాలక సంస్థల ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఇటీవల తీసు కొచ్చిన ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ చట్టాల సవరణ చట్టం, 2026 అమలుకు ఆమోదం తెలుపుతూ ఏకకాలంలో మేయర్, వార్డు మెంబర్ల ఎన్నికల నిర్వహణ నియమావళిని ఖరారు చేసింది. ఈమేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేశ్ కుమార్ జీవో నెం. 210,జీవో నెం. 211 పేరిట రెండు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ చట్టాలకు చేసిన తాజా సవరణలు ఈ ఏడాది ఆగస్టు 28 నుంచే రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వచ్చినట్లు జీవో 210 ద్వారా ప్రభుత్వం నోటిఫై చేసింది. ఈ సవరణల ఆధారంగానే ఇకపై రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ కొనసాగనుంది. సవరించిన చట్టం ప్రకారం ఖిది ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్స్ మేయర్, వార్డు మెంబర్ల ఎన్నికల నిర్వహణ రూల్స్ 2026ఖి ను తక్షణమే అమల్లోకి తెస్తూ జీవో 211ను విడుదల చేశారు. నామినేషన్ల ఘట్టం నుంచి ఓట్ల లెక్కింపు వరకు పకడ్బందీగా ఈ నిబంధనలను రూపొందించారు. మేయర్ లేదా కార్పొరేటర్ స్థానాలకు పోటీ చేసే జనరల్ కేటగిరీ అభ్యర్థులు రూ. 5,000, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అభ్యర్థులు రూ. 2,500 మేర నామినేషన్ డిపాజిట్ చెల్లించాలి. ఒక అభ్యర్థి ఒకే స్థానానికి గరిష్టంగా నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను మాత్రమే దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు.

రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలను వివరి స్తున్న నిపుణుల మాటలను సర్కారీ విభాగాలు ఇకనైనా పట్టించుకోవాల్సిన అవసరం వుంది. డ్రైవర్ల నిర్లక్ష్యానికి కళ్లెం వేయడంతో పాటు రోడ్డు ఇంజనీరింగ్‌ను మెరుగుపరచాల్సిన అవసరాన్ని నిపుణులు పదేపదే గుర్తుచేస్తున్నారు. రోడ్డు ఇంజనీరింగ్ ను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మార్చాల్సిన అవసరం వుంది. ప్రమాదకర మలు పులను సరిచేయాల్సి వుంది. దీనివల్ల అనేక ప్రాంతాలలో రహదారులు ఇప్పటికీ నెత్తు రోడుతున్నాయి. ఇక దీని తరువాత వాహనాలను నడిపే డ్రైవర్లు డ్రైవింగ్‌పై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలి. వాహనాలను నడిపే డ్రైవర్ అంతకుముందు కచ్చితంగా ఆరుగంటల పాటు విశ్రాంతి తీసుకోవాలనే నిబంధన వున్నా ఇది ఎక్కడా అమలవడం లేదు. డ్రైవర్ పక్కన కూర్చునే వ్యక్తి ఎట్టి పరిస్థితుల్లోనూ నిద్రపోకూడదు. ఇలా చేస్తే డ్రైవర్‌కు నిద్ర మత్తు ఆవహించి మొదటికే మోసం వచ్చే వీలుంది. మలుపుల వద్ద, చౌరస్తాల వద్ద కచ్చితంగా ఒకటికి పదిమార్లు గమనించిన తరువాతే వాహనాలను ముందుకు తోలాలి. ఇక అన్నింటికి మించి డ్రైవర్లు పాటలు వినడం లేదా, ఇతర ఆలోచనలో వుండడం, సెల్‌ఫోన్లు మాట్లాడడం వంటివి చేయడం మరింత ప్రమాదకరంగా చెప్పాలి. ఇక దీనికితోడు వాహనాలను నడిపే డ్రైవర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించరాదు. ఇటీవల జరిగిన అనేక ప్రమాదాలలో బస్సులు, ఇతర వాహనాల డ్రైవర్లు మద్యం సేవించడం వల్ల జరిగాయని తేలింది. ఇక అన్నింటికి మించి తగిన అర్హత లేనివారు అంటే ద్విచక్ర వాహనం డ్రైవింగ్ లైసెన్స్ వున్న వారు కారు లేదా బస్సును నడపడం ఎంత మాత్రం సరికాదని రవాణా రంగ నిపుణులు చెబుతున్నారు. ఈ విషయంలో రెండు రాష్ట్రాల విభాగాలు ఇకనైనా దృష్టి

# ఆంక్షలున్నా.. అడుగడుగున ప్రమాదాలే

**డి. మురళీధర్ అమర్‌నాథ్**

దేశ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు ఏయేటికాయేడు పెరిగిపోతున్నాయి. జాతీయ రహదారులతో పాటు రాష్ట్రస్థాయి రహదారులు, ఆఖరుకు మారుమూల ప్రాంతాలలోని రోడ్లు సైతం రక్తం రుచి చూడని రోజులేదంటే అతిశయోక్తి కాదు. గడచిన కొన్నేళ్లలో దేశంలోని అనేక ప్రాంతాలలో రహదారులు భారీగా అభివృద్ధి చెందడం ఒక ఎత్తయితే ఇదే సమయంలో ప్రమాదాలు సైతం అంతే స్థాయిలో పెరగడం గమనార్హం. రోడ్డు ప్రమాదాలకు మానవ తప్పిదాలు 70 శాతం వరకు ఉంటే రహదారుల నిర్మాణంలో ఇంజనీరింగ్ లోపం, ఇతరత్రా కారణాలు మరో 30శాతం వరకు ఉన్నాయని, వీటిని సరిచేస్తే ప్రమాదాల నివారణ సాధ్యమని నిపుణులు పదేపదే చెబుతున్నా ఆ దిశగా సర్కారీ విభాగాలు పటిష్టమైన చర్యలుతీసుకోకపోవడంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. రోడ్డు ప్రమాదాలు అంటే రెండు వాహనాలు ఢీ కొనడమో, లేదా కొందరు మరణించడం లేదా ఇంకొందరు గాయపడడం కాదు. కొన్ని కుటుంబాలు వీధిన పడడం అనే విషయం అందరికి తెలిసిందే. ముఖ్యంగా బీద, మధ్య తరగతి ప్రజలు రోడ్డు ప్రమాదాల బారిన పడిన సమయంలో అనేక కుటుంబాలు కోలుకునేందుకు చాలాకాలం పడుతుందనేది కూడా విదితమే. దేశవ్యాప్తంగా ఏటా లక్షా 83వేల మందికి పైగా రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తుండగా ఐదు లక్షల మందికి పైగా క్షతగాత్రులవుతున్నారు. ఇందులో తెలుగు రాష్ట్రాల నుంచి 15 వేలమంది వరకు మృత్యువాత పడుతున్నారు. తెలంగాణ నుంచి ఏడు వేలకు పైగా మృత్యువాత పడుతున్నారు. రోడ్డు ప్రమాదాలకు మానవ తప్పిదంతోపాటు రోడ్ ఇంజనీరింగ్ లోపాలు, ప్రమాదకర మలుపులు, రోడ్లపై గోతులు ఉండడం వంటి కారణాలు ప్రధానంగా చెప్పాలి. ఇక వీటి నివారణలో ప్రభుత్వవిభాగాలు కృషి చేయకపోవడం వాహనదారుల పాలిటశాపంగామారింది. తెలంగాణలోని చేవెళ్లలో ఏడాదిన్నర క్రితం ఓ ఆర్టీసీబస్సును కంకర లోడుతో వెళుతున్న టిప్పర్ ఢీకొన్న ఘటనలో 18 మంది ప్రయాణీకులు మరణించడం తెలిసిందే. తాజాగా సూర్యాపేట్ జిల్లాలో రోడ్డుపై ఆగివున్న లారీని ప్రైవేటు బస్సు ఢీకొనగా ఆరుగురు మరణించారు. మూడేళ్ల క్రితం కర్నూలు జిల్లా వెల్దుర్తి వద్ద హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళుతున్న ప్రైవేటు బస్సు అతివేగంతో వెళుతూ ఒక వాహనదారుడిని తప్పించపోయి డివైడర్‌ను దాటి మరో మార్గంలో వెళుతున్న తుఫాన్ వాహనాన్ని ఢీ కొంది. ఈ ప్రమాదంలో తుఫాన్ వాహనంలోని 15 మంది, రోడ్డు పక్కన ఆగివున్న మరో ప్రయాణీకుడు మొత్తం 16 మంది మరణించారు. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా వుండే వెల్దుర్థి జంక్షన్ వద్ద బస్సు డ్రైవర్ 120 కిలోమీటర్ల వేగంతో బస్సును నడపడం ప్రమాద



తీవ్రతను పెంచింది. అంతకు ముందు తెలంగాణలోని ప్రజ్ఞాపూర్ వద్ద ఆర్టీసీ డ్రైవర్, లారీ డ్రైవర్‌ల నిర్లక్ష్యం కారణంగా 13మంది బలయ్యారు. ఈ రెండు వాహనాలు అతి సమీపం నుంచి మితిమీరిన వేగంగా వెళ్లడం, ఎదురుగా వాహనాలు వస్తున్న విషయాన్ని కూడా గమనించలేకపోవడం వల్ల ఏక కాలంలో నాలుగు వాహనాలు ఒకదానితో మరొకటి ఢీకొనడంతో మొత్తం 13మంది దుర్మరణం చెందారు. ఈ ప్రమాదాలకు కారణమైన ఆర్టీసీ, లారీ డ్రైవర్లు సురక్షితంగా బయట పడడం విశేషం. ఈ ఘటనకు ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యం ఎక్కువగా వుండడంతో అతనిపై పోలీసులు కేసు కూడా నమోదుచేశారు. దీని తరువాత కొండగట్టు వద్ద ఆర్టీసీ బస్సు ప్రయాణీకులతో క్రిక్కిరిసి పోయి ఘాట్ రోడ్డులో వెళుతూ ఒక్కసారిగా లోయలో బోల్తా పడడంతో 65మంది మరణించడం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. తెలుగు రాష్ట్రాల ఆర్టీసీ చరిత్రలో ఇంత మంది ఒక ప్రమాదంలో మరణించడం ఇదే తొలిసారిగా చెప్పాలి. ఒక్క తెలుగురాష్ట్రాలే కాదు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో రోడ్డు ప్రమా దాల తీవ్రత ఎక్కువగా వుంది. ఇందు లో తమిళనాడు రాష్ట్రంమొదటి స్థానంలో వుంది. గతఏడాది దేశ వ్యాప్తంగా ఐదు లక్షల 13వేల 474ప్రమాదాలు సంభవించగా లక్షా 83వేల 434మంది మరణించారు. సగటున రోజుకు 502 మంది రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్నారు. దేశంలో గంటకు 59ప్రమాదాలు సంభవిస్తుండగా 21మంది చనిపోతున్నారు. ప్రమాదాలలో మరణిస్తున్నవారిలో ద్విచక్ర వాహనదారులు 46.2 శాతం, పాదచారులు 20.60 శాతం వుంది. ఈఏడాది జూలై నెలాఖరు వరకు రెండులక్షల 96 వేల 447 ప్రమాదాలు సంభవించగా లక్షా 1139 మంది చనిపోయారు.

**వాహనదారులు పాటించాల్సిన నియమాలు ఏమిటంటే**

అనారోగ్యంతో వున్నవారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు వాహనాలను నడపరాదు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు డ్రైవింగ్‌ను వృత్తిగా తీసుకుంటే వైద్యుల సూచనలతో మందులు వాడుతూ నిబంధనల మేరకుసుదూర ప్రయాణాలు కాకుండా స్వల్ప దూరం మేరకు వాహనాలను నడపవచ్చు. వాహనాలను రోడ్డుపై తీసుకువచ్చే సమయంలో వాటి కండీషన్ సరిగ్గా వుందో? లేదో? చూసుకోవాలి. ఒకవేళ కండీషన్ బాగా లేకున్నా, వాహనం పాతది అయినా, టైర్లు సరిగ్గా లేకుంటే వాహనాలు రోడ్డుపైకి తేరాదు. ఒకవేళ రహదారులపై వాహనం పాడై ఆగిపోతే వాటిని వెంటనే రోడ్డుపై కాకుండా ఇతర వాహనాలకు ఇబ్బంది లేకుండా పక్కననిలిపి, దీనిపై వెంటనే పోలీసులకు సమాచారం అందించి వీలైనంత త్వరలో ఆ వాహనాన్ని మరమ్మతులకు పంపాలి. వాహనం నడిపే సమయంలో కారు అయితే డ్రైవర్‌తో పాటు పక్కన వున్న వ్యక్తి సీటు బెల్టు, ద్విచక్ర వాహనం అయితే వాహనదారుడితో పాటు వెనకాలవున్న వ్యక్తి కూడా హెల్మెట్ తప్పకుండా ధరించాలి. సుదూర ప్రయాణించే సమయంలో వాహనదారులు ప్రతి రెండు గంటలకు ఒకసారి ఆగి పావు గంట పాటు విశ్రాంతి తీసుకోవాలి. ఇదే సమయంలో వాహనం కండీషన్ చూడాలి. వీలైతే ఇద్దరు డ్రైవర్లు వుండేలా చూసుకోవాలి. ద్విచక్ర వాహనంపై సుదూర ప్రయాణం మంచిదికాదు. వాహనం నడిపే సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించకూడదు. భోజనం కానీ టిఫిన్‌కానీ పరిమితంగా భుజించాలి. ఒకవేళ అంతకు ముందు పరిమితంగా మద్యం సేవించి వుంటే కనీసం ఎనిమిది నుంచి పది గంటల పాటు విశ్రాంతి తీసుకోవాలి. అతిగా మద్యం సేవించి వుంటే 24 గంటల నుంచి 36గంటలపాటు డ్రైవింగ్‌కు దూరంగావుండాలి. వాహనం నడిపే వారు పూర్తిగా డ్రైవింగ్ పైనే దృష్టి సారించాలి. డ్రైవింగ్ చేస్తూ పాటలు వినడం, ఇతర అంశాలపై దృష్టిసారించడం వంటివి చేయకూడదు. వాహనదారులు ఎడమవైపునుంచే ఓవర్ టేక్ చేయాలి. ఓవర్ టేక్ చేసే సమయంలో ముందువున్న వాహన డ్రైవర్‌నుంచి సిగ్నల్ అందుకున్న తరువాతే ముందుకు కదలాలి. అడ్డదిడ్డంగా ఓవర్ టేక్ చేయకూడదు. వాహనాలు నడిపే డ్రైవర్ నిద్రవస్తుందని అనిపిస్తే వెంటనే వాహనాన్ని పెట్రోల్ సురక్షితమైన చోట ఆపి కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నాక మళ్లీ డ్రైవింగ్ చేయాలి. జాతీయ,రాష్ట్ర స్థాయి రహదారులపై నడిపే వాహనాలను ఆయా వాహనాల కండీషన్‌ను బట్టి 80 కిలోమీటర్ల నుంచి 120 కిలోమీటర్ల వేగం వరకు నడపవచ్చు. అయితే మన రహదారులపై వంద కిలోమీటర్ల వేగంతో మాత్రమే ప్రయాణించేందుకు అనుమతి వుంది. ఒకవేళ రోడ్లపై వాహనాలు లేకున్నా ఇంతకు మించి వేగంతో వెళితే అనుకోని ఘటనలు ఎదురైతే వాహనంపై నియంత్రణ తప్పి ప్రమాదంలో పడే అవకాశం వుంది. రాత్రి వేళల్లో, తెల్లవారు జామున ప్రయా ణాలు సాగించిన సమయంలో డ్రైవర్లు మరింత జాగ్రత్తగా వుండాలి. తెల్లవారు జామున వాహనాలు నడిపే సమయంలో కళ్లు రెప్పవాల్చి అనుకోకుండా కునుకువచ్చే అవకాశాలు ఎక్కు వగా వుంటాయి. సరిగ్గా ఇదే సమయంలోనే క్షణ కాలంలో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతుంటాయి. రాత్రి వేళల్లో డ్రైవింగ్ చేస్తే ప్రతి గంట ఓసారి వాహనాన్ని ఆపి ముఖాన్ని నీటితో శుభ్రం చేసుకోని టీతాగాలి. వర్షాకాలంలో వాన పడిన సమయంలో తక్కువ వేగంతో వెళ్లాలి. వాహనాలలో పరిమితికి మించి ప్రయాణీకులు వుండరాదు. దీంతో పాటు గ్యాస్ సిలిండర్లు, పేలుడు పదార్థాలు తరలించే సమయంలో పూర్తి జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. ●

---

మణిపూర్

మణిపూర్ లో మంటలు ఇంకా ఇంకా ఎగసి పడుతున్నాయి. యేడాదిపాటు సాగిన రాష్ట్రపతి పాలన తర్వాత కూడా రాష్ట్రంలో పరిస్థితులు చక్కబడకపోవడం, తర్వాత ఏర్పడిన ప్రభుత్వం నిర్దిష్టమైన పరిష్కారప్రణాళిక రూపొందించకపోవడంతో ఈ మంటలు ఇప్పట్లో చల్లారుతాయా? అనే సందేహం కలుగుతోంది. గత ఫిబ్రవరి 4న రాష్ట్రపతి పాలన ఎత్తివేసి ఖేమ్ చంద్ సింగ్ నాయకత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేశారు. అంతకు ముందు ఉన్న బీరేన్ సింగ్ ప్రభుత్వం శాంతిభద్రతల పరిరక్షణలో పూర్తిగా విఫలం కావడంతో మణిపూర్ సంక్షోభం దేశంలో అందరి దృష్టిని ఆకర్షించింది. రాష్ట్రపతి పాలన తర్వాత కొత్త ప్రభుత్వం ఏర్పాటైనా అశాంతి అంతా పాతదే కొనసాగడంతో ఇప్పుడు మళ్లీ సంక్షోభం తలెత్తింది. మరో యేడాదిలో ఎన్నికలు జరగవలసి ఉన్నా, తెగల మధ్య రాజీ కుదిర్చే ప్రయత్నాలు జరగకపోవడం బిజెపి ప్రభుత్వ వైఫల్యమనే చెప్పాలి. ప్రధానంగా ఉన్న మెయితీ, కుకీ జో సమస్యకు నాగాల సమస్య తోడవడంతో ఇప్పుడది మరింతగా ముదిరిపోతోంది. ముఖ్యమంత్రి ఖేమ్‌చంద్ మెయితీ వర్గానికి చెందినవారు కాగా, ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు కుకీ, నాగా వర్గాలకు చెందినవారు. నాగాలు, కుకీలు బయట ఎన్ని ఘర్షణలకు పాల్పడుతున్నారో అదే దృశ్యం అసెంబ్లీలో కూడా కనిపించడమే విచారకరం. మెజారిటీ మెయితీలు మైనారిటీలైన కుకీ, నాగాలతో తలపడడం రానురాను రావణకాష్టంలా మారుతోంది. గత మంగళవారం జరిగిన దారుణ సంఘటన చాలు ప్రస్తుతం మణిపూర్ కుంపటి ఎలా రగులుతున్నదో చెప్పడానికి. మూడు నాగా గ్రామాలపై కుకీలు పెద్ద ఎత్తున దాడులు జరిపి నానా బీభత్సం సృష్టించారు. కొన్నిడజన్ల ఇళ్లనుబూడిద చేశారు. ఆ ఘటనల్లో నలుగురు మరణించడంతో పాటు పెద్దసంఖ్యలో నాగాలు నిరాశ్రయులయ్యారు. మరోవంక మెయితీలతో కూడా కుకీల ఘర్షణలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇద్దరు కుకీ జో ఎమ్మెల్యేలు గత బుధవారం అసెంబ్లీలోకి ప్రవేశించి కలకలం సృష్టించారు. మెయితీల ఆధిక్యత ఉన్న అసెంబ్లీలోకి ప్రవేశించవద్దంటూ కుకీల అత్యున్నత సంస్థ అయిన

# ఆరని మంటలు!

**ఎ.వి.వి ప్రసాద్**

'కుకీ ఇన్పీ మణిపూర్' గతంలోనే ఆదేశాలిచ్చింది. అయితే వాటిని ధిక్కరిస్తూ కుకీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లారు. కుకీ పీపుల్స్ అలయెన్స్‌కు చెందిన ఎమ్మెల్యే కిమ్నో హాకిప్ హ్యాంగ్ సింగ్ , మరో ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అసెంబ్లీలో కూర్చున్నారు. కుకీ జోల కోసం ప్రత్యేక పాలనా యంత్రాంగం ఏర్పాటుచేసే దాకా తమ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాబోరని కుకీ ఇన్పీ ప్రకటించింది



ఖేమ్ చంద్

కానీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకే తాము అసెంబ్లీకి వచ్చామని వారు అంటున్నారు. కుకీ జో వర్గానికి ప్రస్తుతం తొమ్మిది మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. అసెంబ్లీలోని మొత్తం 60 మంది సభ్యుల్లో దాదాపు 40 మంది మెయితీ వర్గానికి చెందినవారు కాగా, కుకీ, నాగాలకు చెందిన వారు తొమ్మిది మంది చొప్పున ఉన్నారు. నాగాలకు చెందిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలు కొద్దిరోజుల క్రితం కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఓ లేఖ రాస్తూ, కుకీ నేషనల్ ఫ్రంట్ నాయకులపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని, వారివల్ల నాగాలు తీవ్ర హింసలకు గురవుతున్నారనీ తెలిపారు. గత మే నెలలో పలువురు నాగాలు కిడ్నాప్‌కు గురి కావడం, తర్వాత వారి మృత దేహాలను కనుగొనడం అందరికీ దిగ్భ్రాంతిని కలిగించింది. కేంద్రానికి నాగాలు రాసిన లేఖ బయటకు పొక్కడంతో కుకీలు మరింతగా రెచ్చిపోయి హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నారు. మెయితీల ఆధిక్యత ఉన్న అసెంబ్లీలో అడుగు పెట్టవద్దని కుకీ ఇన్పీ నేతలు జారీ చేసిన ఆదేశాలను ఇద్దరు ఎమ్మెల్యేలు ధిక్కరించడంతో వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోంటారని తెలుస్తోంది. అదే జరిగితే ఘర్షణలు మరింత అధికమయ్యే అవకాశం ఉంది. గత ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ఎంత నిర్లిప్తంగా ఉండేవారో, ఇప్పుడు ఖేమ్ చంద్ కూడా అదే బాటలో నడుస్తున్నారు. ఆయన మెయితీ వర్గానికి చెందినవారు కావడం వల్లనే కుకీల సమస్య పట్టించుకోవడం లేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. మెజారిటీ వర్గమైన మెయితీలు ఎస్టీ హోదా డిమాండ్ చేస్తూ చాలా కాలం నుంచే ఆందోళనలు జరుపుతున్నారు. దానిని వ్యతిరేకిస్తున్న కుకీలు ఘర్షణలకు పాల్పడుతున్నారు. ఈహింసా కాండలో గత మూడేళ్లలోను 250 మంది చనిపోగా, 60 వేల మంది పైగా నిరాశ్రయులయ్యారు. ఈ ఘర్షణలు దారికి రాకపోవడంతో గత సంవత్సరం రాష్ట్రపతి పాలన విధించారు కానీ తర్వాత కూడా అదే పరిస్థితి కొనసాగింది. ఆ తర్వాత మళ్లీ ప్రభుత్వం ఏర్పాటైనా సమస్యకు పరిష్కారం లభించనే లేదు. మెయితీలకు ఎస్టీ హోదా ఇస్తే గిరిజనుల ఆధిక్యం ఉన్న కొండ ప్రాంతాలపై వారికి కూడా హక్కు ఏర్పడుతుంది. ప్రస్తుతం కొండప్రాంతాల్లోని గిరిజన భూములకు కొన్ని ప్రత్యేక రక్షణలున్నాయి. మణిపూర్‌లో దాదాపు 10 శాతం ప్రాంతం ఇంఫాల్ లోయ, మిగిలిన అధిక భాగం కొండ ప్రాంతాలు. మెయితీలు ప్రధానంగా లోయ,మైదాన ప్రాంతాల్లోను, కుకీలు, నాగాలు కొండప్రాంతాల్లోను నివశిస్తున్నారు. అయితే కొండ ప్రాంతాలపై మెయితీల కన్ను పడడం వల్లనే సంక్షోభం మొదలయింది. ఈ ప్రధాన సమస్యను కేంద్రం సాధ్యమైనంత త్వరగా పరిష్కరించవలసి ఉంది. ముఖ్యమంత్రిని మారిస్తే సమస్య పరిష్కారం కాదనే విషయం అర్థమైంది గనుక బిజెపి అధిష్ఠానం ఇప్పటికైనా సరైన వ్యూహం రూపొందించడం అవసరం. మణిపూర్ ను మరోసారి విభజించే అవసరం తలెత్తకుండా సమస్యను పరిష్కరించాలి. మయన్మార్ నుంచి రాష్ట్రంలోకి పెరుగుతున్న అక్రమ వలసలు నిరోధించే దిశగా చర్యలు తీసుకోవాలి. మణిపూర్ గ్రామాలు కాలడాన్ని మిగిలిన దేశం చోద్యం చూస్తూ ఉంటే ఎలా? ఎన్నికలు వచ్చేలోగా పరిష్కారం లభిస్తుందా! చూడాలి. ●

---


అమెరికా

మధ్యప్రాచ్యంపై కాలుదువ్విన అమెరికా అధ్యక్షుడికి ఏడు నెలలుగా అక్కడ చేస్తున్న యుద్ధం కొలిక్కిరాకపోవడం, ఆయుధనిల్వలు తరిగిపోతున్నాయన్న ఆందోళన, పైగా రక్షణరంగానికి సంబంధించిన కీలక సమాచారం లీకు అవుతుండటం వంటివి ట్రంప్‌నకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయనే చెప్పాలి. యుద్ధతంత్రంలో ఎక్కడో లోపం జరిగిందని భావిస్తున్నట్లు వస్తున్న లీకులపైదృష్టి పెట్టిన ట్రంప్ ముందు పెంటగాన్ రక్షణ వ్యవస్థను ప్రక్షాళన మొదలుపెట్టారు. పనిలోపనిగా లీకులపైనే ఫోకస్ పెంచారు. అమెరికా సైన్యంలో కీలకంగా ఉన్న జాయింట్ స్టాఫ్‌లోని అనుమానాలున్న వ్యక్తులు అధికారులకు పాలిగ్రాఫ్ పరీక్షలు నిర్వహిచాలని నిర్ణయించారు. అనుకోవడమే తరువాయి జాయింట్ స్టాఫ్‌లో పనిచేస్తున్న సుమారు 50 మంది సిబ్బందికి పాలిగ్రాఫ్ పరీక్షలు నిర్వహించారు. జర్నలిస్టులకు రహస్య, వర్గీకృత సమాచారాన్ని లీక్ చేశారనే అనుమానాలపై జరుగుతున్న దర్యాప్తులో భాగంగా ఈ పరీక్షలు నిర్వహించారు. ఆగస్టులో ఈ పరీక్షలు నిర్వహించినట్లు తెలుస్తోంది. సైనిక అధికారులు లేదా పౌర సిబ్బంది వర్గీకృత సమాచారాన్ని మీడియా ప్రతినిధులకు అందించారా అనే విషయాన్ని తెలుసుకునేందుకు దర్యాప్తు అధికారులు ఈ పరీక్షలు నిర్వహించినట్లు సమాచారం. ఇరాన్‌తో జరిగిన యుద్ధం అనంతరం అమెరికా కీలక ఆయుధాల నిల్వల్లో కొరత ఏర్పడిందంటూ వెలువడిన మీడియా కథనాలపై కూడా దర్యాప్తు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా దీర్ఘశ్రేణి క్షిపణులు, పేట్రియాట్ ఇంటర్‌సెప్టర్ల సరఫరాపై ఆందోళనలు వ్యక్తమైన విషయం తెలిసిందే. దర్యాప్తులో భాగంగా సిబ్బందిని జర్నలిస్టులకు వర్గీకృత సమాచారాన్ని వెల్లడించారా అనిప్రశ్నలు సంధించారు. అలాగే అమెరికా ఆయుధ నిల్వల్లో తగ్గుదలపై వివరాలను ఎవరితోనైనా పంచుకున్నారా అనే అంశంపైనా ప్రశ్నలువేసినట్లు సమాచారం. ఇరాన్‌తో జరిగిన ఘర్షణ సమయంలో అమెరికా ఆయుధ నిల్వలపై ఒత్తిడి పెరిగిందని పలు మీడియా కథనాలు వెలువడ్డాయి. ముఖ్యమైన ఆయుధ వ్యవస్థల లభ్యత, యుద్ధం కారణంగా అమెరికా మందుగుండు సామగ్రి నిల్వలపై పడిన ప్రభావంపై ఈ నివేదికలు ప్రశ్నలు

# లీకుల కలకలం!

**గన్ని మోహన్**

లేవనెత్తాయి. అందరికీ తెలిసినట్లుగానేసెంట్‌కామ్ కూడా పలుపర్యాయాలు అమెరికా సెనేట్, ప్రతినిధుల సభలకు యుద్ధ నివేదికలు అందచేస్తూ ఆయుధ నిల్వల సమాచారం కూడా అందచేసింది. ఎంతో వ్యయంతో తయారుచేసినక్షిపణులను ఇరాన్ కారుచౌక క్షిపణులతోనే కూల్చి వేస్తున్న వైనంపైనా చట్టసభల్లో ప్రత్యేక నివేదికలు కూడా ఇచ్చింది. అవన్నీ కూడా మీడియా పతాకశీర్షికలకు ఎక్కిన సంగతి తెలిసిందే.



ట్రంప్

వీటన్నింటినీ కట్టడిచేయడం కోసమే అన్నట్లుగా ఇప్పుడు నేరస్తులు, కరుడుగట్టిన సిబ్బందికి నిర్వహించే పాలిగ్రాఫ్ పరీక్షలు రక్షణ రంగ సిబ్బందికి కూడా నిర్వహించారు. జాయింట్ స్టాఫ్‌లోసుమారు 1,500 నుంచి 2,000 మంది అధికారులు, సిబ్బంది ఉంటారు, పాలిగ్రాఫ్ పరీక్షలకు హాజరైన 50మంది మొత్తం సిబ్బందిలో ఒక చిన్న భాగమే. రక్షణరంగ సమాచారం లీక్ కావడంపై తీవ్రంగా పరిగణిస్తున్న పెంటగాన్ ఈ ప్రక్రియ మొత్తం రహస్యంగానే నిర్వహించినా చివరకు లీక్ అవక తప్పలేదు. వర్గీకృత జాతీయ భద్రతా సమాచారానికి సంబంధించిన ఏదైనా లీక్‌ను అమెరికా రక్షణశాఖ తీవ్రంగా పరిగణిస్తుందని, అమెరికా జాతీయ భద్రతతోపాటు ప్రపంచ వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న అమెరికా సైనికుల భద్రతకు వర్గీకృత సమాచారాన్నిరక్షించడం అత్యంత కీలకమని పెంటగాన్ ప్రతినిధి సీన్ పార్నెల్ సమర్థించుకోవడం చూస్తుంటే సిబ్బంది అధికారులకు పరీక్షలు నిర్వహించినట్లు చెప్పకనే చెప్పినట్లయింది. పాలిగ్రాఫ్ పరీక్షలకు గురైన50 మంది సిబ్బందిలో ఎవరైనా వాస్తవంగా రహస్య సమాచారాన్ని లీక్ చేశారా అన్నది దర్యాప్తు నిర్ధారించలేదు. కానీ ఈ లీకుల వ్యవహారంతో ఒక్కసారిగా పెంటగాన్ రక్షణ వ్యవస్థ మొత్తం వార్తల్లోకి ఎక్కింది. నిజానికి ఇరాన్‌కు ఆయుధ పరంగా చైనా, ఇంటెలిజెన్స్ పరంగా రష్యా సహకరిస్తున్నాయని ముందు నుంచి అనుమానాలు తొలిచేస్తున్నాయి. ఒకటిరెండు సార్లు బహిరంగంగానే తన అక్కసుకూడా వెళ్లగక్కారు. చైనాతో పటిష్టబంధం పేరిట ఆదేశంలో పర్యటించి మరీ వచ్చిన ట్రంప్ చైనా నుంచి ఆశించిన మేర ఫలితం రాబట్టలేకపోయారు. అదేవిధంగా ఆంక్షలు కూడా లెక్కకుమించిన స్థాయిలో విధించారు. ఇరాన్‌కు సహకరించే ఏదేశం అయినా సరే తమ ఆంక్షలకు గురికావాల్సిందేనని తెగేసి చెప్పారు. అనుకున్నట్లుగానే తన ఖజానా నింపుకోడానికో, లేక శత్రు, మిత్రదేశాలపై తన పట్టును కొనసాగించుకోడానికో అన్నట్లు మొత్తం సుంకాలు ఎడాపెడా వేసారు. కోర్టులు మొట్టికాయలు వేస్తున్నా వాటికి ప్రత్యామ్నాయాలు ఆలోచించి మరీ ముందుకు సాగారు. ఈక్రమంలో ముందు సొంత ఇంటిని చక్కదిద్దుకోవాలని భావించారో ఏమో కానీ పెంటగాన్ ప్రక్షాళన కూడాచేపట్టారు. వెనువెంటనే పలువురిపేర్లను కూడా పరిశీలించారు. వీరిలో మార్క్ ఆండర్సన్,సీన్ పార్నెల్‌లపేర్లు ఇపుడు పరిశీలనలో ఉన్నాయి. రక్షణమంత్రి పీట్‌హెగ్సెత్‌తో విభేదాలు పొడసూపిన తర్వాత అప్పటివరకూ ఉన్న డాన్ డ్రిస్కాల్ రాజీనామా చేయడంతో ఆస్థానం అత్యవసరంగా భర్తీచేయాల్సి ఉంది. తాత్కాలికంగా ఆ బాధ్యతలు ఆడమ్ టెల్లె నిర్వహిస్తున్నా శాశ్వత ప్రాతిపదికన నియామకాలు జరగాలి. ఇప్పటికే జాయింట్ స్టాఫ్ చీఫ్ రాండి జార్జి వైదొలిగారు. వారితోపాటు స్టీవ్‌ఫీన్ బెర్గ్‌నుకూడా హెగ్సెత్, ట్రంప్ కూడా పరిశీలిస్తున్నారని రక్షణరంగంలో విస్తృతప్రచారానికి నాంది పలికింది. ఈక్రమంలోనే ముందు లీకులు అరికట్టేందుకు మొత్తం వ్యవస్థనే ప్రక్షాళన చేసేదిశగా ట్రంప్ అడుగులు వేస్తున్నారనిచెప్పవచ్చు. న్యాయస్థానాల బ్రేకులు, కొనసాగుతున్న సుదీర్ఘయుద్ధం, కొలిక్కిరాని శాంతి యత్నాలు వంటివి ట్రంప్‌లో అసహనం పెంచుతున్నాయనడానికి ఆయన వైఖరే ప్రత్యక్ష నిదర్శనంగా కనిపిస్తోంది. ●


---

# బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు ఎలా?



**పాపని నాగరాజు**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ పునరుద్ధరణ మరోసారి రాజకీయ చర్చకువచ్చింది. ప్రభుత్వం గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్‌కు నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం వెనుక న్యాయపరమైన చరిత్ర, కమిషన్ల పాత్ర ఇప్పటికే బహిరంగ చర్చలో ఉన్నాయి. కానీ ఇంకా చర్చకు రాని దాచిపెట్టిన మరో ప్రశ్న ఏమంటే, 34 శాతానికి జనాభా ప్రాతిపదిక ఏమిటి? బీసీల వాస్తవ సంఖ్య తెలియకుండానే ఈ శాతం ఎలా ఖరారైంది? ప్రభుత్వం ఇదే సమయంలో ఓటర్ల జాబితా ఆధారంగా బీసీ జనాభాను గుర్తించే ప్రక్రియను చేపట్టిందే తప్ప, ఆ ప్రక్రియ పూర్తయ్యేలోగానే శాతాన్ని ప్రకటించింది. లెక్కలు వాటాను నిర్ణయించాలా, లేక వాటా ముందే నిర్ణయించి లెక్కలు తరువాత సర్దుబాటు చేయాలా అన్నదే ఇక్కడ అసలు ప్రశ్న. 2019లో ఇదే 34 శాతం రిజర్వేషన్ న్యాయస్థానంలో నిలబడలేదు అన్నది తెలిసిన విషయమే. ఆ అనుభవం ఒక్కటే చాలు, రిజర్వేషన్‌శాతాన్ని కేవలం రాజకీయ ప్రకటనగా కాకుండా, గణాంక ఆధారంతో నిలబెట్టాల్సిన అవసరాన్ని గుర్తు చేయడానికి. అయితే ఈసారి కొత్తగా చూడాల్సింది ఆ చట్టపరమైన చరిత్ర కాదు, ప్రస్తుతం జరుగుతున్న గణాంక ప్రక్రియే. ఆగస్టు 18నుంచి ప్రభుత్వం ఓటర్ల జాబితా ఆధారంగా పంచాయతీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ జనాభాను గుర్తించే ప్రక్రియను ప్రారంభించింది. సెప్టెంబర్ 7లోగా దీన్ని పూర్తి చేయనున్నట్లు ప్రకటించింది. అంటే బీసీల స్థానిక జనాభా వివరాలను ప్రభుత్వం ఇంకా సేకరిస్తున్న సమయంలోనే 34 శాతం ఇప్పటికే ఖరారైంది. లెక్కలు వాటా నిర్ణయానికి ఆధారం అయితే ముందుగా లెక్కలు రావాలి, ఆ తరువాతే శాతం ఖరారు కావాలి. కానీ ఇక్కడ ముందే శాతం నిర్ణయించి, తరువాత జనాభాను గుర్తిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. రేపు ఈ లెక్కల్లో బీసీల జనాభా 34 శాతానికి భిన్నంగా తేలితే, ఇప్పటికే ఖరారైన శాతానికి సమర్థన ఏమిటన్నది ప్రభుత్వం చెప్పాల్సి ఉంటుంది. లెక్కలు తీయడం తప్పు కాదు, కానీ లెక్కలు పూర్తి కాకముందే నిర్ణయం ఎందుకు అన్నదే ప్రశ్న. అయితే ఈ స్థానిక జనాభా గుర్తింపు ప్రక్రియను దేశవ్యాప్త సమగ్ర కులగణనగా భావించకూడదు. ఓటర్ల జాబితా ఆధారంగా స్థానిక సంస్థల పరి ధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ జనాభాను గుర్తించడం ఎన్నికల రిజర్వేషన్‌కు ఉపయోగపడే పరిపాలనా సమాచారం కావచ్చు. కానీ దేశంలోని బీసీల వాస్తవ జనాభా ఎంత, కులాల వారీగా వారి సామాజిక స్థితి ఏమిటి, విద్య, ఉపాధి, ఆర్థిక వనరులు, భూమి, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాల్లో వారి పరిస్థితి ఏమిటి అన్నది తెలుసుకోవాలంటే సమగ్ర కుల గణన అవసరం. రాష్ట్రంస్థానిక సంస్థల కోసం సేకరించే ఈ లెక్కలు కేంద్ర స్థాయిలోని దేశవ్యాప్త జనాభా గణనకు ప్రత్యామ్నాయం కావు. ఈ రెండు ప్రక్రియల మధ్య తేడాను స్పష్టంగా గుర్తించడమే ఇక్కడ అవసరం. మండల్ కమిషన్ 1980లో సమర్పించిన నివేదికలో ఓబీసీ జనాభాను సుమారు 52శాతంగా అంచనా వేసిన చారిత్రక విషయం ఈ చర్చకు ఒక నేపథ్యం మాత్రమే. ఇది ప్రస్తుత జనాభా గణాంకం కాదు, రిజర్వేషన్ కోటా కూడా కాదు. దశాబ్దాలనాటి అంచనా మాత్రమే. అయినా ఒక ముఖ్యమైన ప్రశ్నకు ఇది నేపథ్యాన్ని ఇస్తుంది. దశాబ్దాలుగా బీసీల జనాభా గురించి చర్చిస్తున్న దేశం, నేటి వాస్తవ జనాభాను ఎందుకు స్పష్టంగా లెక్కించకూడదు? ప్రస్తుత రిజర్వేషన్ నిర్ణయాలు పాత అంచనాలపై కాకుండా తాజా, విశ్వసనీయ గణాంకాలపై ఆధారపడాలి. అందుకే కుల గణన కేవలం ప్రధాన బీసీ కులాల సంఖ్యను తెలుసుకునే ప్రక్రియ మాత్రమే కాదు, ఉపకులాలు, అర్ధ సంచార, సంచార జాతులు వంటి ఇప్పటికీ గుర్తింపు, గణాంక ప్రాతినిధ్యం లేని అట్టడుగు వర్గాలను కూడా వెలుగులోకి తెచ్చే ప్రక్రియ. అదే రాబోయే విధానాలకు శాస్త్రీయ పునాది కాగ



లదు. నిజంగా బీసీలకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధి ఉంటే, రాష్ట్ర ప్రభుత్వం కేవలం స్థానిక ఎన్నికల కోసం తాత్కాలిక లెక్కలతో సరిపెట్టుకోకుండా, కేంద్ర జనాభా గణనలోనే కులాలు, ఉపకులాల వారీగా జనాభా వివరాలను నమోదు చేసే స్థిరమైన వ్యవస్థ కోసం కేంద్రంపై రాజకీయ ఒత్తిడి ఎందుకు తేవడం లేదు? బీసీలు ఒకే సామాజిక యూనిట్ కాదు. అనేక కులాలు, ఉపకులాలు, వృత్తులు, ప్రాంతాలు, ఆర్థిక స్థాయిలతో కూడిన సమూహం. మొత్తం బీసీలు ఎంతమంది అన్నది తెలిసినా, వారిలో ఎవరు అత్యంత వెనుకబడి ఉన్నారో తెలియకపోతే విధాన రూపకల్పన అసంపూర్ణంగానే ఉంటుంది. ఇక్కడ ఒక మరో ముఖ్యమైన అంశం ఉంది. ఓటర్ల జాబితా ఆధారంగా జనాభాను గుర్తించే పద్ధతికే ఒక పరిమితిఉంది. ఓటర్ల జాబితాలో నమోదైన కులం వివరాలు ఎంత కచ్చితమైనవి, ఎంత మంది తమ కులాన్ని సరిగ్గా నమోదు చేసుకున్నారు, వలస కార్మికులు, తాత్కాలికంగా వేరే ప్రాంతాల్లో ఉంటున్నవారు ఈ లెక్కల్లోకి వస్తారా అన్న ప్రశ్నలు వెంటనే వస్తాయి. ఓటర్ల జాబితా ప్రధానంగా ఎన్నికల నిర్వహణ కోసం రూపొందించినది, అది జనాభాను శాస్త్రీయంగా, సమగ్రంగా వర్గీకరించే సాధనం కాదు. అటువంటి జాబితా ఆధారంగా వచ్చే గణాంకాలను రిజర్వేషన్ నిర్ణయానికి తుది ప్రాతిపదికగా చూపిస్తే, ఆ గణాంకాల విశ్వసనీయతపైనేన్యాయస్థానంలో ప్రశ్నలు తలెత్తే అవకాశం ఉంటుంది. కచ్చితమైన సామాజిక న్యాయం, న్యాయమైన వనరుల పంపిణీ కోసం ఓటర్ల జాబితా కాదు, స్వతంత్రమైన, శాస్త్రీయమైన కులగణనే విశ్వసనీయమైన ఆధారం కాగలదు. ఇక్కడ బీసీఉద్యమం కూడా తన పాత్రను పునరాలోచించుకోవాలి. ప్రభుత్వాలు ఇచ్చే ప్రతి శాతాన్ని స్వాగతించడమే ఉద్యమం కాదు. పాలకపక్షాలకు అనుకూలంగా ఉన్న కొన్ని సంఘాలు 34 శాతాన్ని సమర్థించవచ్చు. కానీ వాటి స్పందనను మొత్తం బీసీ సమాజం అభిప్రాయంగా చూపించడం సరి కాదు. నిజమైన బీసీ సంఘం 'ఈ శాతానికి జనాభా ఆధారం ఏమిటి, లెక్కలు పూర్తికాకముందే శాతం ఎందుకు, కేంద్ర జనాభా గణనలో కులాల కాలమ్ ఎందుకు ఉండకూడదు' అని అడగాలి. ఇంకా ఒక ముఖ్యమైన విషయం. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం వచ్చినా అది ఇతర రంగాలకు విస్తరించకపోతే సామాజిక న్యాయం పూర్తికాదు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యత, ఉన్నత విద్యలో ప్రవేశం, ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం వంటి అంశాలు బలోపేతం కావాలి. సంప్రదాయ వృత్తులపై ఆధారపడిన బిసి కుటుంబాలు ఆధునిక ఆర్థిక వ్యవస్థలో ఎక్కడ నిలుస్తున్నాయో, సూక్ష్మ పరిశ్రమలకు మూలధనం, మార్కెట్ ఎవరికెంత అందుతోందో, గ్రామీణ సమాజంలో భూమి యాజమాన్యం ఎలా ఉందో కూడా ఈ రాజకీయ అజెండాలో భాగం కావాలి. విద్యలో వాటా, ఉద్యోగంలో వాటా, ఆర్థిక వనరుల్లో వాటా, పరిశ్రమల్లో వాటా, భూమిలో వాటా, రాజకీయ నిర్ణయాధికారంలో వాటా. ఇవన్నీ పరస్పరం అనుసంధానమైన అంశాలు. ఎన్నికల్లో ఒక సీటు దక్కడం వల్ల సమాజంలోని వనరుల పంపిణీ మారదు, నిర్ణయాధికారంలో స్థిరమైన భాగస్వామ్యం ఏర్పడినప్పుడే మార్పు సాధ్యమవుతుంది. లెక్కలు పూర్తికాకముందే నిర్ణయం ఎలా తీసుకున్నారో వివరించాలి. స్థానిక సర్వేను సమగ్ర కులగణనగా చిత్రించకూడదు. కేంద్ర జనాభా గణనలో కులాల కాలమ్ కోసం రాజకీయంగా పోరాడాలి. స్థానిక యూనిట్ విధానాన్ని పారదర్శకంగా ప్రకటించాలి. బీసీలకు కావాల్సింది మరో ఎన్నికల హామీ కాదు. హామీని చట్టబద్ధమైన హక్కుగా మార్చే రాజకీయ సంకల్పం. ప్రభుత్వం ఇచ్చే శాతం కాదు, గణాంకం నిర్ధారించే వాటా కావాలి. కాగితంపై రిజర్వేషన్ కాదు, వాస్తవ రాజకీయ ప్రాతినిధ్యం కావాలి. 34 శాతం ఈ ప్రయాణంలో ఒక అడుగు కావచ్చు. కానీ అది ముగింపు కాదు. బీసీలకు నిజమైన న్యాయం జరిగిందని చెప్పాలంటే, వారి జనాభా ఎంత అన్నది నమ్మదగిన లెక్కల్లో కనిపించాలి, ఆ జనాభా మేరకు వారి వాటా విధానాల్లో ప్రతిబింబించాలి, ఆ వాటా రాజకీయ అధికారంగా మారాలి. ●

గుంటూరు వార్త

# నూతన బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపడతాం

## -కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

**పొన్నూరు, సెప్టెంబర్ 5,ప్రభాతవార్త:** జీబీసి రోడ్డులోని చేబ్రోలు సమీపంలోని కొమ్మమూరు కెనాల్‌పై ఉన్న అతిపురాతనమైన వంతెనను శనివారం కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌తో కలిసి సందర్శించి పరిశీలిం చారు. వంతెన అతి పురాతనమైనది కావడంతో ఇటీవల ఓ లారీ ఢీ కొనడంతో రెయిలింగ్ దెబ్బతిన్నదన్నారు. ఈ బ్రిడ్జిని పరిశీలించిన పెమ్మసాని నూతన బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకొంటామన్నారు. బ్రిడ్జి వద్ద ఉన్న ప్రమాదకర పరిస్థితులను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ బ్రిడ్జికి అవసరమైన మరమ్మత్తులు త్వరితగతిన పూర్తిచేయిస్తామన్నారు. దీర్ఘకాలికంగా ప్రజలకు ఉపయోగపడేవిధంగా నూతన బ్రిడ్జి నిర్మాణాన్ని కూడా పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకొంటామన్నారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ప్రమాదాలకు తావులేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చేబ్రోలు బ్రిడ్జికి శాశ్విత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.



# నీరుకొండ పరిసరాల్లో పోలీసుల విస్తృత తనిఖీలు

**మంగళగిరి, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:** గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం, చట్టవిరుద్ధ కార్యకలాపాల నియంత్రణకు మంగళగిరి రూరల్ పోలీసులు చర్యలు చేపట్టినట్లు మంగళగిరి గ్రామీణ సిఐ చిరుమామిళ్ల వెంకట్ తెలిపారు. మంగళగిరి రూరల్ పోలీసులతో పాటు ఈగల్ టీం సిబ్బంది



శనివారం నీరుకొండ గ్రామ పరిసరాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. నీరుకొండ గ్రామం వెలుపల ఉన్న కొండ ప్రాంతంతో పాటు నిర్మానుష ప్రదేశాలు, అనుమానాస్పద ప్రాంతాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. గంజాయి సాగు, నిల్వ, అక్రమ రవాణా, మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించిన ఆనవాళ్లపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. అనుమానాస్పద వ్యక్తులు, కదలికలపై నిఘా ఉంచడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించేందుకు తనిఖీలు చేపట్టారు. మాదకద్రవ్యాల వల్ల యువత భవిష్యత్తు దెబ్బతినకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నీరుకొండ, పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలకు తావులేకుండా నిరంతరం నిఘా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేదా వినియోగానికి పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రజలు, ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించినా లేదా గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు లేదా ఈగల్ బృందానికి సమాచారం అందించాలని సూచించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారాన్ని ఈగల్ టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ 1972కు తెలియజేయాలని ఆయన కోరారు.

# అధ్యాపక వృత్తి ఆదర్శప్రాయంగా ఉండాలి : ఏఎన్‌యు వీసి గంగాధరరావు

**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, సెప్టెంబరు5, ప్రభాతవార్త:** అధ్యాపకులు భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే ఆదర్శప్రాయులుగా ఉండాలని ఏఎన్‌యు వీసి ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని శనివారం కమిటీ హాల్‌లో నూటా ఆద్వర్యంలో కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా వీసి అధ్యాపకులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ బోధన ఒక్కటే అధ్యాపకులకు లక్ష్యం కాకుడదని, విద్యార్థులను ఉన్నత శిఖరాల వైపు నడిపించే వారిగా ఉండాలన్నారు. ఆమధ్య నీట్ పరిక్షా పేపర్ లీక్, యూజిసి నెట్ పేపర్‌లీక్ వంటి అంశాలు చాలా బాదకలిగించేవిగా ఉన్నాయన్నారు. ఇందులో ఎవరు బాధ్యులు.. టీచర్‌ల పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. అయితే టీచర్‌లకు ఇటువంటి ఆలోచన రావడం బాధాకరమన్నారు. నేటితరం అధ్యాపకులు టెక్నాలజీ వాడుతూనే ఏఐ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని అవసరాన్ని మాత్రమే వినియోగించాలని సూచించారు. రెక్టార్ ఆచార్య శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, నూటా అధ్యక్షుడు ఆచార్య బ్రహ్మాజీరావు, కార్యదర్శి ఆచార్య ఎం.త్రిమూర్తిరావు, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎం.సురేష్‌కుమార్, ఆచార్య సిహెచ్.లింగరాజు, ఆచార్య తేజోమూర్తి, ఆచార్య వై.అశోక్‌కుమార్, అధ్యాపకులు, గెస్ట్ ఫ్యాకల్టీ తదితరులు పాల్గొన్నారు.



# 40వ రోజుకు చేరిన కాంట్రాక్ట్ అధ్యాపకుల రిలే దీక్షలు

**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, సెప్టెంబరు5, ప్రభాతవార్త:** ఏఎన్‌యులో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు న్యాయం జరిగే వరకు రిలే దీక్షలు కొనసాగుతాయని అసోసియేషన్ పేర్కొంది. 40రోజుకు రిలే నిరాహార దీక్షలు చేరుకున్నాయి. శనివారం ఉపాధ్యాన దినోత్సవం సందర్భంగా వీసి ఆచార్య గంగాధరరావు, రెక్టార్ శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం లను కలిసి శఉభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమకు న్యాయబద్ధంగా, జీఓల ప్రకారం రావల్సిన హక్కులను అమలుచేయాలని కోరారు. ఎన్నో ఏళ్ళుగా వర్సిటీలో విధులు నిర్వహిస్తున్న తమకు వేతనాలు పెంచాలని, తమ సర్వీసులను క్రమబద్ధీకరించాలని విన్నవించారు.



# గ్రామీణాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**-రూ.2.94కోట్ల రహదారి పనులకు శంకుస్థాపన**
**-పెదకాకాని మండలంలో రూ.8.72కోట్ల పనులకు శంకుస్థాపన**
**-కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్**

**పొన్నూరు, సెప్టెంబర్ 5,ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రహదారులు ఎంతో కీలకమని, నాణ్యమైన రోడ్డు నిర్మాణంతో ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖాఖ సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శనివారం పొన్నూరు నియోజకవర్గంలో పలు గ్రామాల్లో రహదారి పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొన్నూరు మండలం దొప్పలపూడి గ్రామంలో జరిగిన సభలో డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గతంలో తీవ్రంగా దెబ్బతిన్న రహదారుల కారణంగా గ్రామీణ ప్రజలు, రైతులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రధాన్యతా క్రమంలో నూతన రహదారి నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పొన్నూరు నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. మండల పరిధిలోని దొప్పలపూడి గ్రామంలో వినాయకస్వామి గుడి దగ్గర నుంచి జీబిసి రోడ్డు నుండి దొప్పలపూడి మీదుగా మన్నవ వరకు 2.94కోట్ల నిధులతో కీలక రహదారి నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, అర్బన్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ డైరెక్టర్ వడ్రాణం మార్కండేయబాబు, ఎస్సీ కార్పోరేషన్ డైరెక్టర్ బండ్లమూడి బాబూరావు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.





**పెదకాకాని మండలంలో..**

పెదకాకాని మండలంలో రూ.8.72కోట్ల నిధులతో రహదారి నిర్మాణానికి కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ శనివారం శంకుస్థాపనలు చేశారు. కాకాని మండల పరిధిలోని కొప్పురావూరు గ్రామంలో రూ.4.71కోట్లు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పకథం కింద ఎన్‌హెచ్-16రోడ్డు నుంచి జొన్నలగడ్డ గ్రామం వరకు వయా కొప్పురావూరు మీదుగా వెళ్ళే ఆర్‌అండ్‌బి రోడ్డు ప్రారంభోత్సవం, అనుమర్లపూడి గ్రామంలో రూ.4.01కోట్ల వ్యయంతో తెనాలి ఆర్‌అండ్‌బి రోడ్డు నుంచి శేకూరు గ్రామం వరకు వయా అనుమర్లపూడి మీదుగా వెళ్ళు ఆర్‌అండ్‌బి రోడ్డుశంఖుస్థాపన మొత్తం రూ.8.72కోట్ల అంచనా వ్యవయంతో చేపట్టనున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి ప్రజలకు, మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యమన్నారు. ఎమ్మెల్యేధూళిపాళ్ల నరేంద్రకుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి కన్నా కూటమి ప్రభుత్వం వచ్చిన రెండు సంవత్సరాల్లోనే గ్రామాలలో భారీ ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నియోజకవర్గంలో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విలువలతో కూడిన సమాజం నెలకొల్పడమే ఉపాధ్యాయుల ధ్యేయం కావాలి

## జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ

**గుంటూరు విద్య, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త :** విలువలతో కూడిన సమాజం నెలకొల్పడమే ధ్యేయం కావాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురుపూజోత్సవ దినోత్సవం 2026 కార్యక్రమం జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో గల ఎస్.ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు విలువలు అందించాలన్నారు. ఇది సమాజానికి గొప్ప పెట్టుబడి కాగలదని పేర్కొన్నారు. విలువలు అనే పునాదిపై సమాజాన్ని నిర్మించాలని కోరారు. ఇది ఉపాధ్యాయుల చేతిలో ఉందని చెప్పారు.






ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, మంచి సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని అన్నారు. పిల్లలు ఎక్కువ సమయం పాఠశాలలో ఉంటారని, వారిని చక్కగా తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర కీలకమన్నారు. మంచి నాయకత్వ లక్షణాలు అందించాలన్నారు. విద్యార్థులు అనుకున్నది సాధించే వరకు కృషి చేసే విధంగా ప్రేరణ కల్పించాలన్నారు. ఒత్తిడిని తట్టుకునే శక్తి కలిగి ఉండే విధంగా విద్యార్థిని తయారు చేయాలని సూచించారు. ఓటమిని తట్టుకుని నిలబడే శక్తిని కల్పించాలని పేర్కొన్నారు. విద్యార్థులనుఆశయాలకు దగ్గర చేయగలగాలన్నారు. మహాత్మా గాంధీ యావత్తు దేశాన్ని మమేకం చేశారన్నారు. భావితరాలకు ఏం కావాలో ఆలోచించండి .. అందుకు అవసరమైన మెట్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్ప ఆచార్యుడిగా, గొప్ప ఫిలాసఫర్ గా నిలిచారని, అందుకు రాధాకృష్ణన్ అనుసరించిన విలువలు, ఆచరణ మాత్రమేనని అన్నారు. విద్యార్థులు సాధించిన దానిని తానే సాధించినట్లు గురువు భావిస్తే గొప్ప విషయాలకు శ్రీకారం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులుగా ఎంతో మందికి బోధన చేశారు... ఎంతో మందికి మార్గదర్శకత్వం చేశారని చెప్ప గలిగితే ... దానికి సరితూగేది ఏదీ లేదన్నారు. ప్రతి అడుగులో గురువు చూపే దారి గొప్పదన్నారు. విద్యార్థులు ఏమి సాధించాలి అని మార్గదర్శకత్వం వహించేది గురువేనన్నారు. గురువు స్థానంలో ఉన్న మీపై ఎక్కువ బాధ్యత ఉందన్నారు. శ్రద్ధతో ఇష్టంతో విద్యా బోధన చేయడంతో పదవ తరగతి మంచి ఫలితాలు వచ్చాయన్నారు. జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులు, కష్టపడి పనిచేసే వారు ఉన్నారని కితాబు ఇచ్చారు. అయితే మార్కులు వరకే పరిమితం కాకూడదన్నారు. ప్రస్తుతం సాంకేతిక విప్లవంతో సమాచారం అందుబాటులో ఉందని, కానీ విద్యార్థులకు విశ్లేషణ చేసే శక్తి అవసరం అన్నారు. విశ్లేషణ శక్తి కల్పించాలని సూచించారు. విద్యార్థులను గమనించాలని, వారికి అవసరమగు నైపుణ్యం అందించాలని, జీవితంలో చక్కగా స్థిర పడటమే కాకుండా సమాజానికి విలువైన సంపదగా తయారు చేయాలని సూచించారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ భీమనేని వందనా దేవి మాట్లాడుతూ సమాజానికి అత్యుత్తమ అత్యున్నత, పౌరులను అందించాలన్నారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్ప ఉపాధ్యాయుడుగా పేరెన్నిక గన్నారన్నారు. గురువు లేనిదే రాణింపు లేదన్నారు. ఏ రంగంలో ఉన్న వ్యక్తినైనా ఉపాధ్యాయుడే తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వర రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఆదర్శప్రాయులన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి డా.షేక్ సలీం భాషా మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న పవిత్రమైన వృత్తిలో ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తి గొప్పదని చెప్పారు. వివిధ విద్యా సంస్థల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సర్వ శిక్షా అభియాన్ ఎపిసి పద్మావతి, గుంటూరు ఉప విద్యా శాఖ అధికారి ఏసు రత్నం, తెనాలి డిప్యూటీ డిఈఓ శాంత కుమారి., వివిధ మండల విద్యా శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దళిత కాలనీ రూపురేఖలు మారుస్తాం

**- రోడ్లు, డ్రెయిన్లు, పైపులైన్ల నిర్మాణానికి ప్రథమ ప్రాధాన్యం -రూ.6.60 కోట్లతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన**


**గుంటూరు,సెప్టెంబర్ 5,ప్రభాతవార్త :** దళిత కాలనీల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తూ అభివృద్ధి పథంలో తీసుకెళతామని, నియోజకవర్గానికి వచ్చే నిధుల్లో సుమారు 40 నుంచి 50 శాతం దళిత కాలనీ అభివృద్ధికే కేటాయిస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ



మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శనివారం స్థానిక నియోజకవర్గంలో సంజీవయ్య నగర్, ఆదిత్య నగర్, అరుంధతి నగర్, అంబేద్కర్ నగర్ ప్రాంతాల్లో రూ.6.60 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, పైపు లైన్ల నిర్మాణానిక ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత కాలనీల రూపురేఖలు మారుస్తున్నామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో దళిత కాలనీల్లో కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా ఉండేవని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి కాలనీలో అంతర్గత రోడ్లు సైతం నిర్మిస్తున్నామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లపై గుంతలు పూడ్చేందుకు రూ.750 కోట్ల నిధులు విడుదల చేశారన్నారు. కేవలం రోడ్లు మాత్రమే కాకుండా మంచినీటి పైపులైన్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ప్రథమ ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. కాలనీల్లో విద్య, వైద్య సదుపాయాలు మెరుగుపరిచేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేస్తున్నామని చెప్పారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన నుంచి ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ వరకు బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఒకే విధానం ఉండాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గుంటూరు నగర అభివృద్ధి కోసం కూటమి పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలన్నారు. ప్రజలకు కూటమి ప్రభుత్వం జవాబుదారీగా ఉందని, నియోజకవర్గంలో ఎవరికి ఎలాంటి అవసరమొచ్చినా తమను సంప్రదించాలని సూచించారు.

# సాగర్ జలాలతో 12 గ్రామాలకు సురక్షిత మంచినీరు : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:** నియోజకవర్గ ప్రజల తాగునీటి అవసరాల దృష్ట్యా భవిష్యత్ లో ఇబ్బందులు తలెత్తకుండా మంచినీటి చెరువుల్నినీటితో నింపాలని నిర్ణయించుకున్నామని, ఆ దిశగా నాగార్జున సాగర్ నుంచి నీటిని విడుదల చేయాలని సంబంధిత అధికారుల్ని కోరినట్టు శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ఇప్పటికే విడుదల చేసిన నీటికి అదనంగా నియోజకవర్గంలోని మూడు ప్రధాన వాగులకు కూడా నీరందించడానికి సంబంధిత అధికారులు సుముఖత వ్యక్తం చేశారని ఆయన తెలియచేశారు.



ఎల్ నినో దృష్ట్యా సమర్థ నీటి నిర్వహణ చర్యలు చేపట్టాలని, నీటిసరఫరా నష్టాలు, వృథా లేకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. శనివారం ఆయన తన నివాసంలో నియోజకవర్గ మంచినీటి సమస్య, ప్రజల ఇబ్బందులపై మున్సిపల్, ఆర్.డబ్ల్యూఎస్ అధికారులు, మండల నాయకులతో చర్చించారు. సాగర్ నీటిని మూడు వాగుల పరిధిలోని చెరువులకు మళ్లించి, తాగునీటి అవసరాలకు వినియోగించండి.ప్రస్తుతం సాగర్ జలాశయం నుంచి మంచినీటి అవసరాల కోసం కాలువల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారని, ఆ క్రమంలో ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం మూడు ప్రధాన వాగులకు, వాటి పరిధిలోని తాగునీటి చెరువుకు అదనపు నీటి విడుదల కోసం నాగార్జున సాగర్ అధికారులతో మాట్లాడినట్టు ప్రత్తిపాటి పేర్కొన్నారు. తాగునీటి అవసరాలు, ప్రజల ఇబ్బందులపై ఫోన్ ద్వారా నాగార్జున సాగర్ ఎస్ఈ, సీఈ

**సాగర్ జలాల్ని కుప్పగంజి, ఓగేరు, నక్కవాగుల ద్వారా మంచినీటి చెరువులకు మళ్లించండి..**
**మూడు వాగుల పరిధిలోని మంచినీటి అవసరాల నీటి విడుదలకు నాగార్జున సాగర్ ఎస్.ఈ, సీఈ లు అంగీకరించారు.**
**నీళ్లు విడుదలైతే, 12 గ్రామాల ప్రజలకు సురక్షిత మంచినీరు..**
**సాగర్ నీళ్లను సాగు అవసరాలకు తరలించకుండా చూడండి..**
**అధికారులు, మండల నాయకులకు ప్రత్తిపాటి సూచన**

రమేశ్ తో చర్చించగా, వారు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే చెప్పారు. ఒకట్రెండు రోజుల్లో నియోజకవర్గ తాగునీటి అవసరాలకు సరిపడా నీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారన్నారు. సాగర్ నీరు ఎక్కడా వృధా కాకుండా కుప్పగంజి, ఓగేరు, నక్కవాగులకు సరపరా అయ్యేలా చూడాలని, మంచినీటి చెరువుల్ని నింపి, ప్రజలకు ఎలాంటి నీటి ఇబ్బందులు లేకుండా సకాలంలో నీరందేలా చర్యలు తీసుకోవాలని ప్రత్తిపాటి అధికారుల్ని ఆదేశించారు. సాగర్ జలాల విడుదలతో మూడువాగుల పరిధిలోని వేలూరు, కుక్కపల్లివారిపాలెం, లింగంగుంట్ల, గోపాలంవారిపాలెం, బొప్పూడి, పసుమర్రు, మురికిపూడి, దండమూడి, నాగభైరువారి పాలెం, మిట్టపాలెం, ఈవూరివారిపాలెం, తుర్లపాడు గ్రామ ప్రజలకు సురక్షితమైన మంచినీరు అందుతుందని ప్రత్తిపాటి పేర్కొన్నారు. తాగునీటి అవసరాల నిమిత్తం విడుదలైన నీటిని సాగు అవసరాలకు మళ్లించకుండా చూడాలని ఎమ్మెల్యే మండల నాయకులకు సూచించారు. ఎల్ నినో తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు.

# కిడ్నాప్,పోక్సో కేసులో నిందితుని అరెస్టు

**గుంటూరు,సెప్టెంబర్5,ప్రభాతవార్త:** గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు, గుంటూరు జిల్లా క్రైమ్ ఎస్పీ కె. సుప్రజ పర్యవేక్షణలో, వెస్ట్ సబ్‌డివిజన్ ఇన్‌చార్జ్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు,పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు.ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ ఎం.డి. నిస్సార్ బాషా సమన్వయంతో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, హర్యానా రాష్ట్రంలోని కర్నాల్ ప్రాంతంలో బాలిక ఆచూకీని గుర్తించారు.ప్రత్యేక బృందం అక్కడికి వెళ్లి బాలికను సురక్షితంగా అదుపులోకి తీసుకోవడంతో పాటు, కేసులో నిందితుడిని కూడా అదుపులోకి తీసుకుని పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చింది.పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం గుంటూరు టౌన్, పట్టాభిపురం, రవీంద్రనగర్‌కు చెందిన ఒక వ్యాపారి తన 15 ఏళ్ల కుమార్తె 10వ తరగతి చదువుతున్నట్లు,జూన్ 09వ తేదీన రాత్రి 8.45 గంటలకు తన తండ్రి నిర్వహిస్తున్న బట్టల దుకాణం వద్దకు వెళ్లి వస్తానని ఇంట్లోని తాతయ్యకు చెప్పి బయటకు వెళ్లిన అనంతరం తిరిగి ఇంటికి రాలేదని జూన్10వ తేదీన పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.దర్యాప్తులో బాలికను షేక్ జాన్ సైదా రబ్బాని పండు, ఉప్పుటూరు గ్రామం, పర్చూరు మండలం, బాపట్ల జిల్లాకు చెందిన వ్యక్తి బాలిక ఇంటి సమీపం నుంచి అతని తో తీసుకెళ్లినట్లు గుర్తించారు.నిందితుడు బాలికను తీసుకుని తొలుత నెల్లూరు, అనంతరం తమిళనాడు రాష్ట్రంలోని మధురై, కోయంబత్తూరు,కేరళ రాష్ట్రంలోని పాలక్కాడ్, ఆ తరువాత హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లినట్లు ఫోన్ డేటా,సీసీటీవి కెమెరాల ఆధారంగా పోలీసులు గుర్తించారు. చివరకు హర్యానా రాష్ట్రంలోని కర్నాల్ ప్రాంతంలో నిందితుడి ఆచూకీని సాంకేతిక పరిజ్ఞానం ద్వారా గుర్తించి, ప్రత్యేక బృందం సహాయంతో ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు.నిందితుడిని విచారించగా, బాలికతో ఇనిస్టాగ్రామ్ ద్వారా పరిచయం ఏర్పడి గత రెండేళ్లుగా ప్రేమ వ్యవహారం కొనసాగినట్లు వెల్లడైంది. 2024లో బాలిక తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో నిందితుడు బాలిక ఇంటికి వెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు, అనంతరం కూడా తరచూ బాలికను కలుస్తుండేవాడని పోలీసుల విచారణలో వెల్లడైంది.ఈ విషయం బాలిక కుటుంబ సభ్యులకు తెలియడంతో వారు మందలించగా, జూన్ 9వ తేదీన రాత్రి 8.45 గంటలకు బాలికను ఆమె ఇంటి సమీపం నుంచి కిడ్నాప్ చేసి తీసుకెళ్లినట్లు నిందితుడు వెల్లడించాడు.ఈ కేసులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి బాలిక ఆచూకీని గుర్తించి, నిందితుడిని అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, బాలికలపై నేరాలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గుంటూరు జిల్లా పోలీసులు స్పష్టం చేశారు.



# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**గుంటూరు కల్చరల్,సెప్టెంబర్ 5,ప్రభాతవార్త :** దేశ భవితకు పునాదులైన విద్యార్థుల భవితను తీర్చి దిద్దటంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జనసేన యువజన విభాగం నేత తిరుమలశెట్టి సిద్దూ అన్నారు.స్థానిక అరండల్‌పేటలోని ఎస్.కె.వి.ఆర్.నాయుడు హైస్కూల్లో టీచర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత నేతలు ఉపాధ్యా యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సిద్దూ మాట్లాడుతూ భారత దేశపు మొదటి ఉపరాష్ట్రపతి మరియు రెండో రాష్ట్రపతి అయిన డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ ఆశయాలను ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గాజుల ఆదినారాయణ, సాయిప్రశాంత్,కార్తీక్,నాని తదితరులు పాల్గొన్నారు.



**NATIONAL SEEDS CORPORATION LIMITED**
(A Government of India Undertaking)
"An ISO 9001:2015 & ISO 14001:2015 Company"
REGIONAL OFFICE, 17-11,Tukaram Gate, Lalaguda,
Secunderabad-500017.(TG) PH: 040 -27731152, 27730635
Mail ID- rm.secunderabad@indiaseeds.com

**NOTICE INVITING E-TENDER**

National Seeds Corporation Limited, Regional office, Secunderabad invite tenders through e-tendering for purchase of Bengal Gram NBeG 47,49,452 & 857, Black Gram VBN-10, T-9 & PU-31and Cow Pea DC-15 & local Certified/ TL seeds from reputed seed producers / suppliers. Tender Document can be downloaded from **website https://indiaseeds.enivida.com from 08.09.2026, 13.00 hrs.** The Tender fee is Rs.1180 and for further details visits our website www.indiaseeds.com. Tenders without Tender Fee and EMD will be rejected. Last Date for submission of online tender is 21.09.2026 till 14.00 hrs. and the date of opening technical bid is 21.09.2026 at 14.30 hrs. If opening date happens to be holiday, the tender will be opened on next working day. If any changes will be placed only on NSC web-site.

No. 1(23)/Mktg/NSC-HYD/2026-27/
Date: 05.09.2026

Regional Manager
National Seeds Corporation
Secunderabad

MN 6 finalff:MN 6 final 01/01/2001 10:42 Page 1



# కనువిందు చేసిన కాళీయ మర్ధన శ్రీకృష్ణ అలంకరణ

**పొన్నూరు, సెప్టెంబర్ 5,ప్రభాతవార్త:** స్వర్ణపురి పట్టణంలో వేంచేసియున్న సాక్షి శ్రీ భావనారాయణస్వామి దేవాలయంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై కొలువుదీరిన రుక్మిణీ సత్యభామా సమేత కాళీయ మర్ధన శ్రీకృష్ణ అలంకరణ శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మి సమేత సాక్షి శ్రీ భావనారాయణస్వామి అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఉట్టికొట్టే వేడుక భక్తులను ఆద్యంతం భక్తిపారవశ్యాన్ని నింపింది. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. కృష్ణాష్టమికి సంబంధించిన పూజాధికార్యక్రమాలను అర్చకులు గోవర్ధనం రామకృష్ణ నేతృత్వంలో పలువురు అర్చకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు శిఖాకొల్లి గుర్నాధరావు, ఆకురాతి అనూరాధ పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

**ఇక గ్రామోత్సవాలు లేనట్లేనా..?**

పట్టణంలో కొలువై ఉన్న శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మి సమేత సాక్షి భావనారాయణస్వామి దేవాలయంలో స్వామివారికి జరగాల్సిన కైంకర్యాలు సక్రమంగా జరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి ఏటా కృష్ణాష్టమికి, విజయదశమి మరికొన్ని పండుగలప్పుడు శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మి సమేత శ్రీ భావనారాయణస్వామివారు గ్రామోత్సవంలో స్వర్ణపురి భక్తులకు దర్శనమిస్తారు. అయితే కరోనా సమయంలో గ్రామోత్సవాలను దేవాలయానికే పరిమితం చేశారు. కరోనా ముగిశాక కూడా గ్రామోత్సవాలను నిర్వహించకపోవడాన్ని భక్తులు తప్పుపడుతున్నారు. భావదేవునికి కోట్లాది రూపాయలు ఆస్తులు, ఆదాయం ఉన్నప్పటికీ స్వామివారికి జరగాల్సిన కైంకర్యాలు సక్రమంగా నిర్వహించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు కారణం దేవాలయంలో అర్చకులు తక్కువగా ఉండడం, సన్నాయి ఉంటే డోలు ఉండదు...డోలు ఉంటే సన్నాయి ఉండదు...రెండూ ఉంటే



కాగడా వేసేవారు లేరంటూ స్వామివారికి జరగాల్సిన కైంకర్యాలకు సాకులు చెప్తున్నారు. ప్రతి నిత్యం దేవాలయంలో రెండు పర్యాయాలు స్వామివారికి నైవేద్యం సమర్పించే ముందు దేవాలయం చుట్టూ బలిహరణ వేయాల్సి ఉంది. ఈ బలిహరణను అర్చకులు ఎప్పుడో అటకెక్కించారు. ఇక ప్రతి నిత్యం హోమం జరగాల్సి ఉంది..అయితే ఎక్కడా హోమం నిర్వహించిన దాఖలాలు లేవంటున్నారు భక్తులు. స్వామివారికి జరగాల్సిన కైంకర్యాలు సక్రమంగా జరగనప్పుడు ఆయన చూపు ప్రజలపై ఉంటుందని పలువురు భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ విధంగా చూస్తే దేవాలయంలో ఎన్నో సమస్యలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్వామివారి కైంకర్యాలు సక్రమంగా జరిగేవిధంగా చూడాలని భక్తులు కోరుతున్నారు.

# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

**ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు నాదెండ్ల అప్పారావు అన్నారు. మండల కేంద్రంలో దివంగత మాజీ శాసనసభ్యులు మన్నె చిన్న నాగయ్యచే స్థాపించబడిన బాసర విద్యాలయంలో బాసర విద్యాసంస్థల అధినేత సాదినేని మురళీమోహన్ ఆధ్వర్యంలో శనివారం భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఆ పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా నిర్వహించారు. ప్రారంభంలో భారతదేశపు గొప్ప తత్వవేత్త, విద్యావేత్త, భారత దేశ మొదటి ఉపరాష్ట్రపతి, మన దేశ రెండవ రాష్ట్రపతి, భారతరత్న, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి అందరికీ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు నాదెండ్ల అప్పారావు హాజరై మాట్లాడుతూ..ప్రతి ఏడాది సెప్టెంబర్ 5వ తేదీన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం సందర్భంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటామని తెలిపారు. సర్వేపల్లి భారత రాష్ట్రపతి అయిన తర్వాత ఆయన శిష్యులు, స్నేహితులు మీ జన్మదినాన్ని జరపాలని కోరితే, దాన్ని ఆయన చాలా విపులంగా వివరిస్తూ, నా జన్మదినాన్ని జరుపుకోవడం కంటే ఈరోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరపడం చాలా ఆనందంగా ఉంటుందని విద్యార్థులతో చెప్పినట్లు వివరించారు. ఆయన అన్న ఈ మాట ఉపాధ్యాయులపై ఉన్న గౌరవాన్ని తెలియజేస్తుంద న్నారు. విద్యార్థుల భవిష్యత్తును, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని ఆయన నమ్మకమని వివరించారు. అక్కడ నుండి



ఆయన బదిలీ అయినప్పుడు విద్యార్థులు వీడ్కోలు పగులుతూ ఆయన కూర్చున్న బండిని లాగుతూ సాగనంపారని గుర్తుచేశారు. తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే గురువు మన జీవితానికి దిశ నిర్దేశం చేస్తారని వెల్లడించారు. పుస్తకాలలోని పాఠాల కంటే జీవితంలో ఎలా నిలబడాలో నేర్పేది మొదటి గురువేనన్నారు. మీ తప్పులను మందలించేది కోపంతో కాదని, మీ భవిష్యత్తు బాగుండాలనే బాధ్యతతోనే అలా మందలించటం జరుగుతుందని చెప్పారు. గురువు అంటే మనం పడిపోకుండా పట్టుకునే చేయి కాదని, పడిపోయిన మళ్లీ నిలబడటం నేర్పించే శక్తి గురువన్నారు. అనంతరం అతిథిని ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు నిర్వహించిన వివిధ క్రీడా అంశంలో గెలుపొందిన వారికి అతిథి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రశాంతి, ఉపాధ్యాయినీలు జ్యోతి, గంగమ్మ, తదితర ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# కొత్త ఆలోచనలతో ముందుకు రావాలి

**-నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు**

**పొన్నూరు, సెప్టెంబర్ 5,ప్రభాతవార్త:** మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు తమ విషయ పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అభివృద్ధి చేసుకుంటూ, నవీకరించిన కంటెంట్‌తో బోధించాలని విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ ఛైర్మన్, నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు




అన్నారు. చేబ్రోలు మండల పరిధి వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ విద్యార్థులను తరగతి గదిలో ఎప్పుడూ చురుగ్గా, ఆసక్తిగా ఉండేలా బోధనా విధానాలను రూపొందించాలన్నారు. బోధించే అంశాలు విద్యార్థులను ఆకట్టుకునేలా ఉండటంతోపాటు, వాస్తవ జీవితానికి అన్వయించే విధంగా ఉండాలన్నారు. విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారాలను సూచించే స్థాయిలో ఉపాధ్యాయులు మారాలని, సమస్యలను చూసి మౌనంగా ఉండకుండా పరిష్కార మార్గాలతో ముందుకు రావాలని చెప్పారు. కొత్త ఆలోచనలు, వినూత్న బోధనా పద్ధతులను అనుసరించాలని సూచించారు. విద్యార్థుల భావోద్వేగాలను అర్థం చేసుకుని వారితో అనుబంధాన్ని కొనసాగించాలన్నారు. ప్రతి సంవత్సరం కొత్త కొత్త బ్యాచ్‌ల విద్యార్థులు వస్తుంటారని, వారి విజయాలు, వైఫల్యాలలు, ఎత్తుపల్లాల్లో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. విద్యార్థులకు మంచి మార్గదర్శకులుగా నిలవడంతోపాటు వారి జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావాలని ఆకాంక్షించారు. వర్సిటీ వైస్ చాన్సలర్ కేవీ క్రిష్ణకిషోర్ మాట్లాడుతూ కాలానుగుణంగా ఉపాధ్యాయుల బోధనా విధానాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయని తెలిపారు. సంప్రదాయ బోధన నుంచి డిజిటల్ బోధన వైపు విద్యావ్యవస్థ మారిందన్నారు. విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచనా శక్తిని పెంపొందించడంతోపాటు, వారిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ పీఎంవీ రావు మాట్లాడుతూ గురువును దైవంతో సమానంగా భావించే సంప్రదాయం భారతీయ సంస్కృతిలో ఉందన్నారు. గురువలు చూపిన మార్గాన్ని, వారి విలువలను విద్యార్థులు జీవితంలో ఆచరించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని అధ్యాపక సిబ్బందికి నిర్వహించిన పలు క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచినవారికి ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అడ్వైజర్, మాజీ డీజీపి మాలకొండయ్య, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు, యూనివర్సిటీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవాలి

**కిట్స్ అక్షర్ చైర్మన్ డాక్టర్ సుబ్బారావు.**

ప్రత్తిపాడు, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త : విద్యార్థులు తమ కళాశాలలో మంచి క్రమశిక్షణతో మెలుగుతూ, కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవాలని కిట్స్ అక్షర్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ కోయి సుబ్బారావు పేర్కొన్నారు. మండల పరిధిలోని యనమదల గ్రామం వద్దనున్న కిట్స్ అక్షర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రామ్ ను శనివారం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలనతో




కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ కోయ సుబ్బారావు, సెక్రటరీ కోయి శేఖర్ ముఖ్య అతిదులుగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిధులు మాట్లాడుతూ.. ముందుగా ఉపాధ్యాయులకు టీచర్స్ డే శుభాకాంక్షలు తెలియచేయస్తూ నూతన విద్యార్థులకు స్వాగతం పలికారు. కళాశాల విద్యా విధానం, బోధనా పద్ధతులు, విద్యార్థులకు అందించే సౌకర్యాలు, క్రమశిక్షణ, అకడమిక్ కార్యకలాపాలు మరియు సాంకేతిక కార్యక్రమాలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఉన్నత విద్యలో బీటెక్ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, సమస్య పరిష్కార నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ, సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని తెలియజేశారు. విద్యార్థులు సమయ పాలన, క్రమశిక్షణ కలిగి, తల్లితండ్రులను, గురువులను గౌరవించాలన్నారు. విద్యాతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి చెప్పారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అన్ని విధాలుగా సహకరిస్తారని తెలిపారు. ప్రిన్సిపాల్ డా. కల్లూరి రామకోటయ్య మాట్లాడుతూ విద్యార్థులు తమ నాలుగేళ్ల బీటెక్ విద్యను సద్వినియోగం చేసుకొని మంచి ఇంజనీర్లుగా, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. నూతన విద్యార్థులకు ఆయా విభాగాల విద్యా కార్యక్రమాలు, ప్రయోగశాలలు, ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు, ప్లేస్‌మెంట్లు మరియు ఇతర అవకాశాల గురించి వివరించారు. నూతన విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సాహంగా స్వాగతం పలికారు. దీంతో కళాశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం సంతరించుకుంది. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

కార్యక్రమంలో మొదటి సంవత్సరం హెచ్వోడి డాక్టర్ కమ్రుద్దీన్, సిఎస్ఈ, ఎఐఎంఎల్, డిఎస్, ఈసిఈ హెచ్ఓడిలు డాక్టర్ గోపిశెట్టి గురుకేశవదాసు, డాక్టర్ ఆర్. బుల్లిబాబు, డాక్టర్ మహమ్మద్ రఫీ, డాక్టర్ కె. ఆంజనేయులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల స్థాయిని బట్టి విద్యాబోధన చేపట్టాలి

**-ఎస్ఎన్‌టి పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ కొలిపర్తి శివనాగేశ్వరరావు**

**పొన్నూరు, సెప్టెంబర్ 5,ప్రభాతవార్త:** విద్యార్థుల స్థాయి, సామర్థ్యాన్ని బట్టి ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్ఎన్‌టి స్కూల్ డైరెక్టర్ కొలిపర్తి శివ నాగేశ్వరరావు సూచించారు. పట్టణంలోని సాయినగర్‌లోని ఎస్ఎన్‌టి పబ్లిక్ స్కూల్‌లో శనివారం జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు కూడా బోధనలో కొత్త మార్గాలను అన్వేషించి బోధన చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు కూడా గురువులు బోధించే పాఠ్యాంశాల పట్ల శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉపాధ్యాయుల వద్ద ఉన్నటువంటి పరిజ్ఞానాన్ని మొత్తం విద్యార్థి సొంతం



చేసుకునేవిధంగా ఆలోచన చేయాలన్నారు. పాఠ్యాంశాలపై సందేహాలను, ప్రశ్నలను సంధించి ఉపాధ్యాయుల వద్ద నుంచి పరిపూర్ణమైన జ్ఞానాన్ని పొందేవిధంగా విద్యార్థులు మారాలన్నారు. బడికి వచ్చాము...పోయాము...అనేది కాకుండా పాఠశాలకు వచ్చినందు వల్ల ఏ మేరకు మంచి విషయాలు నేర్చుకున్నామనే విషయాలపై ఆలోచన చేయాలన్నారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థుల్లో కూడా మంచి ఆలోచనా శక్తి, సమస్యలను పరిష్కరించుకునేందుకు అవసరమైన మెలకువలు ఉన్నాయని, వాటిని మంచి విషయాలు నేర్చుకునేందుకు ఉపయోగించుకునేవిధంగా విద్యార్థుల్లో మార్పు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి వెలనాటి రామదాసు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సమాజంలో గురువు పాత్ర ఎనలేనిది

**-లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళ అధ్యక్షురాలు శేషుకుమారి**




**పొన్నూరు, సెప్టెంబర్ 5,ప్రభాతవార్త:** సాంకేతికంగా మనం ఎంత అభివృద్ధి సాధించినప్పటికీ సంస్కారం తెలియాలన్నా, నేర్చుకోవాలన్నా గురువు పాత్ర ఎంతో ప్రముఖమైనదని విశ్రాంత తెలుగు పండితురాలు, లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళ అధ్యక్షురాలు పరాశరం శేషుకుమారి అన్నారు. స్వర్ణపురి మహిళ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత తెలుగు పండితులు నాగలింగం హరిహరపంత్, నాగలింగం కృష్ణకుమారి,జి.త్రివేణిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్సీఎం లక్ష్మి, ఆర్డీసి పరాశరం రంగవల్లి, కార్యదర్శి మోహనలక్ష్మి, ఎం.అమరేశ్వరి, బి.శబలాదేవి, బి.నాగమంజరి, ఎన్‌వి పద్మావతి తదితరులున్నారు.

# రాకపోకలకు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలి

**-వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ**



**చేబ్రోలు(పొన్నూరు), సెప్టెంబర్ 5,ప్రభాతవార్త:** ప్రజల రాకపోకలకు అంతరాయం కలుగకుండా, వాహనదారుల భద్రతకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా తక్షణమే అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ కోరారు. శనివారం జీబీసీరోడ్డుపై కొమ్మమూరు కెనాల్‌పై ఉన్న వంతెన ఒక వైపు పడిపోవడంతో సంఘటనా స్థలంలో వంతెనను పరిశీలించారు. బ్రిడ్జి దెబ్బతిన్న ప్రాంతంలో భద్రతా చర్యలు చేపట్టడంతోపాటు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని సూచించారు. అదేవిధంగా బ్రిడ్జి మరమ్మతు , పునర్నిర్మాణ పనులను ఆలస్యం లేకుండా వేగవంతంగా చేపట్టాలని గుంటూరు-బాపట్ల మధ్య రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అంబటి వెంట వైకాపా పట్టణాధ్యక్షుడు షేక్ నాజర్, డక్కుమళ్ళ రవి, పలువురు నాయకులు, కార్యకర్తలున్నారు.

# న్యూరోపతిపై ఆధునిక వైద్య విధానాల పై నిపుణుల మేధోమథనం

**-లలితా పీవీఎస్ ఆధ్వర్యంలో నేడు ప్రత్యేక సీఎంఈ -జాతీయ స్థాయి న్యూరాలజీ నిపుణులతో ప్రసంగాలు, కేస్ ప్రజెంటేషన్లు**

**గుంటూరు మెడికల్,సెప్టెంబరు 5,ప్రభాతవార్త :** పెరిఫెరల్ న్యూరోపతి వ్యాధుల నిర్ధారణ, చికిత్సలో అందుబాటులోకి వచ్చిన ఆధునిక వైద్య విధానాలపై జాతీయ స్థాయి నిపుణులు చర్చించనున్నారు. లలితా పీవీఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో˜లలితా సీఎంఈ సిరీస్‌లో భాగంగా˜అడ్వాన్సెస్ ఇన్ పెరిఫెరల్ న్యూరోపత్తి అంశంపై ప్రత్యేక సీఎంఈ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించనున్నారు.

తక్కెళ్లపాడులోని లలితా పీవీఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ నుంచి రెండు సీఎంఈ క్రెడిట్లు మంజూరయ్యాయి. దేశంలోని ప్రముఖ న్యూరాలజీ నిపుణులు పాల్గొని వివిధ అంశాలపై ప్రసంగించనున్నారు.

ఇమ్యూన్ ఆధారిత న్యూరోపతీల్లో తాజా పరిణామాలు, ఏఐడీపీ, సీఐడీపీలో ఆధునిక చికిత్సా విధానాలు, ఇన్ఫెక్షియస్ న్యూరోపతీల గుర్తింపు, డయాబెటిక్ న్యూరోపతీలో తాజా పురోగతులు, పెరిఫెరల్ న్యూరోపతీల నిర్ధారణ, చికిత్సలో ఆచరణాత్మక విధానాలపై నిపుణులు అవగాహన కల్పించనున్నారు.

కార్యక్రమంలో కేస్ ప్రజెంటేషన్లు, నిపుణులతో చర్చలు, ప్రశ్నోత్తరాలు, ప్రత్యేక క్విజ్ నిర్వహించనున్నారు. న్యూరాలజిస్టులు, వైద్యులు, కన్సల్టెంట్లు, న్యూరాలజీ పీజీ విద్యార్థులు, ఇతర వైద్య విద్యార్థులు, ఆరోగ్య రంగ నిపుణులు పాల్గొననున్నారు.

డయాబెటిక్ న్యూరోపతి అత్యంత సాధారణ న్యూరోపతి సమస్యల్లో ఒకటని, గులియన్‌బారే సిండ్రోమ్ తీవ్రమైన సందర్భాల్లో శ్వాసకోశ వైఫల్యానికి దారితీసే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. సీఐడీపీ వంటి దీర్ఘకాలిక న్యూరోలాజికల్ సమస్యల నిర్ధారణ, చికిత్సలో ఇటీవల వచ్చిన పురోగతులపై కూడా సీఎంఈలో సమగ్రంగా చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

# ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు మొండి చెయ్యి.!

**సీఎంతో భేటీలో ఒక్క మాటైనా మాట్లాడారా?**
**మా శ్రమ కావాలి.. మా సమస్యలు మాత్రం పట్టవా**
**ఏపీ పారామెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ బాబు**

**గుంటూరు మెడికల్,సెప్టెంబరు 5,ప్రభాతవార్త :** ముఖ్యమంత్రితో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు నిర్వహించిన భేటీలో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలకు కనీస ప్రాధాన్యం కూడా లభించలేదని పారామెడికల్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి. రమేష్‌బాబు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.ఉద్యోగ సంఘాల డిమాండ్ల సాధన కోసం ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించే సమయంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సేవలు, శ్రమ అవసరమవుతున్నాయని, కానీ వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విషయంలో మాత్రం ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పట్టనప్పుడు మీ సంఘాల్లో ఎందుకు చేర్చుకుంటున్నారు? మా శ్రమతో మీ డిమాండ్లు సాధించుకోవడమేనా?" అంటూ ఉద్యోగ సంఘాల నాయకులను ఆయన నిలదీశారు.



**సమాన పని..సమాన గుర్తింపు ఏదీ?**

రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా అదే ప్రభుత్వ విభాగాల్లో, అదే విధులను నిర్వహిస్తూ ప్రజలకు సేవలందిస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం ఎందుకు గుర్తించడం లేదని రమేష్‌బాబు ప్రశ్నించారు. ఒకవైపు తమ సేవలను వినియోగించుకుంటూనే మరోవైపు వేతనాలు, ఉద్యోగ భద్రత, భవిష్యత్ ప్రయోజనాల విషయంలో నిర్లక్ష్యం చేయడం అన్యాయమన్నారు.

"ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నాయకులే సేవలందిస్తున్నారా? ఔట్సోర్సింగ్ ఉద్యోగులు సేవలు అందించడం లేదా?" అని ప్రశ్నించారు. ఉద్యోగ సంఘాల నాయకుల జేబులు, కుటుంబాలు మాత్రమే బాగుంటే సరిపోతుందా? ఔట్సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాల పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఇక మాయమాటలు నమ్మం.. మా సమస్యలపై మేమే పోరాడతాం**

ఔట్సోర్సింగ్ ఉద్యోగుల తరఫున పోరాడతామని చెబుతూ ఇంతకాలం మాయమాటలతో మోసం చేయడం ఎంతకాలం కొనసాగుతుందని రమేష్‌బాబు ప్రశ్నించారు. ముఖ్యమంత్రితో జరిగిన భేటీలో కనీసం ఒక్క అంశంపైనైనా ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రస్తావించిన ఉద్యోగ సంఘం ఉందా అని నిలదీశారు.

పక్క రాష్ట్రాల్లో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం పనికి తగ్గ వేతనం కూడా లభించని పరిస్థితి నెలకొందని విమర్శించారు.

# ఆదుకునేందుకు ఎంఎంయూత్ ముందుంటుంది

**-అంజుమన్ కమిటి గౌరవాధ్యక్షుడు షేక్ మహమ్మద్(మాము)**

పొన్నూరు, సెప్టెంబర్ 5,ప్రభాతవార్త: నిరుపేద ముస్లీం మహిళలకు చేయూతనిచ్చేందుకు ఎంఎంయూత్ ఎప్పుడూ ముందుంటుందని అంజుమన్ కమిటి గౌరవాధ్యక్షుడు షేక్ మహమ్మద్(మాము) అన్నారు. రైలు పేటకు చెందిన ఓ పేద ముస్లీం మహిళ వివాహానికి సంబంధించి ఎంఎంయూత్ ఆధ్వర్యంలో బీరువాను బహూకరించారు. ఈ సందర్భంగా మాము మాట్లాడుతూ పేద కుటుంబాలకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలనే ఉద్దేశంతోనే ఎంఎంయూత్ పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎంయూత్ సభ్యులు పాల్గొన్నారు.



# ఆర్వీఐటీలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**చేబ్రోలు(పొన్నూరు), సెప్టెంబర్ 5,ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చేబ్రోలు ఆర్వీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గురించి, ఆయన ఉపాధ్యాయుని నుంచి రాష్ట్రపతిగా ఏ విధంగా ఎదిగారన్న విషయాలను వివరించారు. ఈ సందర్భంగా పలు ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను, అధ్యాపకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్‌వి కృష్ణయ్య, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



# గుంటూరు,విజయవాడలో తొలిసారిగా సంకల్పలో సింథటిక్ లిగ్మెంట్‌తో ఏసీఎల్ శస్త్రచికిత్స

**- మోకాలి ఆర్థోస్కోపీ శస్త్రచికిత్సలో ఆధునిక విధానం..**
**- రోగి శరీరం నుంచి టెండన్ తీసుకునే అవసరం లేకుండా చికిత్స..**
**డాక్టర్ ఘంటా చైతన్య..**


**గుంటూరు మెడికల్, సెప్టెంబర్ 5,ప్రభాతవార్త :** మోకాలి ముందు భాగంలోని ప్రధాన లిగ్మెంట్ (ఏసీఎల్) తెగిపోయిన వారికి నిర్వహించే పునర్నిర్మాణ శస్త్రచికిత్సలో ఆధునిక సింథటిక్ లిగ్మెంట్ గ్రాఫ్టను ఉపయోగిస్తూ గుంటూరు, విజయవాడ ప్రాంతంలో తొలిసారిగా శస్త్రచికిత్స నిర్వహించినట్లు ప్రముఖ ఆర్థోస్కోపీ శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ ఘంటా చైతన్య తెలిపారు. శ్రీ సంకల్ప మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో ఆయన ఆధ్వర్యంలో ఈ శస్త్రచికిత్స నిర్వహించినట్లు పేర్కొన్నారు.సాధారణంగా ఏసీఎల్ (అంటీరియర్ క్రూసియేట్ లిగ్మెంట్-మోకాలి ముందు భాగంలోని క్రూసియేట్ లిగ్మెంట్) పునర్నిర్మాణ శస్త్రచికిత్సలో రోగి శరీరంలోని మరో ప్రాంతం నుంచి టెండన్ (కండరాన్ని ఎముకకు కలిపే నరం)ను తీసుకుని, తెగిపోయిన లిగ్మెంట్ స్థానంలో గ్రాఫ్టగా అమర్చుతారు. అయితే సింథటిక్ లిగ్మెంట్ ఆధారిత జువల్ ఏసీఎల్ విధానంలో రోగి శరీరం నుంచి టెండన్ తీసుకోవాల్సిన అవసరం ఉండదని డాక్టర్ ఘంటా చైతన్య వివరించారు.దీంతో టెండన్ తీసిన ప్రాంతంలో ఏర్పడే నొప్పి ఉండదని, రోగికి అదనపు గాయం లేదా డోనర్ సైట్ పెయిన్ (గ్రాఫ్ట్ తీసిన ప్రాంతంలో నొప్పి) సమస్యను నివారించవచ్చని తెలిపారు. ముఖ్యంగా ఒకేసారి పలు లిగ్మెంట్లు దెబ్బతిన్న సందర్భాల్లో పునర్నిర్మాణానికి ఎక్కువ టెండన్లు అవసరమయ్యే పరిస్థితుల్లో ఈ విధానం ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు.కొన్ని సందర్భాల్లో హైబ్రిడ్ పునర్నిర్మాణ విధానాలతో కలిపి కూడా సింథటిక్ లిగ్మెంట్‌ను ఉపయోగించవచ్చని తెలిపారు. సింథటిక్ లిగ్మెంట్ నిర్మాణం సహజ ఏసీఎల్‌కు సమీపంగా ఉండేలా రూపొందించ బడిందని, సాధారణ విధానాలతో పోలిస్తే కొంత వేగంగా కోలుకునే అవకాశం ఉంటుందని వివరించారు.మోకాలి కదలికలను మెరుగుపరచడంతో పాటు, క్రీడలు మరియు రోజువారీ కార్యకలాపాలకు త్వరగా తిరిగి చేరేందుకు ఈ ఆధునిక విధానం ఉపయోగపడే అవకాశం ఉందని డాక్టర్ ఘంటా చైతన్య తెలిపారు. గుంటూరు, విజయవాడ ప్రాంతాల్లో ఈ తరహా శస్త్రచికిత్సను తొలిసారిగా నిర్వహించడం ఆధునిక ఆర్థోస్కోపీ వైద్య సేవల్లో ఒక ముందడుగుగా ఆయన పేర్కొన్నారు.



# ప్రతి ఉపాధ్యాయుడికి సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆదర్శం

**-విశ్రాంత తెలుగు పండితుడు సూరా రామారావు**

**పొన్నూరు, సెప్టెంబర్ 5,ప్రభాతవార్త:** ప్రతి ఉపాధ్యాయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని విశ్రాంత తెలుగుపండితుడు, ప్రధానోపాధ్యాయుడు సూరా రామారావు అన్నారు. మానవత సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో సూరా రామారావును సంస్థ పక్షాన దుశ్శాలువాతో, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. సూరా రామారావు సర్వీసులో ఉన్నప్పుడు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పడ్డాడని, ఉద్యోగం నుంచి రిటైర్ అయ్యాక లయన్స్‌క్లబ్‌లో కొనసాగుతూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని మానవత సంస్థ సభ్యులు కొనియారు. ఈ కార్యక్రమంలో షేక్ యాసిన్‌బాబా, లియాఖత్, నన్నపనేని బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



6PLD 7ff.qxd:6PLD 7.qxd 01/01/2001 10:38 Page 1



## జమ్మలమడక గ్రామంలో ముత్యాలమ్మ జాతరకు ప్రతిష్ట బందోబస్తు



**మాచర్ల రూరల్ సెప్టెంబర్5 ప్రభాతవార్త;** మాచర్ల మండలం జమ్మలమడక గ్రామంలో ఈనెల 6వ తేదీ నుంచి నిర్వహించ ఎనున్న ముత్యాలమ్మ జాతరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు రూరల్ సీఐ. వేణు. ఎస్సై వెంకట్రావు. తెలిపారు. శనివారం గ్రామంలో గ్రామ పెద్దలు. యువకులు విద్యార్థులతో సమావేశమై అవగాహన కల్పించారు. ముత్యాలమ్మ జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా ప్రతి ఒక్కరు ్నసయ మనం పాటించాలని సూచించారు గ్రామంలో ప్రత్యేక బందోబస్తుతో పాటు నిరంతరం నిఘా ఏర్పాటు చేయనున్నట్లు సీఐ. ఎస్సై. తెలిపారు.

# పల్నాడు జిల్లా వార్త



## సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం:చీఫ్‌విప్ జీ.వీ



**వినుకొండ,సెప్టెంబర్5,ప్రభాతవార్త:** నరసరావుపేట పట్టణంలోని భువనచంద్ర టౌన్‌హాల్ నందు జిల్లా స్థాయి గురుపూజోత్సవ వేడుకలకు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గ్గొన్నారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో విద్యార్థులను ఉత్తమ పౌర ఎలుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనదని కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా విద్యా రంగంలోవిశిష్ట సేవలు అందించిన పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను జీవీ సన్మాని ంచి,ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా,ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు,అధికారులు,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్వార్థం లేని మనిషి ఉపాధ్యాయుడు



**కారంపూడి సెప్టెంబర్5 ప్రభాతవార్త;** కారంపూడి తన దగ్గర విద్యను అభ్యసించి వారు ఉన్నత స్థానాలకు వెళ్లాలని కోరుకుంటారు ఉపాధ్యాయులు. అందుకే పెద్దలు స్వార్థం లేని మనిషి ఉపాధ్యాయుడని అంటారు. శనివారం మండలంలో గురుపూజ వేడుకలు పాఠశాలలో ఘనంగా జరిగింది. సర్వేపల్లి. రాధాకృ ష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాఠశాలల్లో విద్యార్థులు తమ గురువు లను ఘనంగా సత్కరించారు.మన జీవితంలో తల్లిదండ్రుల తర్వాత అంతటి గౌరవాన్ని పొందే వ్యక్తి ఉపాధ్యాయుడు. విద్యార్థికి పాఠ్యపుస్తకాలలోని జ్ఞానాన్ని అందించడమే కాకుండా జీవితంలో ఎలా ముందుకు ఎదగాలి, కష్టాలు ఎలా ఎదుర్కోనాలి సమాజంలో బాధ్యతాయుతమైన వ్యక్తిగా నిలవాలని ఉపాధ్యాయుడు కోరుకుంటాడు. అక్షరాలు నేర్పటమే కాదు జీవితానికి అర్థం నేర్పే మహానుభావుడు గురువని పలువురు కొనియాడారు. సత్య సేవా సమితి ఆధ్వర్యంలో గురు ఎ ూజోత్సవం స్థానిక బ్రహ్మానాయుడు జిల్లా పరిషత్ హై స్కూల్ లో సత్య సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో గురుపూజోత్స వ వేడుకలు జరిగాయి . ఉపాధ్యాయులను ఘనంగా సత్కరి ంచారు. గోడ గడియారాలను అందజేశారు. కార్యక్రమంలో వెచ్చ వరలక్ష్మణరావు, తుమ్మేపల్లి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## సింగరుట్ల లక్ష్మీ నరసింహా స్వామిని దర్శించుకున్న సీఐ భాస్కర్



**కారంపూడి సెప్టెంబర్5 ప్రభాతవార్త;** కారంపూడి మండలంలోని పేట సన్నగాండ్ల గ్రామ శివారులోని నల్లమల అడవులలో స్వయంభుగా వెలిసిన శ్రీ సింగ రుట్ల లక్ష్మీ ్మ నరసింహా స్వామిని కారంపూడి సర్కిల్ ఇన్స్పెక్టర్ భాస్కర్ శనివారం స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థాన వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీనివాసరావు, కార్యనిర్వహణాధికారి శివ నాగిరెడ్డి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ భాస్కర్ ను శాలువతో ఘనంగా సన్మానించారు. అనంత రం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి చిత్ర పట్టని అందచేశారు ప్రతి శని వారం జరిగే అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ భాస్కర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా సింగరుట్ల లక్ష్మీ్మ నరసింహా స్వామి కొలువుతీరి ఉన్నాడని, స్వామిని దర్శించుకోవడం అదృష్టంగా భావిస ్తున్నానని అన్నాడు. దేవాలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

## గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరి

**ఎస్సై. వెంకట్రావు**



**మాచర్ల రూరల్ సెప్టెంబర్5 ప్రభాతవార్త;** వినాయక చవితి సందర్భంగా గణేష్ మండపాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు సంబంధిత శాఖలనుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతులు పొందాలని. మాచర్ల రూరల్ ఎస్సై . ఎం. వెంకట్రావు సూచించారు. గణేష్ మండపాల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు కోసం సింగిల్ విండో. విధానంలో ఆన్ లైన్ ద్వారా ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మండపాల నిర్వాహకులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని. సూచించారు వినాయక నిమజ్జనం సందర్భంగా డీజే లకు. ఎలాంటి అనుమతి లేదని ఎస్సై స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిమజ్జన ఊరేగింపును రాత్రి 10. గంట లోపు పూర్తిచేయాలని సూచించారు ప్రజలు, గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించి వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని మాచర్ల రూరల్ ఎస్సై. ఎం వెంకట్రావు కోరారు.

## ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



**విజయపురిసౌత్ సెప్టెంబర్5 ప్రభాతవార్త;** :ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని భారతదేశ మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త,విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని కళాశాలలో ప్రిన్సిపాల్ డా.ఎన్.శ్రీని వాసరావు ఘనంగా నిర్వహిం చారు.అనంతరం అయన మాట్లా డుతూవిద్యార్థులకు కేవలం విద్యను అందించడమే కాకుండా, వారిలో నైతిక విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన పౌరసత్వాన్ని పెంపొందిస్తుందని పేర్కొ న్నారు.వ యందుగాడాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయుల ప్రాముఖ్యతను, విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు పోషించే కీలక పాత్రను వివరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడా దుస్తులు వితరణ



**దుర్గి సెప్టెంబర్5 ప్రభాతవార్త;** విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపేం దుకు దుర్గి మండలం పోలేపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ కు చెందిన 24 మంది విద్యార్థులకు గ్రామ పెద్దలు బూసాని నాగంాజు,దేశం వెంకటరెడ్డి,బిట్టు అనంతరామయ్యలు శనివారం క్రీడా దుస ్తులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలేపల్లి హైస్కూల్ విద్యార్థులు క్రీడల్లో రాణించి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలనిఆకాంక్షించారు. వారిలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు క్రీడా దుస్తులను అందజేసినట్లు తెలిపారు.ఇంకా పాఠశాల అభివృద్ధికి భవిష్యత్తులో తమ వంతు సహాయ సహ కారాలు అందిస్తామని అన్నారు. హెచ్ఎం ఆర్. బాబుల్లా మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు గ్రామ పెద్దలు క్రీడా దుస్తులు అందజేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్య క్రమంలో పిడి శివకృష్ణా నాయక్, ఎస్ఎంసి సభ్యులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వరవకట్టలో పోలీసుల కార్డెన్ సెర్చ్



**నరసరావుపేట క్రైమ్, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త ::** పట్టణంలోని వరవకట్టలో శనివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు వన్ టౌన్ సీఐ ఫిరోజ్ తెలియజేశారు. ఐజి త్రిపాఠి ఉత్తర్వుల మేరకు అదనపు ఎస్పీ రోహిత్ చౌదరి, డీఎస్పీ హనుమంతరావు ఆదేశాలతో కార్డెన్ సెర్చ్ జరిగిందన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వరవకట్ట సమస్యాత్మక ప్రాంతంగా గుర్తించి కార్డెన్ సెర్చ్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో27 బైకులు, 3 ఆటోలు సీజ్ చేశామని, సరైన పత్రాలు ఉంటే తమ వాహనాలు పొందవచ్చు అన్నారు. పత్రాలు లేని వాహనాలను కోర్టులో పెడతామన్నారు. యువత గంజాయి కి అలవాటు పడితే జీవితాలు సర్వనాశనం అవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధరించకపోవడం వలన ప్రమాదాలు జరిగినప్పుడు మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. కార్డెన్ సెర్చ్ లో వంద మంది సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ సీఐ సిహెచ్ ప్రభాకర్ రావు, రూరల్ సీఐ ఎం.వి సుబ్బారావు,చిలకలూరిపేట టౌన్ సీఐ పి రమేష్, వినుకొండ రూరల్ సీఐ బ్రహ్మయ్య, ఎస్సైలు పల్లపోతు వంశీకృష్ణ, అరుణ రెడ్డి, లోకేశ్వర్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ నీలంపాటి అమ్మవారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట



**వినుకొండ,సెప్టెంబర్5,ప్రభాతవార్త:** మండల ంలోని కోటప్పనగర్ గ్రామం నందు శ్రీ నీలంపాటి అమ్మవారు ఆలయ ఆవరణలో వినాయక,న ాగమయ్య స్వామి విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివా రు,అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై మెండుగా ఉండాలని ప్రార్థించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలకు ఎటువంటి అడ్డంకులు తలెత్తకుండా త్వరితగతిన పూర్తి కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు,మక్కెన అభిమాను లు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా 70 మంది ఉపాధ్యాయలకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవం

**పాల్గొన్న జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా,**

**ప్రభుత్వ చీఫ్ విప్ జీవి,ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు**



**నరసరావుపేట, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త ::**విద్యార్థులకు విద్యాబోధనతో పాటు విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా,ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు,ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ హెన్రీ క్రిస్టినా అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నరసరావుపేట భువనచంద్ర టౌన్‌హాల్‌లో నిర్వహించిన పల్నాడు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రదానోత్సవంలో వారు మాట్లాడారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత పెంపొందించడంలో ఉపాధ్యాయులు రోల్ మోడల్స్‌గా నిలవాలని అన్నారు. ఉపాధ్యాయుల నడవడికను విద్యార్థులు, సమాజం గమనిస్తుంటారని పేర్కొన్నారు. ఉపాధ్యాయ వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు.విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి విద్యకు దూరం కాకుండా అవసరమైన సహకారం అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, పోషకాహారం తదితర సదుపాయాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందన్నారు.పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛందంగా సహకరిస్తున్నారని, సైకిల్ స్టాండ్లు, సైకిళ్లు, కంప్యూటర్లు తదితర సదుపాయాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే డా. చదలవాడ అరవింద బాబు తెలిపారు. పాఠశాలల అభివృద్ధిలో ఇటువంటి భాగస్వామ్యం మరింత పెరగాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా మాట్లాడుతూ తన జీవితంలో తాను సాధించిన విజయాల వెనుక ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, జ్ఞానం, క్రమశిక్షణ కీలకంగా నిలిచాయని తెలిపారు. యుపిఎస్సి , ఐ ఏ ఎస్ సాధించడంలో తనకు చి న్ననాటి నుంచి ఉపాధ్యాయులు అందించిన మార్గనిర్దేశం, సమయం, జ్ఞానాన్ని ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నానన్నారు.ప్రస్తుత కాలంలో బోధనా వృత్తి గతంలో కంటే మరింత సవాళ్లతో కూడుకున్నదని కలెక్టర్ అన్నారు. నేటి తరం విద్యార్థులకు డిజిటల్ పరికరాలు, ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత సమాచారానికి ప్రాప్యత ఉందని, అందువల్ల ఉపాధ్యాయులు కూడా తమ జ్ఞానాన్ని నిరంతరం నవీకరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతికతను బోధనలో సమర్థంగా వినియోగిస్తూ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా డయాగ్రామ్‌లు, కార్యకలాపాలు, నమూనాలు తదితర పద్ధతులను ఉపయోగించాలని సూచించారు.విద్యార్థుల చదువుతో పాటు వారి వ్యక్తిత్వ వికాసం, విలువలు, నైతికత, బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడంపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రతి రోజు తరగతి సమయంలో కొంత సయాన్ని విలువల విద్య, వ్యక్తిత్వ వికాసానికి కేటాయించాలని కోరారు. విద్యార్థుల్లో ప్రవర్తనా మార్పులు గమనించిప్పుడు వారిని ప్రత్యేకంగా పిలిచి మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేయాలని చెప్పారు.నేటి విద్యార్థులపై సామాజిక మాధ్యమాలు, డిజిటల్ ప్రపంచం ప్రభావం ఎక్కువగా ఉందని, దీనివల్ల చదువుపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. విద్యార్థుల్లో ఒత్తిడి, మానసిక ఆందోళనలు వంటి సమస్యలను గుర్తించి వారికి అవసరమైన మార్గదర్శకత్వం అందిండంలో ఉపాధ్యాయులు కీలకంగా వ్యవహరించాలన్నారు. 70 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు విద్యారంగంలో విశిష్ట సేవలు అందించిన 70 మంది ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులకు పల్నాడు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు తదితర విభాగాలకు చెందిన ప్రతిభావంతులను అవార్డులకు ఎంపిక చేశారు.కార్యక్రమంలో వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, పల్నాడు జిల్లా సమగ్ర శిక్ష అదనపు కోఆర్డినేటర్ శ్యామ్ ప్రసాద్, గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టీనా, జిల్లా విద్యాశాఖాధికారి పివిజె రామారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

## డీఎస్సీ అక్రమాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి

**డాక్టర్ గోపిరెడ్డి**



**నరసరావుపేట, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:** డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలు, అవతవకలపై ప్రభుత్వం సగ్రంగా విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస ్యల పరిష్కారం కోసం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు చేపట్టిన "గురు పరిరక్షణ దీక్ష....కు ఆయన శనివ ారం సంఘీభావం తెలిపారు.తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్ద ఎమ్మెల్సీలు చేపట్టిన దీక్షలో డాక్టర్ గోపిరెడ్డి పాల్గొని మాట్లాడారు. డీఎస్సీ ప్రక్రియలో చోటుచేసుకున్న అక్రమాలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని, అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఉపాధ్యాయుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్‌సీపీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. దీక్షలో కూర్చున్న ఎమ్మెల్సీలకు డాక్టర్ గోపిరెడ్డి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు



**నరసరావుపేట టౌన్, సెప్టెంబర్ 5, ప్రభాత వార్త ::** స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవం(గురుపూజోత్సవ) వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యమ్రానికి కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలవాల వేసి ఘనంగా నివాళుర్పించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలమన్నారు. విద్యార్థులను క్రమశిక్షణతో కూడిన ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులపై ఉందన్నారు.విద్యార్థులు ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, అధ్యాపక సిబ్బందిని శాల ఎవాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి పాదాభివందనం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యమ్రంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో పాటు విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్ఈసీలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 5, ప్రభాత వార్త:** స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల (ఎన్ఈసీ)లో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆవరణలో కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాని కి పూలమాల వేసి నివాళులర్పి ంచారు.ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, సెక్రటరీ మిట్టపల్లి రమేష్ బాబు, ప్రిన్సిపాల్ డా. ఎస్. వెంకటేశ్వర్లు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డా.సురేష్, వైస్ ప్రిన్సిపాల్ డా. డి. సునీల్ తదితరులు ఉపాధ్యాయుల ప్రాధాన్యను వివరించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధ్యాపకులను కళాశాల యామాన్యం రివార్డులు, సర్టిఫికెట్లతో సత్కరించింది. కార్యక్రమాన్ని విజవంతంగా నిర్వహించిన మెకానికల్ విభాగాధిపతి బి. వెంకట శివను చైర్మన్ అభినందించారు. కార్యమ్రంలో వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 7న మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం



**నరసరావుపేట టౌన్, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:**నరసరావుపేట మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం సెప్టెంబర్ 7వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి.వి. కృష్ణకుమారి తెలిపారు. ఈ మేరకు ఆమె శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండల పరిషత్ అధ్యక్షురాలు ఎర్రబోయిన సుబ్బాయమ్మ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించనున్నారు. సమావేశంలో మండల పరిధిలోని ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, గ్రామ పంచాతీల సర్పంచులు, సంబ ంధిత ప్రజాప్రతినిధులు తన్పిసరిగా హాజరు కావాలని అధికారులు సూచించారు.సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల వారీగా మండలంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించనున్నారు. ఆయా శాఖలకు సంబంధించిన అంశాలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చించి పురోగతిని సమీక్షించే అవకాశం ఉంది. అలాగే మండల పరిషత్ అధ్యక్షురాలి అనుమతితో ఇతర అంశాలను కూడా సమావేశంలో ప్రస్తావించి, చర్చించి అవసరమైన నిర్ణయాలు తీసుకోనున్నట్లు ఎంపీడీవో కృష్ణకుమారి తెలిపారు.మండల అభివృద్ధికి సంబంధించిన సమస్యలు, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, గ్రామాల్లో చేపట్టాల్సిన పనులు తదితర అంశాలపై సమావేశంలో చర్చ జరిగే అవకాశం ఉండటంతో సంబంధితప్రజాప్రతినిధులు, అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని అధికారులు కోరారు.

## కొండకావూరులో ఇంటింటికి ఎమ్మెల్యే డా.అరవింద బాబు



**నరసరావుపేట, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:** నరసరావుపేట మండలం కొండకావూరు గ్రామంలో శనివారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు కూటమి నాయకులతో కలిసి ఇంటింటికీ పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రవ ాలను వివరిస్తూ ప్రజలకు కపత్రాలను పంపిణీ చేశారు.అనంతరం గ్రామ ప్రజలను నేరుగా కలిసి వారి సస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు వివరించిన సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అవసమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లడంతో పాటు, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తూ ఎమ్మెల్యే నిరంతరం అందుబాటులో ఉంటున్నారని కూటమి నాయకులు తెలిపారు.కార్యక్రమంలో పామిడిపాడు మాజీ సర్పంచ్, క్లస్టర్ ఇన్‌చార్జి వసంత యలవ ందరాయ, నాయకులు రంగిశెట్టి రామకృష్ణ, షరీఫ్, దొండపాడు విశ్వేశ్వరరావు, డి. లక్ష్మయ్య, సీహెచ్ రాజ్యలక్ష్మి, డి. కుమారి తదితరులు పాల్గొన్నారు.

## నూజెండ్ల మండలంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**వినుకొండ,సెప్టెంబర్5,ప్రభాతవార్త:** మం డల ంలోని సీతారామపురం గ్రామంలో ఉన్న ఎస్.వి .ఎస్.సి. హైస్కూల్ లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్స వం వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శిష్టా కామేశ్వరరావు శర్మ మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవ ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. వివరించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ఉపాధ్యాయ వృత్తి నుంచి కష్టపడి అంచలంచెలు గా ఎదిగి రాష్ట్రపతిగా వెళ్లిన విధానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భారతి రాణి, విశ్వనాథరెడ్డి,రమాదేవి,శిరీష,ఓబులమ్మ,నాగూర్బీ,విజయ్ సురేఖర్,రి టైర్డ్ క్రాఫ్ట్ ఉపాధ్యాయులు ప్రభల శివ రామ కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గీతాంజలి స్కూల్‌లో బాధ్యతల స్వీకార వేడుకలు



**వినుకొండ,సెప్టెంబర్5,ప్రభాతవార్త:** స్థానిక గీతాంజలి స్కూల్స్ నందు ఇన్వెస్టిచర్ సెర్మనీ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వినుకొండ మున్సిపల్ కమిషనర్ శ్రీ శివరామకృష్ణ,మండల విద్యాశాఖ అధికారి జఫ్రుల్లా,శానిటరీ ఇన్స్పెక్టర్ ఇస్మాయిల్ విచ్చేసి చిన్నారులకు శుభాకాంక్షలు అందించారు. టీచర్స్ డే సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాలల్లోని విద్యార్థులను నాలుగు గ్రూపులుగా విభజించి ఒక్కొక్క గ్రూపును ఒక్కొక్క హౌస్‌గా చాట్ జిపిటీ, మెటా,ఏఐ,జెమినీ ఏర్పాటు చేశారు. ఈ గ్రూపులలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలలో ఆరోగ్యకరమైన కాంపిటీషన్స్ నిర్వహించి మార్చిలో ప్రథమంగా నిలిచినటువంటి గ్రూపులు సత్కరించనున్నట్లు పాఠశాల యాజమాన్యం తెలిపారు. అలాగే ప్రతి గ్రూపు నుండి హెడ్ కెప్టెన్,వైస్ కెప్టెన్లను ఎన్నుకొని వారికి బ్యాడ్జీలను అందజేశారు. అనంతరం విద్యార్థులందరూ చక్కగా రాణిస్తా మని పాఠశాలకు మంచి పేరును తీసుకొని వస్తామని తల్లిదండ్రులకు,గురువులకు బాధ్యతతో కూడిన సహకారాన్ని అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ వై లక్ష్మణ కిషోర్ ,ప్రిన్సిపల్ టి.కృష్ణవేణి, ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## రాఘవయ్యకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు




**గురజాల, సెప్టెంబరు 5 ప్రభాతవార్త :** పట్టణంలోని ప్రభుత్వోన్నత పాఠశాలలో ఫిజిక్స్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న పల్లపాటి రాఘ వయ్య ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం నరసరావుపేటలోని టౌన్ మాల ంలో డీఈవో రామారావు, జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో డాక్టర్ ఆకల సత్యనారాయణ, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

## గురు పరిరక్షణ దీక్షలో పాల్గొన్న డాక్టర్ గజ్జల

**డీఎస్సీ అక్రమాలపై ప్రశ్నిస్తూ**

**వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీల దీక్ష**



**సత్తెనపల్లి (సెప్టెంబర్ 5, ప్రభాతవార్త):** దగా డీఎస్సీలో జరిగిన అక్రమాలను ప్రశ్నిస్తూ తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు చేపట్టిన "గురు పరిరక్షణ దీక్ష కార్యక్రమంలో సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా డీఎస్సీ ప్రక్రియలో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై ప్రభుత్వం సమగ్రంగా స్పందించి, ఉపాధ్యాయ అభ్యర్థులకు న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు.

MN 8 PAGE-BPTfff:MN 8 PAGE-BPTfff 01/01/2001 10:39 Page 1



బాపట్ల జిల్లా వార్త



## ఎస్‌సి,ఎస్టీ,బిసి ఓటర్ల జాబితాపై గ్రామసభ

**నిజాంపట్నం, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** ఎస్‌సి, ఎస్‌టి, బిసి ఓటర్ల జాబితాలో లోటుపాట్లు ఏమైనా ఉంటే తెలియజేయాలని ఎంపిడిఓ నాగలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని కూచినపూడి, హారీస్‌పేట, గరువుపాలెం, ముత్తుపల్లి, గుర్నాధనగర్‌లలో గ్రామసభ నిర్వహించారు. ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో జిఎస్ డబ్ల్యుఎస్ డిప్యూటీ ఎంపిడిఓ శివకుమార్, విఆర్‌ఓ వేణు, ఆయా పంచాయితీల కార్యదర్శులు, విఆర్‌ఓలు పాల్గొన్నారు.



## గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలి

**కొల్లిపర, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** పోషక విలువలతో కూడిన ఆహారాన్ని గర్భిణీలు తీసుకోవాలని వైద్యాధికారి ప్రియాంక అన్నారు. శనివారం కొల్లిపర మండలంలోని దావులూరులో వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించిన డాక్టర్లు అవసరమైన మందులను పంపిణీ చేసి తగిన సలహాలు, సూచనలిచ్చారు. వైద్యాధికారి ప్రియాంక మాట్లాడుతూ విధిగా గర్భిణీలు నెలకోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. వైద్యుల సూచనలను ఆచరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి సుజీకుమారి, డిఈవో బొమ్ము కోటిరెడ్డి, ఆశా కార్యకర్తలు స్వరూపరాణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



# ఓటర్ల సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

**- బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ - నిర్లక్ష్యం వహించిన వీఆర్‌వోపై చర్యలకు ఆదేశం**

**కర్లపాలెం, సెప్టెంబర్5, ప్రభాతవార్త :** ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. శనివారం ఆయన కర్లపాలెం మండలం చింతయపాలెం జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలోని 198వ పోలింగ్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న హియరింగ్ దరఖాస్తుల వివరాలపై విఆర్‌ఓ, ఏఈఆర్‌ఓలను ఆరా తీశారు. గత రెండు నెలలుగా ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ, హియరింగ్‌లో ఎలాంటి పురోగతి లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన వీఆర్‌వోపై చర్యలు తీసుకోవాలని బాపట్ల ఆర్డీవోను ఈఆఫీస్ ద్వారా ఫైల్ పంపాల్సిందిగా ఆదేశించారు. అనంతరం కర్లపాలెం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడ కంప్యూటర్‌లో నమోదవుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ సమాచారాన్ని, ఓటర్ల ఫోటోల నమోదు తీరును పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి ప్రక్రియలోఏమైనా సమస్యలు ఎదురవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారిహరికుమార్, కర్లపాలెం తహాశీల్దార్ రవీంద్ర, ఎంపీడీవో శ్రీనివాసరావు, వీఆర్‌వో షేక్ మహబూబ్ సుభాని మరియు ఇతర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**రేపల్లె, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** పట్టణంలోని విద్యా సంస్థలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో భాగంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత దేశం రెండవ రాష్ట్రపతి, తత్వవేత్త, ఉపాధ్యాయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ సేవలను వక్తలు కొనియాడారు. తమిళనాడు రాష్ట్రంలోని తిరుత్తణిలో ఒక తెలుగు కుటుంబంలో జన్మించిన రాధాకృష్ణ ఉన్నత శిఖరాలను అధిరోహించడం భారతదేశానికే గర్వకారణమని ప్రశంసించారు. సర్వేపల్లి రాధాకృష్ణ పుట్టిన రోజును భారత దేశంలో ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం విశేషమని వక్తలు పేర్కొన్నారు. విద్యార్థులు పాటలు ఆలపించారు. నృత్యాలు ప్రదర్శించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉపాధ్యాయులను సత్కరించారు. మౌంట్ ఫోర్ట్ విద్యా సంస్థ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డిలు ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. నారాయణ విద్యా సంస్థలో జరిగిన కార్యక్రమంలో చైతన్య వేదిక అధ్యక్షుడు కొండపల్లి వెంకటేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు జగన్మోహన్‌రావు, ఆవుల సాంబశివరావు, మోక్షానందం, హరిప్రసాద్, కన్నా నటరాజ్, రమేష్ తదితరులను ఘనంగా సత్కరించారు.




# రాష్ట్రస్థాయి క్రీడల్లో బాపట్ల పోలీసుల సత్తా

**- 14 మంది పోలీసులకు 36 పతకాలు - 9స్వర్ణాలు,17రజతాలు, 10 కాంస్యాలు -విజేతలను అభినందించిన ఎస్పీ ఉమామహేశ్వర్**

**బాపట్ల, సెప్టెంబర్5, ప్రభాతవార్త. ప్రతినిధి:**

రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడా పోటీల్లో బాపట్ల జిల్లా పోలీసులు సత్తా చాటారు. రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల1 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించిన 1వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్-2026 పోటీల్లో గుంటూరు రేంజ్ తరఫున పాల్గొన్న బాపట్ల జిల్లాకు చెందిన 14 మంది



అధికారులు, సిబ్బంది ఏకంగా 36 పతకాలు సాధించి ఔరా అనిపించారు. ఇందులో 9 స్వర్ణ, 17 రజత, 10 కాంస్య పతకాలు ఉన్నాయి. శనివారం జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో విజేతలను ఎస్పీ బి.ఉమామహేశ్వర్అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని మెడల్స్‌తో సత్కరించామన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రత్యేక రివార్డులు అందజేస్తామన్నారు. ఆర్. రాంబాబు (బాపట్ల టౌన్ సీఐ) లాన్ టెన్నిస్ సింగిల్స్‌లో స్వర్ణ పతకం సాధించారు. పి. నాగబ్రహ్మారెడ్డి (పీజీఆర్ఎస్ సెల్ కానిస్టేబుల్) ఈత పోటీల్లో ఒక స్వర్ణం, మూడు రజతాలు, మూడు కాంస్యాలతో మొత్తం ఏడు పతకాలు సాధించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జి. సునీత (చీరాల 1 టౌన్ ఉమెన్ కానిస్టేబుల్) వెయిట్ లిఫ్టింగ్‌లో స్వర్ణం, కబడ్డీ, జావెలిన్ త్రోలో రజతాలు, షాట్‌పుట్, డిస్కస్ త్రో, హామర్ త్రోల్లో కాంస్యాలు సాధించి మొత్తం ఆరు పతకాలు గెలుచుకున్నారు. సి. హెచ్. సునీత (చీరాల 2 టౌన్ ఉమెన్ కానిస్టేబుల్) ఆర్మ్ రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్‌లో రెండు స్వర్ణాలు, కబడ్డీలో రజత పతకం సాధించారు. వి. నరేంద్ర (కర్లపాలెం కానిస్టేబుల్) పెన్‌చాక్ సిలాట్, వుషు, ఫెన్సింగ్‌లో మూడు స్వర్ణాలు, కరాటేలో రజతం, తైక్వాండోలో కాంస్యం సాధించారు. నాగవాణి (వేదుళ్లపల్లి ఉమెన్ కానిస్టేబుల్) కరాటే, తైక్వాండో, బాక్సింగ్‌లో రజతాలు, పెన్‌చాక్ సిలాట్‌లో రెండు కాంస్య పతకాలు సాధించారు. ఎం. నరేష్‌బాబు (ఏఆర్ కానిస్టేబుల్) బాడీ బిల్డింగ్‌లో స్వర్ణం, రెజ్లింగ్‌లో కాంస్యం సాధించారు. జి. వి. ఎస్. నాగకుమార్, ఎం. గోపి (ఏఆర్ కానిస్టేబుళ్లు) డాగ్ స్క్వాడ్ ట్రాకర్ పోటీల్లో రజత పతకాలు సాధించారు. కబడ్డీలో వేటపాలెం కానిస్టేబుళ్లు ఎం. వెంకటరెడ్డి, ఎన్. వి. సుబ్బారెడ్డి, ఏఆర్ కానిస్టేబుల్ బి. నాగఆంజనేయులు, పీజీఆర్ఎస్ సెల్ మహిళా కానిస్టేబుల్ ఎన్. స్వరూప రజత పతకాలు సాధించారు. వి. శివశంకర్ (ఏఆర్ కానిస్టేబుల్) హ్యాండ్‌బాల్‌లో కాంస్య పతకం సాధించారు. షాడో జాగిలం మెరుపులు రాష్ట్రస్థాయిపోలీస్ జాగిలాల పోటీల్లోనూ బాపట్ల జిల్లా జట్టు ప్రతిభ చాటింది. జిల్లాకు చెందిన షాడో జాగిలం అద్భుత ప్రదర్శనతో ట్రోఫీతో పాటు రజత పతకాన్ని సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా ఎస్పీ ఉమామహేశ్వర్ మాట్లాడుతూవిధి నిర్వహణలో తీవ్ర ఒత్తిడికి గురయ్యే పోలీసులకు క్రీడలు ఎంతో ఉపయోగకరమన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచే పోలీసు సిబ్బందిని ప్రోత్సహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ షేక్ మోలుద్దిన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# స్వచ్ఛంద సంస్థల సేవలు ప్రశంసనీయం

**రేపల్లె, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** సమాజంలో స్వచ్ఛంద సంస్థల సేవలు ప్రశంసనీయమని జై భీమ్ రావ్ భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడ శ్రావణ్ కుమార్ అన్నారు. శనివారం భట్టి ప్రోలు మండలంలోని వెల్లటూరులో వైపి రావు చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యాలయాన్ని



ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు యన్నం పార్వతీశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ యన్నం సురేష్ అధ్యక్షతవహించారు. శ్రావణ్ కుమార్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ కొన్నేళ్ళుగా అనేక సేవా కార్యక్రమాలను వైపి రావు చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్నదని చెప్పారు. పేద ప్రజల సంక్షేమం నెరవేరుతున్నదన్నారు. విద్య వికాసం, ఉచిత వైద్యం, ఆపత్కాల సహాయం, పునరావాసం, సామాజిక భరోసా, మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి, క్రీడలు, పర్యావరణ పరిరక్షణ తదితర కార్యక్రమాలను చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ సురేష్ ఎంచుకోవడం అభినందనీయమని శ్రావణ్ కుమార్ కొనియాడారు. అనంతరం అగ్ని ప్రమాద బాధితులు కనపర్తి రెబ్బమ్మ(ఆళ్ళమూడి), దాస్(చినపులివర్రు)లకు నిత్యావసర సరుకులు, వంట సామగ్రి, దుస్తులను, 25 మంది వృద్ధులు, వితంతువులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. న్యాయవాదులు, పాత్రికేయులు డి. సాంబశివరావు, జి. రవిరాజు, కె. వెంకటేశ్వరావు, ఎ సోమశేఖర్, కె. విక్టర్ ప్రసాద్, కిషోర్, మహబూబ్ సుభాని తదితరులను జడ శ్రావణ్ కుమార్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో డి. రమేష్ రాంజీ, పి. సురేష్, రామారావు, జె. వాసు, ఎం. దుర్గాప్రసాద్, ఎ. మల్లేశ్వరి, జాన్‌శ్రీ, కె. రాణి, పి. ప్రసన్న, బి. రాజు, టి. శ్రీనివాస రావు, షణ్ముఖ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు

**రేపల్లె, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** భట్టి ప్రోలు ప్రాంతంలో రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ కె. అమీర్ చెప్పారు. శనివారం ఆయన మాట్లాడుతూ భట్టి ప్రోలు వ్యవసాయ మార్కెట్ ఏరియాలో మూడు రహదారుల కూడలి ప్రాంతంలో ముళ్ళ పొదలను తొలగించామని వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. మలుపు రహదారులలో ముళ్ళ పొదలను తొలగిస్తున్నట్లు చెప్పారు. భట్టి ప్రోలు వై జంక్షన్ సమీపంలోని 216 జాతీయ రహదారి ప్రవేశ మార్గం మలుపులో ముళ్ళ చెట్లను జెసిబితో తొలగిస్తున్నట్లు అమీర్ వెల్లడించారు. ది ్వచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. కారు వాహనాలలో సీటు బెల్ట్ ధరించాలని చెప్పారు. మితిమీరిన వేగం, అజాగ్రత్తతో ప్రమాదాలు తెచ్చుకోవద్దని ఆయన సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని చెప్పారు. ట్రాఫిక్, రహదారి నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఆయన కోరారు.



## మిత్రపక్షాల పొత్తు ధర్మంలో భాజపాకు దక్కని ప్రాధాన్యత : మణిదీప్‌రెడ్డి

**కొల్లిపర, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** మిత్రపక్షాల పొత్తు ధర్మంలో భాగంగా క్షేత్రస్థాయిలో భారతీయ జనతా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కనీస ప్రాధాన్యత లభించని పరిస్థితులు నెలకొన్నాయని భారతీయ జనతా



పార్టీ యువజన విభాగం గుంటూరు జిల్లా కార్యదర్శి ఆరిమండ మణిదీప్ రెడ్డి అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి పార్టీలు ఏకపక్షంగా ముందుకు సాగే క్రమంలో బిజెపిని పక్కన పెడితే ఉపేక్షించేది లేదని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఒక్క ఓటు కూడా అత్యంత విలువైనదేనని, అభ్యర్థుల గెలుపైనా ఓటమి అయినా ఆ ఒక్క ఓటుతోనే నిర్ణయించబడుతుందని భాగస్వామ్యపక్షాలు గ్రహించాలని సూచించారు. పొత్తు అంటే కేవలం పై స్థాయిలోని నాయకులు తీసుకునే నిర్ణయం మాత్రమే కాదని క్షేత్రస్థాయిలో కార్యకర్తల సమన్వయంతో సాగాల్సిన ప్రయాణమని మణిదీప్ రెడ్డి గుర్తు చేశారు. పార్టీ శ్రేణులను విస్మరించి ముందుకు సాగినపక్షంలో క్షేత్ర స్థాయిలో జరిగే పరిణామాలకు భాగస్వామ్య పక్షాలే నైతిక బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికైనా బిజెపి కార్యకర్తలకు తగిన గుర్తింపు, గౌరవం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అందరికీ సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ ఉమ్మడి నిర్ణయాలతో ముందుకు సాగాలని మణిదీప్ రెడ్డి కోరారు. ఈ సమావేశంలో భారతీయ జనతా పార్టీ యువజన విభాగం ఉపాధ్యక్షుడు మేదూరి యశ్వంత్, బిజెపి యువజన విభాగం కొల్లిపర మండల నేత బొంతు వెంకటరెడ్డి, కొల్లిపర మండల బిజెపి అధ్యక్షుడు మంద్రు మురళీధర్, గుంటూరు జిల్లా బిజెపి కార్యవర్గసభ్యుడు మునగాల కృష్ణమూర్తి, కొల్లిపర మండల బిజెపి సోషల్ మీడియా ప్రతినిధి భీమవరపు లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక పోరుకు జనసేన సమరశంఖం

**- పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ ఏర్పాటు - అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాలు**

**బాపట్ల, సెప్టెంబర్5, ప్రభాతవార్త. ప్రతినిధి:** రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జనసేన పార్టీ, తన వ్యూహాలకు పదును పెట్టింది. ఎన్నికల ప్రక్రియను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా సమన్వయం చేయడం, పర్యవేక్షణ బాధ్యతలను వేగవంతం చేసే దిశగా పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీ తరఫున ప్రత్యేకంగా ఎన్నికల నిర్వహణ కమిటీని నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ కీలక కమిటీలో బాపట్లకు చెందిన సీనియర్ నాయకుడు కారుమూరి ఆంజినేష్‌కు చోటు దక్కింది. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి, కార్యకర్తలను ఏకం చేయడంలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తించిన అధిష్టానం, ఈ కీలక బాధ్యతలను అప్పగించింది.

**కమిటీకి ప్రత్యేక బాధ్యతలు:** స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి విధివిధానాల రూపకల్పన, క్షేత్రస్థాయిలో కూటమి అభ్యర్థుల గెలుపునకు కావలసిన వ్యూహాలు, పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం తదితర అంశాలపై ఈ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. అధినేత పవన్ కళ్యాణ్ దిశానిర్దేశంలో కమిటీ సభ్యులందరూ పూర్తి సమన్వయంతో పనిచేయాలని పార్టీ సూచించింది.



**హర్షం వ్యక్తం చేసిన పార్టీ శ్రేణులు:** కారుమూరి ఆంజినేష్‌కు ఎన్నికల నిర్వహణ కమిటీలో సభ్యత్వం లభించడం పట్ల బాపట్ల జిల్లా జనసేన నాయకులు, వీరమహిళలు, జనసైనికులు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ఆయన నియామకంతో స్థానికంగా పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయనను నేరుగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. రాబోయే ఎన్నికల్లో బాపట్లతో పాటు జిల్లా వ్యాప్తంగా జనసేన జెండా ఎగురవేసేందుకు కష్టపడి పనిచేస్తామని ఈ సందర్భంగా ఆంజినేష్ పేర్కొన్నారు.

# పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన మునిసిపల్ కమీషనర్

**తెనాలి మున్సిపాలిటీ సెప్టెంబర్5(ప్రభాతవార్త):** మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు శనివారం, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్టిలో ఉంచుకొని పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాల ప్రాంతాలను డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి వివిధ అంశాలపై చర్చించారు. ఆయా వార్డులలో అనుకూలమైన ప్రాంతాలను పరిశీలించి అంతకు తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ ఆంజనేయరాజు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



# అసమానతలు లేని సమాజంకోసం బైరాగి రచనలు దోహదం


**తెనాలి సెప్టెంబర్5(ప్రభాతవార్త):** ప్రముఖ తెలుగు ఆధునిక కవి ఆలూరి బైరాగి సాహితీ సాంస్కృతి అభిమాన హృదయాలలో చిరస్మరణీయులని వక్తలు నివాళులర్పించారు. తెనాలి పట్టణం ఐతానగర్ లింగారావు సెంటర్లో



నెలకొని ఉన్న ఆయన విగ్రహం వద్ద బైరాగి 101 వ జయంతి వేడుకలు శనివారం జరిగాయి. ఈ కార్యక్రమానికి బైరాగి స్మారక కమిటీ అధ్యక్షులు ఈదర వెంకట పూర్ణచంద్ ప్రధాన కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు నిర్వహణలో జయంతి కార్యక్రమాలు జరిగాయి. ఈదర వెంకట పూర్ణచంద్ మాట్లాడుతూ, బైరాగి కవి స్వతంత్ర భావాలు గల వ్యక్తి అని అందరూ రచయితలు బైరాగి అభిమానించే వారని, ఐతానగర్ లో పుట్టి తెనాలికే గర్వకారణంగా నిలిచారన్నారు. ఆయన స్ఫూర్తితో నేటి యువత రచయితలు ముందుకు సాగాలన్నారు. అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కనపర్తి బెన్ హర్ మాట్లాడుతూ, బైరాగి కవిత్వం ద్వారా సమాజంలో అసమానతలు తొలగిపోయేందుకు కృషి చేశారన్నారు. అయినంపూడి కిరణ్, అరసం జిల్లా అధ్యక్షులు చెరుకుపల్లి సింగారావు మాట్లాడుతూ, ఆయన రచనలు ఎంతో సులభతరంగా ఉండి అందరికీ అర్థమయ్యే అని అన్నారు. ఆలూరు బైరాగి 101వ జయంతి సందర్భంగా ప్రముఖ జర్నలిస్టు బిఎల్. నారాయణ సంపాదకత్వంలో ముద్రించిన ఆలూరి బైరాగి శతజయంతి స్మారక సంచికను ఈదర వెంకట పూర్ణచంద్, సింగారావు, బొల్లిముంత కృష్ణ, అయినంపూడి కిరణ్, గుమ్మడి సాంబశివరావు చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ తెనాలి నియోజకవర్గ సహాయ కార్యదర్శి తుంగ బాలస్వామి, తాడిబోయిన బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు. సభా ప్రారంభంలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు.

# పొదుపుతోనే డ్వాక్రా గ్రూపుల ప్రగతి : ఏపిఎం రమాదేవి

**కొల్లిపర, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** సక్రమంగా పొదుపు పాటించడం ద్వారానే డ్వాక్రా సంఘాల ప్రగతి సాధ్యపడుతుందని డిఆర్‌డిఏ ఏపిఎం రమాదేవి చెప్పారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో డ్వాక్రా మహిళలకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన బాధ్యత డ్వాక్రా మహిళలపై ఉందని తెలిపారు. ఆదాయవనరుల కల్పనకు, అభివృద్ధి కార్యక్రమాలకు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. బ్యాంకుల నుండి పొందిన రుణాలను సకాలంలో తిరిగి చెల్లిసు ్తండాలని చెప్పారు. ప్రతి నెలా స్వయం సహాయక సంఘ సభ్యులు సమావేశాన్ని నిర్వహించుకోవడం వలన సంఘాలు ఆర్థిక పురోగతి సాధించేందుకు సమగ్రమైన నిర్ణయం తీసుకునేందుకు ఆస్కారమేర్పడుతుందని ఆమె వివరించారు. ఈ సమావేశంలో సిసిలు మధు, విజయకుమార్, ప్రమీలాదే వి, బుజ్జిబాబు, ఎంఎస్ఏ సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## రోటరీక్లబ్ ఆధ్వర్యంలో గురుపూజామహోత్సవం

**తెనాలి సెప్టెంబర్5(ప్రభాతవార్త):** రోటరీక్లబ్ ఆఫ్ ఆంధ్రపారిస్ తెనాలి వారి ఆధ్వర్యంలో గురుపూజ మహోత్సవం ఈ కన్వెన్షన్ లో జరిగింది. రోటరీ క్లబ్ ఆఫ్ ఆంధ్ర పారిస్ తెనాలి అధ్యక్షులు కనగాల మధుసూధన ప్రసాద్ గారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రముఖ రచయిత నామిని సుబ్రహ్మణ్య నాయుడు, చిలువూరు కాలేజీ కరెస్పాండెంట్ కొలసాని తులసి విష్ణు ప్రసాద్, అసిస్టెంట్ గవర్నర్ జంగాల వెంకటేష్, పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయులు కామినేని శ్రీనివాస రావు, గుది బండి రజనీకాంత్ రెడ్డి, జె. వాసుదేవ రావు, శ్రీమతి వెలగ పద్మ, శ్రీమతి డి. ఉమాదేవి ,ఎన్. మధు బాబు, శ్రీమతి చందు పుణ్యవతి, అచ్యుత వెంకట సాంబశివ రావు, నేషన్ బిల్డర్ అవార్డ్స్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఎలెక్ట్ గాజుల విజయసారధి, కార్యదర్శి యరుగుంట్ల మహేష్, జిఎస్ఆర్ ఈదర వెంకట పూర్ణ చంద్, మైనేని రత్న ప్రసాద్, జాస్తి వినోద్ లక్ష్మి, నన్నపనేని సునీల్, నల్లూరి వెంకటేశ్వరరావు, క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయ ఉపాధ్యాయులు పాల్గొన్నారు, వ్యాఖ్యాతగా బత్తుల వెంకటేశ్వరరావు వ్యవహరించారు.




## ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా మోపర్తి ప్రసాద్

**పొన్నూరు, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:** పట్టణంలోని నేతాజీనగర్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న మోపర్తి ప్రసాద్ జిల్లా ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గుంటూరులో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం బాషా చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఉత్తమ అవార్డు అందుకున్న మోపర్తి ప్రసాద్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాకుమాను లాజర్‌బాబు, సీనియర్ ఉపాధ్యాయులు జియావుల్ హక్, సిహెచ్ నాగశ్రీనివాసరావు, డాక్టర్ అడే బుజ్జి, కె. కుసుమకుమారి తదితరులు అభినందించారు.



### ప్రపంచంలోని స్ఫూర్తిదాయక నేతల్లో

# ప్రధాని మోడీయే టాప్

## బెల్జియం ప్రధాని ప్రశంసలు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 5:** ప్రపంచ రాజకీయాల్లో తీవ్ర అస్థిరత, భౌగోళిక ఉద్రిక్తతలు నెలకొన్న ప్రస్తుత తరుణంలో భారత ప్రధాని మోడీ అనుసరిస్తున్న దౌత్య విధానాలు, నాయకత్వ పటిమపై బెల్జియం ప్రధాని బార్ట్ డె వెవర్ ప్రశంసలు కురిపించారు. ప్రపంచంలోని అత్యంత స్ఫూర్తిదాయకమైన, తెలివైన నేతల్లో మోడీ అగ్రగామి అని అభివర్ణించిన ఆయన మోడీతో భేటీ కావడం తనకు లభించిన గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచంలోని పలువురు అగ్రనేతల ప్రసంగాలు విన్నప్పుడు ఆందోళన, అభద్రతా భావం కలుగుతాయని కానీ ప్రధాని మోడీమాట్లాడితే ఆయన చెప్పిన దార్శనికతను అనుసరించాలనే నమ్మకం, స్ఫూర్తి కలుగుతాయని వ్యాఖ్యానించారు. విశ్వవేదికపై భారత్ పాత్ర అత్యంత కీలకంగా మారిందని కొనియాడిన బెల్జియం ప్రధాని ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను బెల్జియం ఒక విశ్వసనీయ భాగస్వామిగా చూస్తోందని పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య దౌత్య, ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఇదే సమయంలో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలు, టారిఫ్‌లపై ఆయన పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఏ క్షణాన ఏ నిర్ణయం తీసుకుంటారో తెలియని అస్థిరత వల్ల ప్రపంచ వాణిజ్యమే ప్రమాదంలో పడుతుందని స్వేచ్ఛా వాణిజ్యం, బలమైన ద్వైపాక్షిక భాగస్వామ్యాల ద్వారానే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

## గూఢచర్యం కేసులో 15మందిపై ఎన్ఐఏ ఛార్జిషీట్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 5:** పాకిస్తాన్‌కు గూఢచర్యం చేసిన కేసులో 15 మంది నిందితులపై ఎన్ఐఏ (నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ) శనివారం చార్జిషీటు దాఖలు చేసింది. ఈ కేసులో ప్రవీణ్, రాజ్ వాల్మీకి, శివ వాల్మీకి, రితికా గ్యాంగ్‌వార్, సమీర్ షూటర్, దుర్గేష్ నిషాద్, నౌషద్, గగన్ కుమార్, వివేక్, శివరాజ్, మీరా లాకూర్, షేన్ ఇరామ్ మహాక్ అనే 15 మంది నిందితులుగా పేర్కొంది. వీరిపై ఉత్తర ప్రదేశ్, లక్నోలోని స్పెషల్ కోర్టులో నేడు చార్జిషీటు సమర్పించింది. ఐదుగురు జువైనల్ నిందితులకు సంబంధించిన నివేదికను గత మే 18న, జువైనల్ జస్టిస్ బోర్డుకు సమర్పించారు. ఈ ఐదుగురు మైనర్స్ కావడం వల్ల వీరికి విధించే శిక్షలు వంటి అంశాల్లో ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఘజియాబాద్ కమిషనరేట్ పరిధిలోని, కౌశంభి పోలీస్ స్టేషన్‌లో నిందితులపై గత మార్చి 14న ఎఫ్ఐఆర్ నమోదైంది. దీనిలో భాగంగా 21 మందిని అరెస్టు చేశారు. భారత దేశ సమగ్రతకు, సార్వభౌమాధికారానికి భంగం కలిగించేలా నిందితులు కుట్ర చేశారని ఎన్ఐఏ ఆరోపించింది. పాకిస్తాన్ కోసం గూఢచర్యం చేస్తూ నిందితులు దేశానికి చెందిన కీలక, సున్నితమైన సమాచారాన్ని చేరవేశారని ఆరోపించింది. నిషేధిత ప్రదేశాలకు చెందిన జీపీఎస్ లోకేషన్లను కూడా వీరు శత్రువులకు అందించారు. ఇలాంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు భారతీయ సిమ్ కార్డులను వినియోగించారు. దేశ ఐక్యత, సమగ్రత, భద్రతకు భంగం కలిగించే పని చేశారు. మిగతా నిందితులపై కూడా విచారణ కొనసాగుతోంది. వారిపై నిపుణుల అభిప్రాయలు తీసుకున్న అనంతరం తదుపరి విచారణ జరిపి, పూర్తిస్థాయి చార్జిషీటు దాఖలు చేస్తారు. మరో ఘటనలో పాకిస్తాన్‌కు గూఢచర్యం చేస్తున్న ఏడుగురిని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు.

# ఆఫ్రికా పెద్దది.. గ్రీన్‌లాండ్ చిన్నది!

## త్వరలో కొత్త ప్రపంచ పటం విడుదల



**న్యూయార్క్, సెప్టెంబరు 5:** కొత్త ప్రపంచ పటం కోసం యుఎన్ అసెంబ్లీలో తీర్మానం చేశారు. అయితే ఆ కొత్త మ్యాప్‌లో ఆఫ్రికా ఖండం సైజు పెరగనుంది. మెర్కేటర్ మ్యాప్‌లో వాస్తవానికన్నా ఎక్కువ సైజులో కొన్ని ఖండాలు, దేశాలు ఉన్నాయి. ఈక్వేటార్‌కు దూరంగా ఉన్న గ్రీన్‌ల్యాండ్.. మెర్కేటర్ మ్యాప్‌లో ఆఫ్రికా కన్నా పెద్దగా ఉన్నట్లు కనిపిస్తుంది. కానీ నిజానికి గ్రీన్‌ల్యాండ్ కన్నా ఆఫ్రికా 14 రెట్లు పెద్దది. ఇక కొత్త వరల్డ్ మ్యాప్‌తో ఆ సైజులో స్పష్టత రానుంది. ఉత్తర యూరోప్, ఉత్తర అమెరికాను కూడా పాత మ్యాప్‌లో ఈక్వేటర్ దగ్గర ఉన్న దేశాల కన్నా ఎక్కువ పెద్ద సైజులో చూపించారు. అయితే కొత్త మ్యాప్‌తో ఆ సైజుల్లో మార్పులు జరగనున్నాయి. మ్యాప్ తమకు సమస్య కాదు అని, కానీ ప్రపంచం మమ్మల్ని మ్యాప్‌ల ఆధారంగా అర్థం చేసుకుంటుందని టోగో విదేశాంగ మంత్రి రాబర్ట్ దుస్సే తెలిపారు. మ్యాప్‌ల ద్వారా ఆఫ్రికా సైజు మారదు అని, కానీ ఆఫ్రికా ఖండం గురించి ప్రజల ఆలోచన మారుతుందని కొందరంటున్నారు. మ్యాప్ మార్పు తీర్మానాన్ని ఆఫ్రికా యూనియన్ స్వాగతించింది.

2018లో ఈక్వల్ ఎర్త్ ప్రొజెక్షన్ చేశారు. మెర్కేటర్ మ్యాప్‌లా కాకుండా.. వాస్తవ సైజుకు దగ్గరగా ఖండాల భూభాగాన్ని ఆ మ్యాప్‌లో చూపించాలనుకున్నారు. ఇక ఆఫ్రికా ఎంత పెద్ద సైజులో ఉందో.. ఈక్వల్ ఎర్త్ ప్రొజెక్షన్ ప్రకారం అంతే సైజులో కనిపించనున్నది. మెర్కేటర్ మ్యాప్‌లో పెద్దగా ఉన్న గ్రీన్‌ల్యాండ్ ఇప్పుడు కొత్త మ్యాప్‌తో తన సైజును కోల్పోనుంది. అయితే ఈ అంశాన్ని అమెరికా వివాదంగా మార్చింది. తీర్మానానికి వ్యతిరేకంగా ఓటేసిన.. ఇది సైద్ధాంతిక చర్య అని విమర్శలు చేసింది. మెర్కేటర్ మ్యాప్ బదులుగా కొత్త మ్యాప్‌లను ప్రోత్సహించనున్నట్లు ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి జీన్ నోయల్ బారట్ తెలిపారు. ఇక వివాదాస్పద భూభాగాల అంశంలో మరో ఆందోళన మొదలైంది. ఈక్వెల్ ఎర్త్ మ్యాప్ ప్రకారం ఉక్రెయిన్‌లోని భూభాగాన్ని రష్యా ఆక్రమించినట్లుగా ఉంది. దీంతో ఆ మ్యాప్ విధానాన్ని ఉక్రెయిన్ వ్యతిరేకించింది. ఓటింగ్‌లో ఉక్రెయిన్ పాల్గొనలేదు. తీర్మానానికి యురోపియన్ యూనియన్ మద్దతు ఇచ్చింది. మ్యాప్‌లు మారినా బోర్డర్‌లు మారవని ఇయు పేర్కొన్నది. పర్ఫెక్ట్ మ్యాప్ ఏదీ లేదన్న అభిప్రాయం కూడా వెల్లడైంది. భూమి గుండ్రంగా ఉన్నా.. మ్యాప్‌లు మాత్రం ఫ్లాట్‌గా ఉన్నాయన్నారు. విస్తీర్ణం, ఆకారం, దూరం, డైరెక్షన్ అంశంలో మ్యాప్‌లో మార్పులు ఉండనున్నాయి. కేవలం భూమి సైజుతో పోలుస్తూ.. ఈక్వెల్ ఏరియా మ్యాప్‌లను ప్రోత్సహించాలని యుఎన్ భావిస్తున్నది. ఈ ప్రతిపాదనకు భారత్ కూడా మద్దతు తెలిపింది.

## లోన్‌రికవరీ కోసం మహిళ దుస్తులు విప్పించి విడియో చిత్రీకరణ

### పోలీసులు రంగ ప్రవేశంచేసి నలుగురి అరెస్టు

**బెంగళూరు, సెప్టెంబరు 5:** బెంగళూరులో అత్యంత దారుణమైన ఘటన వెలుగులోకి వచ్చింది. తీసుకున్న అప్పు తిరిగి చెల్లించలేదన్న కారణంతో ఓ మహిళను కొందరు కిడ్నాప్ చేసి, రోజుల తరబడి నిర్బంధించి చిత్రహింసలకు గురిచేశారు. బలవంతంగా ఆమె దుస్తులు విప్పించి వీడియో తీసి, డబ్బు ఇవ్వకపోతే దాన్ని వైరల్ చేస్తామని బెదిరించారు. ఈ అమానుష ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. బెంగళూరు సుంకడకట్టే ప్రాంతానికి చెందిన 30 ఏళ్ల మహిళ రెండేళ్ల క్రితం రేష్మా బాను వద్ద రూ. లక్ష, నజ్రత్ బేగం వద్ద రూ.50 వేలు వడ్డీకి అప్పుగా తీసుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల కొన్ని నెలలుగా వాయిదాలు చెల్లించలేకపోయారు. దీంతో ఆగస్టు 27న పని ఇప్పిస్తానని చెప్పి నజ్రత్ ఆమెను తన ఇంటికి పిలిచింది. అక్కడికి వెళ్లగానే, రేష్మా, ఆమె భర్త సుహైల్, సైఫ్‌లు ఆమెపై దాడి చేసి, కత్తితో బెదిరించి కుంబల్‌గోడులోని రేష్మా ఇంటికి తీసుకెళ్లి కిడ్నాప్ చేశారు. అక్కడ ఆమెను నాలుగు రోజుల పాటు బంధించి, కర్రలతో కొట్టారు. అసలు, వడ్డీ కలిపి రూ.11 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గతనెల ఆమెను బలవంతంగా అర్ధనగ్నంగా మార్చి వీడియో తీశారు. డబ్బు చెల్లించకపోతే వీడియోను సోషల్ మీడియాలో పెడతామని, వేశ్యా వృత్తిలోకి దించుతామని బెదిరించారన్నారు.





# అమెరికా ఉద్యోగం ఆశలు ఆవిరి!

## హెచ్1బి వీసా ఫీజులు ఇక రెండులక్షల డాలర్లు పైనే!

**వాషింగ్టన్,సెప్టెంబరు 5:** అమెరికాలో ఉద్యోగం చేయాలనుకునే వారు ఇక ఆశలు వదిలేసుకోవాల్సిందే. విదేశీయులు ఉద్యోగం పేరుతో అమెరికాలో అడుగుపెట్టే ధైర్యం చేయకుండా డొనాల్డ్ ట్రంప్ కఠిన నియమాలు తీసుకువస్తున్నారు. ఇప్పటిదాకా లక్ష డాలర్ల ఫీజుతో బెంబేలెత్తించిన ట్రంప్ దాన్ని ఏకంగా రెండు లక్షల డాలర్లకు పెంచే ప్రయత్నం చేస్తున్నాడు.

దీంతో అమెరికాలో ఉద్యోగం చేయాలనుకునే వారికి బిగ్ షాక్ తగలబోతోంది. విదేశాల నుండి కొత్తగా హెచ్1బి ఉద్యోగులను దేశంలోకి తీసుకురావడానికి అయ్యే ఖర్చును ఊహించని రీతిలో పెంచేందుకు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం కఠిన చర్యలకు శ్రీకారం చుట్టింది. హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ప్రచురించిన ఫెడరల్ రిజిస్టర్ ప్రకటన ప్రకారం అమెరికా వెలుపల నుండి వచ్చే ప్రతీ కొత్త హెచ్1బి దరఖాస్తుదారుపై అదనంగా 103,265 డాలర్లు అంటే సుమారు రూ. 86 లక్షలు రుసుమును విధిస్తూ ప్రతిపాదనలు చేసింది. గతంలో ప్రభుత్వం సవాలు చేసిన 100,000 డాలర్ల రుసుము గనక న్యాయస్థానంలో నిలబడితే విదేశాల నుండి ఒక కొత్త హెచ్1బి ఉద్యోగిని స్పాన్సర్ చేయడానికి అమెరికన్ కంపెనీలు చెల్లించాల్సిన మొత్తం రుసుము 203,265 డాలర్లు అంటే రూ. 1.70 కోట్లు దాటే అవకాశం ఉందని యూఎస్ఏ టుడే నివేదిక స్పష్టం చేసింది. హెచ్1బి ప్రోగ్రామ్‌ను మరింత ఖరీదైనదిగా, పరిమితులతో కూడినదిగా మార్చేందుకు అమెరికా ప్రభుత్వం చేపడుతున్న విస్తృత వ్యూహంలో భాగంగా ఈ నిర్ణయం వెలువడింది.

ఈ భారం కేవలం సాంకేతిక దిగ్గజాలపైనే కాకుండా విదేశీ నిపుణులపై ఆధారపడే విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, ఆరోగ్య సంరక్షణ రంగాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. గతంలో విధించిన 100,000 డాలర్ల రుసుమును మసాచుసెట్స్ ఫెడరల్ కోర్టు కొట్టివేయగా దానిపై ప్రభుత్వం అప్పీల్ చేసింది. ప్రస్తుతం ఆ విచారణ కొనసాగుతుండగానే, అమెరికా వలస వ్యవస్థ నిర్వహణకు అవసరమైన నిధులను సమకూర్చుకోవడానికి ఈ కొత్త 103,265 డాలర్ల ఛార్జీని తెరపైకి తెచ్చినట్లు డిహెచ్ఎస్ పేర్కొంది. రాబోయే దశాబ్ద కాలంలో ఈ రుసుముల ద్వారా సుమారు 8.8 బిలియన్ డాలర్ల రాబడి వస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ప్రతి ఏటా కేటాయించే 85,000 వీసాల కోసం తీవ్రమైన పోటీ నెలకొంటున్న తరుణంలో, అమెజాన్, యాపిల్, గూగుల్, మెటా వంటి బహుళజాతి సంస్థలు మరియు గ్రామీణ ప్రాంతాల్లో సేవలందించే ఆసుపత్రులు ఈ ప్రతిపాదనల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ కఠిన ప్రతిపాదనల వల్ల భారతీయ ఐటీ నిపుణులకు భారీగా ప్రతికూల పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉంది. ప్రతి సంవత్సరం ఆమోదం పొందుతున్న మొత్తం హెచ్1బి వీసాలలో 70 శాతానికి పైగా భారతీయ పౌరులకే లభిస్తున్నాయి. విదేశాల నుండి నేరుగా అమెరికా వెళ్లి పనిచేయాలనుకునే భారతీయ టెక్ ఉద్యోగులకు 200,000 డాలర్లకు పైగా ఫీజు కావడం వల్ల అనేక కంపెనీలు స్పాన్సర్‌షిప్‌లను తగ్గించుకునే ప్రమాదం ఉంది.

ఈ కొత్త రుసుము కేవలం దేశం వెలుపల నుండి వచ్చే కొత్త దరఖాస్తుదారులకే వర్తిస్తుందని, ఇప్పటికే అమెరికా విశ్వవిద్యాలయాల్లో చదివి ఉద్యోగాల్లో చేరే విద్యార్థులకు, అలాగే దేశంలోనే ఉన్న వీసాదారులకు వేర్వేరు నిబంధనలు ఉంటాయని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదనపై సెప్టెంబర్ 24 వరకు ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియ కొనసాగుతుండగా, తుది నిర్ణయం వెలువడితే అమెరికా వలస విధానంలో ఇది ఒక చారిత్రాత్మక మార్పుగా నిలవనుంది.



## నేపాల్ సొరంగంలో సజీవంగా చైనీస్ దేశస్థుడు

### శిథిలాల కింద ప్రాణాలతో మహిళ

**ఖాట్మండ్, సెప్టెంబరు 5:** నేపాల్‌లో వరదల్లో చిక్కుకున్న మరో ఇద్దరిని శనివారం రక్షించారు. త్రిశూలీ సొరంగం నుంచి ఓ చైనీస్ దేశస్థుడిని కాపాడారు. వరదలు సంభవించిన పది రోజుల తర్వా ఆ చైనా దేశస్థుడు టన్నెల్‌లో సజీవంగా ఉన్నాడు. చికిత్స కోసం అతడిని కాట్మాండుకు తరలించినట్లు నేపాలీ ఆర్మీ ప్రకటించింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న జల విద్యుత్ టెన్నెల్‌లో చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు భారీ ఆపరేషన్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. సుమారు 900 మంది కార్మికులు వివిధ టన్నెళ్లలో ఉంటారని భావిస్తున్నారు. ఆగస్టు 26న సంభవించిన నేపాల్ జల విలయంలో సుమారు 1300 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 5 వేల మంది మిస్సింగ్ అయ్యారు. భారత, నేపాలీ బృందాలు రెస్క్యూ ఆపరేషన్ చేపడుతున్నాయి. శుక్రవారం 9వ రోజు ఇద్దరు నేపాలీ దేశస్థులను త్రిశూలీ టన్నెల్ నుంచి సజీవంగా రక్షించిన విషయం తెలిసిందే. సువాకోట్ పట్టణంలో పూర్తిగా దెబ్బతిన్న ఓ ఇంటి నుంచి ఓ మహిళను కూడా నేపాల్ ఆర్మీ రక్షించింది. 64 యేళ్ల చండికా శ్రేష్ఠ అనే మహిళ ఆ ఇంట్లో ఉన్నట్లు గుర్తించారు. బేత్రావతిలో ఇంటి శిథిలాల కింద నుంచి ఆమెను సురక్షితంగా బయటకు తీశారు.

# ఖర్గ్ ఐలాండ్ సమీపంలో ఇరాన్ ట్యాంకర్‌పై దాడి

**టెహ్రాన్, సెప్టెంబరు 5:** ఖర్గ్ ఐలాండ్ సమీపంలో అమెరికా దళాలు ఇరాన్‌కు చెందిన ఒక ఆయిల్ ట్యాంకర్‌ను లక్ష్యంగా చేసుకుని దాడి చేసినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. స్థానికంగా పలు పేలుళ్ల శబ్దాలు వినిపించినట్లు స్థానిక ఫార్స్ న్యూస్ ఏజెన్సీ తెలిపినప్పటికీ, పేలుళ్లకు గల స్పష్టమైన కారణాలను వెల్లడించలేదు. అటు, ఈ దాడులను ఇరాన్ అధికార వర్గాలు ఇంకా అధికారికంగా ధ్రువీకరించలేదు. మూడోసారి లక్ష్యంగా ఖర్గ్ ఐలాండ్‌పై దాడిజరిగింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో అమెరికాఇరాన్ మధ్య యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఖర్గ్ ఐలాండ్‌పై దాడి జరగడం ఇది మూడోసారి. మొదటి దాడి మార్చిలో ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూసివేసి గ్లోబల్ ఆయిల్ సరఫరాకు ఆటంకం కలిగించడంతో, అమెరికా ఖర్గ్ ఐలాండ్‌లోని మిలిటరీ స్థావరాలను ధ్వంసం చేసింది. అయితే అప్పట్లో ఆయిల్ మౌలిక సదుపాయాలపై దాడి చేయలేదు. రెండో దాడి ఏప్రిల్ 7న జరిగింది. ఇరాన్ వైఖరి మారకపోవడంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికల అనంతరం మరోసారి ఇరాన్ సైనిక స్థావరాలపై వైమానిక దాడులు జరిగాయి. ఇప్పుడు తాజాగా ఖర్గ్ ద్వీపం సమీపంలోని ఆయిల్ ట్యాంకర్‌ను లక్ష్యంగా చేసుకుని దాడులు జరగడం వల్ల ఈ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇరాన్ తీరానికి దాదాపు 33 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖర్గ్ ఐలాండ్, ఆ దేశానికి అతిపెద్ద చమురు ఎగుమతి కేంద్రం. ఇరాన్ ఎగుమతి చేసే క్రూడ్ ఆయిల్‌లో అత్యధిక శాతం ఈ ద్వీపం ద్వారానే సరఫరా అవుతుంది. చైనా వంటి దేశాలకు ఇక్కడి నుండే ప్రధానంగా ఆయిల్ రవాణా జరుగుతుంది. ఇరాన్ ఆర్థిక వ్యవస్థకు, ప్రభుత్వ ఆదాయానికి ఈ ఐలాండ్ వెన్నెముక లాంటిది. చమురు నిల్వ కేంద్రాలు, రిఫైనరీలు మాత్రమే కాకుండా, ఈ ద్వీపంలో వేలాది మంది కార్మికుల నివాసాలు, చారిత్రక పోర్చుగీస్ కోట, పురాతన క్రైస్తవ మఠం వంటి చారిత్రక ప్రాధాన్యం ఉన్న ప్రదేశాలు కూడా ఉన్నాయి.

# బస్తర్ మావోయిస్టు దాడిలో ఎన్ఐఏ కోర్టు తీర్పు

## పది మంది దోషులుగా నిర్ధారణ, 16న శిక్షలు ఖరారు

**జగ్‌దల్‌పూర్, సెప్టెంబరు 5:** ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో 2013లో కాంగ్రెస్ నాయకుల కాన్వాయ్‌పై జరిగిన ఘోర మావోయిస్టు దాడి కేసులో జగదల్‌పూర్ ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ దాడిలో ముగ్గురు మహిళలతో సహా మొత్తం 10 మందిని దోషులుగా కోర్టు నిర్ధారించింది. ప్రత్యేక న్యాయమూర్తి అభయ్ సింగ్ రాజ్‌పుత్ ఈ తీర్పును వెల్లడించగా, దోషులకు విధించే శిక్షల వివరాలను ఈనెల 16న ప్రకటించనున్నారు. ఛత్తీస్‌గఢ్ చరిత్రలోనే దారుణమైన దాడిగా ప్రాసిక్యూషన్ వర్ణించింది. 2013లో మే 25న బస్తర్ జిల్లా దర్భా పోలీస్ స్టేషన్ పరిధిలోని జీరమ్ లోయ వద్ద జాతీయ రహదారిపై ఈ ఘాతుకం జరిగింది. కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన పరివర్తన్ ర్యాలీముగించుకుని తిరిగి వస్తుండగా మావోయిస్టులు కాన్వాయ్‌పై దాడి చేశారు. ఈ ఘటనలో మొత్తం 29 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడిలో నాటి ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు నంద్ కుమార్ పటేల్, ఆయన కుమారుడు దినేష్, అసెంబ్లీ మాజీ ప్రతిపక్ష నేత మహేంద్రకర్మ, మాజీ కేంద్ర మంత్రి విద్యాచరణ్ శుక్లా, మాజీ ఎమ్మెల్యే ఉదయ్ ముద్లియార్ వంటి అగ్రనేతలతో పాటు పలువురు భద్రతా సిబ్బంది, పౌరులు అమరులయ్యారు. ఈ ఘటనతో అప్పట్లో కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం తీవ్రంగా దెబ్బతింది. ప్రారంభంలో బస్తర్ పోలీసులు ఈ కేసును నమోదు చేసినప్పటికీ, ఘటన తీవ్రత దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం విచారణను జాతీయ దర్యాప్తు సంస్థకి అప్పగించింది. ఎన్ఐఏ 2014 సెప్టెంబర్‌లో జగదల్‌పూర్ ప్రత్యేక కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసి, ఈ కేసులో 101 మంది సాక్షులను విచారించింది. కేసు సమగ్ర విచారణకు రెండు జుడీషియల్ కమిషన్లు కూడా ఏర్పాటయ్యాయి. ఈ తీర్పుపై రాష్ట్రంలో రాజకీయ వేడి రాజుకుంది. ఎన్ఐఏ అనేక వాస్తవాలను తప్పుదోవ పట్టించిందని, రాష్ట్ర ప్రభుత్వం స్వతంత్రంగా విచారణ జరపకుండా అడ్డుకుందని మాజీ ముఖ్యమంత్రి భూపేష్ బాఘేల్ ఆరోపించారు. నాటి బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ నాయకులకు సరైన భద్రత కల్పించడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. ఈ ఆరోపణలను మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నేత రమణ్ సింగ్ ఖండించారు. కాంగ్రెస్ నాయకులు ఈ సున్నితమైన అంశంపై కేవలం రాజకీయం చేయడానికే ప్రాధాన్యం ఇచ్చారని ఆయన తిప్పికొట్టారు.

# ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు: 8 మంది యువకులు మృతి



**తిరువనంతపురం, సెప్టెంబరు 5:** కేరళలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. త్రిస్సూర్ జిల్లాలో ఆగి ఉన్న లారీని ఓ కారు వేగంగా ఢీకొట్టిన ఘటనలో 8 మంది యువకులు దుర్మరణం పాలయ్యారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. మృతులను తమిళనాడుకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులుగా అనుమానిస్తున్నారు. శుక్రవారం రాత్రి 11:40 గంటల సమయంలో త్రిస్సూర్ జిల్లాలోని కైపమంగలం సమీపంలోని పనంబిక్కున్ను వద్ద జాతీయ రహదారి 66పై ఈ ప్రమాదం జరిగింది. తమిళనాడు రిజిస్ట్రేషన్ టిఎన్ 59 డిడబ్ల్యు 8299 ఉన్న కారులో 8 మంది యువకులు గురువాయూర్ నుంచి కొడుంగల్లూర్ వైపు ప్రయాణిస్తున్నారు. అదే సమయంలో, నిర్మాణ పనులు జరుగుతున్న హైవేపై రోడ్డు పక్కన ఆగి ఉన్న గూడ్స్ లారీని వెనుక నుంచి కారు బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయి లారీ కిందకు చొచ్చుకుపోయింది. దీంతో కారులోని వారంతా అందులోనే చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

# బ్రిటన్‌లో చదివే విదేశీ విద్యార్థులకు ఫండ్ పరిమితి పెంపు

## కఠిన నిబంధనలు అమలుచేస్తున్న బ్రిటన్ సర్కార్

**లండన్, సెప్టెంబరు 5:** ఉన్నత చదువులు చదవాలని ఆశిస్తున్న భారతీయ విద్యార్థులకు బ్రిటన్ ప్రభుత్వం షాక్ ఇచ్చింది. యూకే వీసా నిబంధనలను మరింత కఠినతరం చేసింది. అక్కడ చదువుకునేందుకు వెళ్లే అంతర్జాతీయ విద్యార్థులు ఇకపై తమ నివాస ఖర్చుల కోసం చూపించాల్సిన కనీస మెయింటెనెన్స్ ఫండ్ పరిమితిని భారీగా పెంచింది. ఈ ఏడాది నవంబర్ 30 నుంచి దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు ఈ నూతన నిబంధనలు వర్తిస్తాయి. యూకే హోమ్ శాఖ విడుదల చేసిన తాజా మార్గదర్శకాల ప్రకారం విద్యార్థులు చదువుకునే ప్రాంతాన్ని బట్టి వారు చూపించాల్సిన ఫండ్ పరిమితి మారుతుంటుంది. లండన్‌లో నివసిస్తూ చదువుకునే విద్యార్థులు ప్రతి నెలా చూపించాల్సిన ఫండ్ మొత్తం 1,529 అంటే.. సుమారు రూ. 1.95 లక్షల నుంచి 1,570 పౌండ్ లకుఅంటే సుమారు రూ. 2.01 లక్షలకు పెంచారు. ఈ తాజా పెంపు వల్ల విద్యార్థులు తమ నిధులను ముందుగానే సమకూర్చుకోవాల్సి ఉంటుంది. లండన్ వెలుపల గల యూనివర్శిటీల్లో ప్రవేశాలు పొందే విద్యార్థుల జీవన వసతి ఖర్చుల నిబంధన కూడా పెరిగింది. ప్రస్తుతం ఉన్న నెలవారీ పరిమితి 1,171 నుంచి 1,203 యూరోలకు పెరిగింది. భారతీయ కరెన్సీలో ఈ మొత్తం రూ. 1.54 లక్షలు అవుతుంది. విద్యార్థులు గరిష్టంగా తొమ్మిది నెలల కాలానికి సరిపడా మెయింటెనెన్స్ ఫండ్స్ నిల్వలను దరఖాస్తు సమయంలో పొందుపర్చాల్సి ఉంటుంది. దీని ప్రకారం లండన్ పరిధిలో చదువుకునే వారు గరిష్టంగా రూ. 18.06 లక్షలు అంటే 14,130 పౌండ్లు, ఇతర ప్రాంతాలలో విద్యనభ్యసించే వారు దాదాపు రూ. 13.84 లక్షలు 10,827 పౌండ్లను మెయింటెనెన్స్ ఫండ్స్ చూపించాలి. ఈ మొత్తం మెయింటెన్స్ ఫండ్స్ కోసం మాత్రమే. కాలేజీ ట్యూషన్ ఫీజు దీనికి అదనం. బ్రిటన్ ప్రభుత్వం స్థానిక విద్యార్థులకు అందించే వార్షిక మెయింటెన్స్ లోన్లకు అనుగుణంగానే అంతర్జాతీయ విద్యార్థుల ఆర్థిక పరిమితులను కూడా సమం చేయాలని నిర్ణయించడమే దీనికి ప్రధాన కారణం. దీంతో పాటు వీసాలో జరిగే దుర్వినియోగాన్ని అరికట్టడం, అర్హత గల విద్యార్థులకు మాత్రమే వాటిని మంజూరు చేయడానికి ఈ కఠిన నిబంధనలను తీసుకువచ్చినట్లు హోమ్ ఆఫీస్ స్పష్టం చేసింది. భారతీయ విద్యార్థులు ఈ ఫండ్ మొత్తాన్ని యూకే ప్రభుత్వానికి ఎలాంటి ఫీజుల రూపంలో చెల్లించనక్కర్లేదు. వీసా ఆమోదం కోసం తమ బ్యాంక్ ఖాతాలలో ఈ నిధుల లభ్యతను చూపించితే సరిపోతుంది. ఈ ఏడాది నవంబర్ 30 తర్వాత వీసా దరఖాస్తులు సమర్పించే వారంతా పాత నియమాలను కాకుండా ఈ నూతన రేట్లను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. లేకపోతే వారి వీసా రిజెక్ట్ అవుతుందని హోమ్ శాఖ తెలిపింది. జనవరి ఇన్‌టేక్‌లో లండన్ లేదా బ్రిటన్ లోని ఇతర నగరాల్లో విద్యాభ్యాసం చేయాలనుకునే అభ్యర్థులు తప్పనిసరిగా ఈ కొత్త మార్పులను గమనించాలి. బ్రిటిష్ వీసా పొందడానికి వీసా కార్యాలయానికి సమర్పించే బ్యాంక్ ఖాతాలలో మునుపటి కంటే చాలా ఎక్కువ నిల్వ నిధులను చూపించాల్సి ఉంటుంది. విద్యార్థులు అక్కడికి వెళ్లిన తర్వాత వారి స్థానిక నివాసం, ఆహారం, ఇతర అత్యవసర ఖర్చులకు లోటు లేకుండా ఉండేందుకే ఈ మార్పులు చేసినట్లు బ్రిటన్ హోమ్ శాఖ స్పష్టం చేసింది.





# సంక్షిప్త వార్తలు

## 280 ఎన్నికల్లో పోటీచేసిన నాగర్‌మల్ బజూరియా మృతి



**పాట్నా, సెప్టెంబరు 5:** భారత ఎన్నికల చరిత్రలో తనకంటూ ఓ ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకున్న ధర్తి పకడ్ నాగర్‌మల్ బాజోరియా (96) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, పాట్నాలోని మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచారు. వందల సార్లు ఎన్నికల బరిలో నిలిచి, ఒక్కసారి కూడా గెలవకపోయినా ప్రజాస్వామ్య ప్రక్రియలో పాల్గొనడమే ముఖ్యమని చాటిచెప్పిన ఆయన మృతితో ఒక శకం ముగిసింది.

## కోర్టు ఉత్తర్వులతో సహరాన్‌పూర్ కలెక్టరేట్ మసీదు కూల్చివేత

**సహరాన్‌పూర్, సెప్టెంబరు 5:** ఉత్తర ప్రదేశ్‌లోని సహరన్‌పూర్‌లో ఒక మసీదును అధికారులు కూల్చివేశారు. భారీ భద్రత నడుమ శనివారం ఈ కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. సహరన్‌పూర్‌ని కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో ఒక మసీదు చాలా కాలంగా ఉంది. అయితే, ఆ మసీదు ఉన్న స్థలం ప్రభుత్వ భూమి. ఇక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా ఈ మసీదు కొనసాగుతోంది. దీంతో ఈ మసీదును తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## అమెరికాలో మోస్ట్ వాంటెడ్.. పంజాబ్‌లో అరెస్ట్

**అమృత్‌సర్, సెప్టెంబరు 5:** అమెరికాలో భారీ మోసానికి పాల్పడి, ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) 'మోస్ట్ వాంటెడ్' జాబితాలో ఉన్న భారత సంతతి వ్యక్తిని పంజాబ్ పోలీసులు అరెస్ట్ చేశారు. సుమారు దాదాపు రూ. 5.7 కోట్ల మోసం కేసులో నిందితుడైన మంజీత్ సింగ్ బేడీ (65)ని జలంధర్‌లో శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అమెరికా పౌరసత్వం పొందిన బేడీ, వాషింగ్టన్ రాష్ట్రంలోని టకోమాలో కిరాణా దుకాణం నడిపేవాడు. అక్కడ ప్రభుత్వం పేదలకు అందించే సప్లిమెంటల్ న్యూట్రిషన్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్ (ఎస్ఎన్ఏపీ) ప్రయోజనాలను దుర్వినియోగం చేశాడు.

## సౌదీ అరేబియాకు ఐదు బిలియన్ డాలర్ల అమెరికా ఆయుధ సామగ్రి



**దుబాయి, సెప్టెంబరు 5:** ఇరాన్‌తో ఉద్రిక్తతలు, ప్రాంతీయ పోరాటాలు పరాకాష్టకు చేరిన తరుణంలో, గల్ఫ్ మిత్రదేశమైన సౌదీ అరేబియాకు 5 బిలియన్ డాలర్ల విలువైన అత్యాధునిక బాంబులు, గైడెన్స్ కిట్లు, రక్షణ పరికరాలను విక్రయించేందుకు అమెరికా విదేశాంగ శాఖ ఆమోదం తెలిపింది. పశ్చిమాసియా ప్రాంతంలో ఇరాన్ దళాలు, యెమెన్‌లోని హూతీ రెబెల్స్ నుంచి నిరంతరం ఎదురవుతున్న క్షిపణి, డ్రోన్ దాడులను తిప్పికొట్టేలా సౌదీ అరేబియా వైమానిక రక్షణ సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వాషింగ్టన్ ప్రకటించింది.

## లడఖ్‌లో తొలిసారిగా రాక్ చెక్‌డామ్



**లేహ్, సెప్టెంబరు 5:** లడఖ్‌లో నీటి కొరతతో ఇబ్బంది పడుతున్న రైతులకు భారత్ ఊరటనిచ్చింది. సింధు నదిపై దేశంలోనే తొలి రాక్ చెక్ డ్యామ్‌ను నిర్మించింది. లేహ్‌లోని ఉప్షి వద్ద నిర్మించిన ఈ డ్యామ్ వల్ల నదిలో నీటి మట్టం దాదాపు 10 అడుగులు పెరిగింది. వసంతకాలంలో సాగుకు నీరు అందక ఇబ్బంది పడుతున్న గ్రామాల పొలాలకు నీటిని మళ్లించే అవకాశం ఏర్పడింది. ఈ డ్యామ్‌ను సిమెంట్ ఉపయోగించకుండా పూర్తిగా సహజమైన పెద్ద రాళ్లతో నిర్మించారు. ఇందులో దాదాపు 4 కోట్ల లీటర్ల నీటిని నిల్వ చేయవచ్చు. ఈ నీటిని ఇగూ ఫే సాగునీటి కాలువ ద్వారా పొలాలకు అందిస్తున్నారు.



గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు పట్టు వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

## గురువులను గౌరవించడం అదృష్టం


### ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

**కళ్యాణదుర్గం, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** గురువులను గౌరవించడం తమ తల్లి దండ్రుల నుంచే వచ్చిన సంస్కారమని, వేలాది మంది ఉపా ధ్యాయ కుటుంబాలను గౌరవించే అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం ప్రజావేదికలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 2650 మంది ఉపాధ్యాయ దంపతులకు పట్టువస్త్రాలు అందజేయగా, 20 మంది విశ్రాంత ఉపాధ్యాయులను పట్టువస్త్రాలు, శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం పట్ల ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, అక్టోబర్ 1 నుంచి రెండు డీఏలు, 12వ పీఆర్సీ ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. ప్రస్తుతం 37.31 శాతం ఉన్న డీఏ రాబోయే రెండు డీఏలతో 40.04 శాతానికి చేరుతుందని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు అండగా నిలిచేందుకు ఎస్సార్సీ ట్రస్ట్ సహకారంతో రూ.5 కోట్లతో 7300 సైకిళ్లను అందిస్తున్నామని తెలిపారు. అలాగే 1200 మంది విద్యార్థులకు ఉచిత కోచింగ్, మెటీరియల్, భోజన వసతి కల్పించినట్లు వెల్లడించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా గురు పూజోత్సవం

### పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యే లక్ష్యం: మంత్రి నారాయణ

### అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎంపి వేమిరెడ్డి



**నెల్లూరు, సెప్టెంబరు 5, ప్రభాతవార్త - ప్రైవేటం:** పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యే లక్ష్యమని మంత్రి నారాయణ పేర్కొన్నారు. శనివారం నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీఎస్ఆర్, ఆర్ఎస్ఆర్ హైస్కూల్లో జరిగిన కార్యక్రమాల్లో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను మంత్రి, ఎంపీ ఘనంగా సన్మానించి సత్కరించారు. మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిలపై పూలవర్షం కురిపించిన విద్యార్థులు ఘన స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలల్లో కల్పిస్తున్న ఆధునిక సౌకర్యాలను పరిశీలించిన నేతలు విద్యార్థులతో ముచ్చటించి వారి విద్యాభ్యాసం, లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ చిన్న స్థాయి నుంచి ఎదిగి ఉపాధ్యాయుడిగా సేవలందించి, రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అందరికీ ఆదర్శనీయులని అన్నారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాది సెప్టెంబర్ 5న గురుపూజోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారిని ప్రోత్సహించి ఉన్నత శిఖరాలకు చేర్చాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఒక మంచి ఉపాధ్యాయుడు ఒక విద్యార్థి భవిష్యత్తునే కాదు ఒక కుటుంబ భవిష్యత్తును కూడా మార్చగలడని పేర్కొన్నారు. విద్యారంగంలో యువనేత నారా లోకేష్ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతున్నారని తెలిపారు. అందుకు అనుగుణంగా డీఎస్ఆర్, ఆర్ఎస్ఆర్ పాఠశాలలను అన్ని హంగులతో ఆధునీకరించామని చెప్పారు. నెల్లూరు సిటీలోని అన్ని ప్రభుత్వ హైస్కూళ్లను దశలవారీగా ఆధునీకరిస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన వాతావరణం, ఆధునిక సౌకర్యాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చదువుల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ డీఎస్ఆర్ పాఠశాలను అద్భుతంగా తీర్చిదిద్దారని ప్రశంసించారు. మంత్రి నారాయణ కల్పించిన సౌకర్యాలు, అవకాశాలను విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదిగి, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు మేయర్ దేవర కొండ సుజాత, కమిషనర్ నందన్, డీఈఓ బాలాజీరావు, ఎంఈఓ తిరుపాల్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జెడ్పీటీసీ విజేతారెడ్డి, కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి, టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, టీడీపీ నేతలు ఆనం రంగ మయూర్ రెడ్డి, అన్నంగి ప్రసాద్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలకు కొత్త జంతువులు: డిసిఎం పవన్

**విజయవాడ, సెప్టెంబరు 5, ప్రభాతవార్తప్రతినిధి:** ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల కు కొత్త జంతువులు వచ్చాయి. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఉన్న రాధేకృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్ట్‌తో జంతు మార్పిడి కార్యక్రమాన్ని ఐజీజెడ్పీ విజయవంతంగా పూర్తి చేసింది. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఈ జంతు మార్పిడిలో భాగంగా ఐజీజెడ్పీకి 3 జీబ్రాలు, 4 కాటన్‌టాప్ టామరిన్లు, 3 రెడ్‌నెక్ట్ వాలబీలు, 2 కామన్ మార్మోసెట్‌లు వచ్చాయి. ముఖ్యంగా అంతరించిపోతున్న కాటన్‌టాప్ టామరిన్‌లను ఐజీజెడ్పీలో తొలిసారిగా ప్రవేశపెట్టారు. ఐజీజెడ్పీ నుంచి 3 ఇండియన్ గౌర్లు, 4 స్టంప్‌టెయిల్డ్ మకాక్‌లు, 2 ఘరియాల్‌లను జామ్‌నగర్‌కు తరలించారు. కొత్తగా వచ్చిన అన్ని జంతువులు ఆరోగ్యంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. అలాగే వన్యప్రాణులపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు సందర్శకులకు మరింత మంచి అనుభూతిని అందించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని పవన్ కళ్యాణ్ తన పోస్టులో పేర్కొన్నారు.

## స్థానిక ఎన్నికల నిర్వహణకు జనసేన సమన్వయ కమిటీ

**విజయవాడ, సెప్టెంబరు 5, ప్రభాతవార్తప్రతినిధి:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకి జనసేన నాయకులు, జన సైనికులు, వీర మహిళలను సన్నద్ధం చేసేందుకు పార్లమెంట్ నియోజక వర్గాల వారీగా సమన్వయ కమిటీలను జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నియమించారు. ప్రతి పార్లమెంట్ నియోజక వర్గానికి ఒక సమన్వయకర్త, ముగ్గురు సమన్వయ కమిటీ సభ్యులను నియమించారు. వీరికి సహాయక బృందంగా ఆ పార్లమెంట్ పరిధిలోని ప్రతి శాసన సభ నియోజక వర్గం నుంచి ఒకరిని ఎంపిక చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల విధివిధానాల కోసం నియమించిన కమిటీలోని సభ్యులకు పార్లమెంట్ నియోజక వర్గాల వారీగా సమన్వయ బాధ్యతలు అప్పగించారు. జనసేన అనుసరించే విధి విధానాలతో, కూటమి పక్షాలతో సమన్వయాన్ని వీరు చూస్తారు. ఈ సభ్యులందరికీ 9వ తేదీన ఉదయం 10 గం. నుంచి మంగళగిరిలో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహిస్తారు.

## టిటిడిలో సంచలనం రేకెత్తిస్తున్న జనసేన నేత వ్యాఖ్యలు

### ఎవరా 50మంది అవినీతిపరులు?



**తిరుపతి, సెప్టెంబరు 5 ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మిక సంస్థ టిటిడిలో పనిచేస్తూ కోట్లాదిరూపాయల విలువైన ఆస్తులు కలిగి ఉన్న అక్రమార్కులు ఇంకా ఉన్నారనే జనసేన పార్టీ నేత వ్యాఖ్యలు తిరుమల, తిరుపతిలో పెద్ద సంచలనం కలిగిస్తున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా దేవుని దర్శనాల పేరుతోనే ప్రాబల్యం చాటుకుని టిటిడిలో అటెండర్ స్థాయి నుండి డిప్యూటీ ఇఒ స్థాయి అధికారుల వరకు పలు రకాలుగా అవినీతికి అలవాటు పడి కోట్లు కూడబెట్టారనే వదంతులు ఇప్పుడు ఎసిబికి ఉప్పందిందనేది గుప్పుమంటోంది. తాజాగా తిరుమల ఆలయ డిప్యూటీ ఇఒ మెండు లోకనాథం ఆదాయానికి మించి ఐదుకోట్ల రూపాయలు విలువైన ఆస్తులు కలిగిఉన్నట్లు ఎసిబి అధికారులు నిర్ధారించడం, తదనంతరం ఆయన్ను అరెస్ట్ చేసి నెల్లూరు జైలుకు తరలించారు. దీంతో ఇప్పుడు టిటిడిలో అక్రమార్కుల యవ్వారంపై పెద్ద చర్చ మొదలైంది. దీన్ని బలపరుస్తూ జనసేన పార్టీ తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ చేసిన వ్యాఖ్యలు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. గత ప్రభుత్వంలో టిటిడి మాజీ ఛైర్మన్, వైసిపి నేత భూమన కరుణాకర్‌రెడ్డికి నయానాభయానా సేవ చేస్తూ కోట్లల్లో అక్రమాస్తులు సంపాదించిన వారి వివరాలు తన దగ్గర ఉన్నాయని, ఆ 50మంది అక్రమార్కుల పేర్లు చిట్టా తన దగ్గర ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. టిటిడి ఇఒను కలిసి ఆ పేర్లను అందజేస్తానని,

మిగిలిన వారిపైన త్వరలో ఎసిబి దాడులు జరగడం ఖాయమని కీలకంగా వెల్లడించారు. ఇప్పుడు ఆయన వ్యాఖ్యలు టిటిడిలో పెద్ద దుమారం రేపుతోంది. అదేగాక వైసిపి నేత భూమన కరుణాకర్‌రెడ్డి ఎసిబి సోదాల్లో అక్రమాస్తులు కలిగిఉండిన టిటిడి డిప్యూటీ ఇఒ లోకనాథంకు మద్దతు పలకడం విడ్డూరమని అన్నారు. లోకనాథం అక్రమాస్తుల్లో భూమనకు వాటాలు వెళ్ళాయని, ఆయనకు భూమన వత్తాసు పలకడమేంటని ప్రశ్నించారు. తిరుపతిలో కుల చిచ్చు పెట్టడానికి భూమన ప్రయత్నిస్తున్నాడని కిరణ్‌రాయల్ విమర్శలు చేశారు. దేవుని చెంత నిజాయితీ, నీతిగా అంకితభావసేవలందిస్తున్న టిటిడి ఉద్యోగస్తులు భూమన ట్రాప్ లో పడకండని కూడా కిరణ్ హితవు చేశారు. టిటిడి ఉద్యోగస్తులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికే టిటిడిలో పలువురు అక్రమార్కులపై ఎసిబికి ఫిర్యాదులు వెళ్ళాయనేది సమాచారం. ఇంకా టిటిడిలో ఇద్దరు డిప్యూటీ ఇఒ అధికారులు, ఏడుమందివరకు సూపరింటెండెంట్లు, ఆరేడు మంది ఎఇఒల జాబితా ఎసిబి వద్ద ఉందనేది కథనం. మరీ ఇదే నిజమైతే వీరందరిపై ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై టిటిడి ఛైర్మన్, ఇఒ విచారణకు ఆదేశిస్తారా, సహకరిస్తారా అనే అనుమానాలు ఉద్యోగవర్గాల్లో గుప్పుమంటున్నాయి. ఎసిబి వద్ద ఎవరి పేర్లు ఉన్నాయి, ఎవరు ఎవరిపై ఫిర్యాదులు చేశారనేది అంతర్గతంగా ఆరా తీస్తు న్నట్లు సమాచారం. మరీ అక్రమ సంపాదనపై టిటిడిలో కీలకమైన ఒక్క డిప్యూటీ ఇఒ అధికారి అరెస్టుతో వ్యవహారం చక్కబెట్టేస్తారా? లేక అవినీతి మూలాలను వెలికి తీసే పెద్ద దర్యాప్తుకు ఇది ఆరంభమనే సంకేతాలు ఇచ్చారా అనేది కిరణ్‌రాయల్ 50మంది పేర్లు చిట్టా విప్పితే స్పష్టం కానుంది.

## స్టార్టప్ పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహించేలా ప్రణాళికలు

**తిరుపతి, సెప్టెంబరు 5 ప్రభాతవార్తప్రతినిధి:** స్టార్టప్ పర్యావరణ వ్యవస్థను ప్రోత్స హించే సహాయకులు అంశంపై సదస్సు జరిగింది. శనివారం తిరుపతి పద్మావతి మహిళ విశ్వవిద్యా లయం ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో కమ్యూనికేషన్ జర్నలిజం విభాగం, బయోసైన్సెస్ సెరికల్చర్ విభాగాల సహకారంతో ప్యానెల్ డిస్కషన్ విత్ రీజినల్/నేషనల్ స్టార్టప్ ఎకోసిస్టమ్ ఎనేబ్లర్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒక కొత్త వ్యాపా రం (స్టార్టప్) పుట్టి, పెరిగి, విజయం సాధించడానికి అవసరమైన మద్దతు, వనరులు వాతావరణాన్ని కల్పించే వ్యవస్థలను నిర్మించుకోవాల్సిన అవసరంపై చర్చించారు. ప్రాంతీయ స్థాయిలో ఒక విజయవంతమైన స్టార్టప్ ఎకోసిస్టమ్ ఏర్పడటానికి అవసరమైన ముఖ్యమైన అంశాలపై ప్యానెలిస్టులు తమ అనుభవాలను పంచుకున్నారు. నిధులు మాత్రమే స్టార్టప్‌ల విజయానికి కీలకమా మెంటార్‌షిప్, మార్కెట్ యాక్సెస్, ప్రతిభావంతులైన మానవ వనరులు కూడా సమానంగా ముఖ్యమా అనే అంశాలపై చర్చ సాగింది. ఒక ప్రాంతంలో విజయవంతమైన



స్థానిక పారిశ్రామికవేత్తలు ఉండటం వల్ల కొత్త తరం స్టార్టప్‌లకు కలిగే ప్రయోజనాలను కూడా వివరించారు. నగరాల్లో స్టార్టప్‌లు ఎదుర్కొంటున్న సవాళ్లు కూడా చర్చలో ప్రధానంగా నిలిచాయి. మెట్రో నగరాల్లోనే స్టార్టప్ వనరులు ఎక్కువగా కేంద్రీకృతమవుతున్న నేపథ్యంలో ప్రాంతీయ స్టార్టప్‌లకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇంక్యుబేటర్ల బలోపేతం, జాతీయ మార్కెట్లకు చేరుకునే అవకాశాలు వంటి అంశాలపై ప్యానెలిస్టులు అభిప్రాయాలను వెల్లడించారు. డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, వర్చువల్ మెంటార్‌షిప్, ఆన్‌లైన్ ఇంక్యుబేషన్ వంటి మార్గాల ద్వారా భౌగోళిక పరిమితులను తగ్గించవచ్చని చర్చించారు. విశ్వవిద్యాలయాలు ప్రాంతీయ స్టార్టప్ ఎకోసిస్టమ్ అభివృద్ధిలో పోషించాల్సిన పాత్రపై కూడా ప్రత్యేకంగా చర్చ జరిగింది. విద్యార్థుల్లోని సృజనాత్మక ఆలోచనలను స్టార్టప్‌లుగా మలచేందుకు ఇంక్యుబేషన్, మెంటార్‌షిప్, పరిశ్రమలతో అనుసంధానం, మార్కెట్ అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని ప్యానెలిస్టులు సూచించారు. ఈ కార్యక్రమానికి వనరుల వ్యక్తులుగా డాక్టర్ కె. శ్వేతా కుమారి, మిస్టర్ మన్సూర్ అలీపాల్గొనగా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ చీఫ్ ప్యాట్రన్‌గా, రిజిస్ట్రార్ ఆచార్య ఆర్. ఉష ప్యాట్రన్‌గా వ్యవహరించారు.

## నంద్యాల ఎంపి ఆదేశంతో కెసికి నీరు విడుదల

**పగిడ్యాల, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలం ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం, మల్యాల ఎత్తిపోతల పథకం నుండి కర్నూలు - కడప (కేసికెనాల్) కు నంద్యాల ఎంపి, టిడిపి లోక్‌సభ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి ఆదేశాలమేరకు నీటిని విడుదల చేసినట్లు ముచ్చుమర్రి టిడిపి సీనియర్ నాయకులు కాటం వెంకట రామిరెడ్డి తెలిపారు. శనివారం ఎంపి బైరెడ్డి శబరి అనుచరులు ముచ్చుమర్రి టిడిపి సీనియర్ నాయకులు కాటం వెంకటరామిరెడ్డి, ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్రఉపాధ్యక్షుడు కుమ్మరి నాగరాజు, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, మాజీ ఎంపిటిసి నాగభూషణం, సుబ్బారావు, బాలనారాయణ, ఆంజనేయనగర్ రవి ఆధ్వర్యంలో వందమంది రైతులు తరలివచ్చారు. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం వద్ద కృష్ణమ్మకు కుంకుమ, పసుపు, గాజులు, డిబియ్యం, కొత్త చాటతో పెట్టి సారే సమర్పించి కృష్ణమ్మ జలహారతిఇచ్చి కేసి కెనాల్‌కు నీటిని విడుదల చేశారు. కేసి కెనాల్ డీఈ ప్రసాద్, ఏఈఈలు వీరమ్మ, శ్రీనివాసనాయక్‌లు మాట్లాడుతూ



కృష్ణమ్మకు జలహారతి ఇస్తున్న ఎంపి బైరెడ్డి శబరి అనుచరగణం

శనివారం ఉదయం ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి నీటిని విడుదల కు ఉన్నతాధికారుల అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. దీంతో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి రెండు పైపుల నుండి 480 క్యూసెక్కులు, మల్యాల ఎత్తిపోతల పథకం ఒక పైపు నుండి 325 క్యూసెక్కుల నీరు మొత్తం 805 క్యూసెక్కుల నీరు కర్నూలు - కడప (కేసికెనాల్)విడుదల చేయడం జరిగిందన్నారు. కేసికెనాల్‌కు వదిలిన నీరు కేవలం తాగునీటి అవసారలే అన్నది మరువద్దని, నీటిపారుదల అధికారులు కూడా తాగునీటి అవసరాలకే కేసికెనాల్‌కు నీటిని విడుదలకు అదేశించినట్లు కేసి కెనాల్ డీఈ ప్రసాద్ స్పష్టం చేశారు.

## విజయవాడలో యంగ్ లీడర్స్ ఫర్ సోషల్ ఛేంజ్ శాఖ

### ప్రారంభించిన ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు

**విజయవాడ, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** డెమోక్రటిక్ సంఘ తన ప్రధాన కార్యక్రమమైన యంగ్ లీడర్స్ ఫర్ సోషల్ ఛేంజ్ (వైఎల్ఎస్‌సి) యొక్క విజయవాడ శాఖను శనివారం, విజయవాడలో ప్రత్యేక అతిథిగా హాజరైన లోక్ సభ సభ్యులు లావు శ్రీ కృష్ణ దేవరాయలు అధికారికంగా ప్రారంభించారు. డెమోక్రటిక్ సంఘ వ్యవస్థాపకురాలు రెజీనా కాసాండ్రా, డెమోక్రటిక్ సంఘం వ్యవస్థాపకులు చైతన్య ఎంఆర్‌ఎస్‌కె, వైఎల్ఎస్‌సి విజయవాడ బ్యాచ్ మెంటార్ యశస్విని పెద్ది ప్రసంగించారు. యంగ్ లీడర్స్ ఫర్ సోషల్ ఛేంజ్ అనేది 8 నుండి 12 తరగతుల వరకు చదివే విద్యార్థుల కోసం రూపొందించబడిన నాలుగు నెలల పౌర మరియు సామాజిక నాయకత్వ కార్యక్రమం. ఇది యువకులు ప్రజాస్వామ్యం, నాయకత్వం మరియు ప్రభుత్వ సంస్థలను అర్థం చేసుకోవడానికి, అలాగే వారి సమాజాల్లోని సమస్యలను పరిష్కరించడానికి అవసరమైన ఆత్మవిశ్వాసం మరియు నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి సహాయపడుతుంది.

ఈ ప్రారంభోత్సవంతో డెమోక్రటిక్ సంఘం వైఎల్ఎస్‌సిని నాలుగు నగరాలకు విస్తరించింది.



ఇందులో రెండు హైదరాబాద్ మరియు ఒక బెంగళూరులో మూడు విజయవంతమైన బ్యాచ్లు ఉన్నాయి. విజయవాడ ప్రారంభోత్సవం ఆంధ్ర ప్రదేశ్‌లో కార్యక్రమం విస్తరణను సూచిస్తుంది, అలాగే సమాచారం కలిగిన బాధ్యతాయుతమైన మరియు సామాజిక స్పృహ కలిగిన యువ నాయకుల విస్తృత నెట్వర్క్‌ను పెంపొందించే డెమోక్రటిక్ సంఘం ప్రయత్నాల తదుపరి దశను గుర్తిస్తుంది. ఈ పాఠ్యాంశాలు విద్యార్థులకు ప్రజాస్వామ్యం మరియు రాజ్యాంగం, నాయకత్వం, మానవ హక్కులు, వాతావరణ చర్య, ప్రజా విధానం మరియు పరిపాలన గురించి పరిచయం చేస్తాయి. పాల్గొనేవారు ఇంటరాక్టివ్ సెషన్లలో పాల్గొంటారు, ప్రజా నాయకులు మరియు సామాజిక ప్రభావ నిపుణుల నుండి నేరుగా నేర్చుకుంటారు, మరియు వాస్తవ సామాజిక మరియు సమాజ సవాళ్లను పరిష్కరించే ప్రాజెక్టులను అభివృద్ధి చేయడానికి కలిసి పనిచేస్తారు.

వైఎల్ఎస్‌సి యొక్క నిర్వచించే అంశం భారత పార్లమెంటు న్యూఢిల్లీకి అనుభవపూర్వక సందర్శన. ఈ సందర్శన విద్యార్థులు భారతదేశపు అత్యంత ముఖ్యమైన ప్రజాస్వామ్య సంస్థలలో ఒకదాన్ని ప్రత్యక్షంగా అనుభవించడానికి మరియు వారి అభ్యాసాన్ని పార్లమెంటరీ ప్రజాస్వామ్య పనితీరుతో అనుసంధానించడానికి వీలు కల్పిస్తుంది.

విజయవాడ బ్యాచ్ అక్టోబర్ 2026 నుండి జనవరి 2027 వరకు నడుస్తుంది మరియు మూలస్థాయి ఆవిష్కరణ, వ్యవస్థాపకత, సుస్థిరత మరియు సమాజ అభివృద్ధి రంగాలలో పనిచేస్తున్న సామాజిక ప్రభావ మరియు యువత అభివృద్ధి నిపుణురాలు యశస్విని పెద్ది ద్వారా మార్గదర్శకత్వం వహించబడుతుంది.

ఈ ప్రారంభోత్సవంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పౌర నాయకులు తదితరులు హాజరయ్యారు.

## భూ ఆక్రమణలపై టిడిపి గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు

**విజయవాడ, సెప్టెంబరు 5, ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన మహమ్మద్ రుఖియా శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ.. 2004 జనవరి 19న కంతేరు గ్రామ పరిధిలోని డోర్ నెం. 152 లో గల 200 గజాల నివాస స్థలాన్ని కొనుగోలు చేశాను. ఈ స్థలం తాడికొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజు నెం. 67/2004 ద్వారా చట్టబద్ధంగా రిజిస్టర్ అయింది. ఇటీవల తమ స్థలాన్ని పరిశీలించేందుకు వెళ్లగా, పక్క స్థలం వారు ఆ 200 గజాలను అక్రమంగా ఆక్రమించారు. స్థలంలోకి అడుగుపెట్టకుండా అడ్డుకుంటూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని ఏపీ హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్య బాబుకు అర్జీ ఇచ్చి అభ్యర్థించారు.

అనకాపల్లి జిల్లా కశింకోట మండలం గోకివానిపాలెం గ్రామానికి చెందిన సోమునాయుడు, ఎన్టీఆర్ జిల్లా పెనమలూరు మండలం కానూరు గ్రామానికి చెందిన కాజా రామాదేవి, అనకాపల్లి జిల్లా మారేడుపూడి గ్రామానికి చెందిన పి. కృష్ణమూర్తి, అనంతపురం జిల్లా శింగనమల మండలం గురుగుంట్ల గ్రామానికి చెందిన కె. సుగుణ, అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామానికి చెందిన అడపా నారాయణరావు గ్రీవెన్స్‌లో అర్జీలు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు.



సిఎం చంద్రబాబును సన్మానిస్తున్న దృశ్యం

## సిఎం ప్రకటనపై అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జెసి చైర్మన్ భూపతిరాజు రవీంద్ర రాజు హర్షం

**విజయవాడ, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** శనివారం ఉండవల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చలలో సీఎం చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించి ఉద్యోగుల హామీలపై సీఎం ప్రకటన పై ఆంధ్రప్రదేశ్ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ భూపతిరాజు రవీంద్ర రాజు హర్షం వ్యక్తం చేశారు. 12వ పిఆర్సీ నియామకం, 2026 అక్టోబర్ 1 నుంచి 2 రెండు డిఎలు చెల్లింపు, 17-2024, 11-2025 డీఏలు విడుదల, 2022 సంవత్సరానికి సంబంధించి సరెండర్ లీవ్స్ వచ్చే సంక్రాంతికి అకౌంట్ లో వేయడానికి అంగీకారం, పోలీసులకు 1 అడిషనల్ సరెండర్ లీవ్ ఈ దసరాకి చెల్లింపు, అడి షనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ జనవరి 2027 నుంచి ఇచ్చేందుకు నిర్ణయం, 70 ఏళ్లు దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్లు దాటిని వారికి 15 శాతం మేర అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ వర్తింపు, ఎంప్లాయిస్ హెల్త్ స్కీంను స్ట్రీమ్ లైన్. వచ్చే నెల నుంచే ఏ నెలకు ఆ నెల ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ కు చెల్లింపునకు అంగీకారం తదితర ప్రయోజనాలను అందించడానికి సిఎం చంద్రబాబు నాయుడు అంగీకరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సీఎం క్యాంప్ ఆఫీసులో కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆంధ్రప్రదేశ్ అమరావతి రెవిన్యూ ఎంప్లాయిస్ జేఏసీ తరఫున మెమెంట్ ఇచ్చి సాలువతో భూపతిరాజు సన్మానం చేశారు. ఉద్యోగుల న్యా యమైన సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఉద్యోగులకు న్యాయం చేయడానికి కృషి చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అమరావతి రెవిన్యూ ఎంప్లాయిస్ జేఏసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సూరిపల్లి రాజశేఖర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవె న్యూ అధికారుల సంఘం. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు, రాటకొండ శ్రీని వాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు. మిరియాల లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు.

## ఆక్వా రైతుల సమస్యలను పరిష్కరించిన సిఎం

**విజయవాడ, సెప్టెంబరు 5, ప్రభాతవార్తప్రతినిధి:** ఆక్వా రైతుల ఎన్నో ఏళ్ల సమస్యలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిష్క రించారు. ఈ మేరకు మత్స్యశాఖ జీవో నంబర్1756ను విడుదల చేసింది. ఆక్వా రైతుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తీసుకెళ్లారు. ఈ సమస్యలపై సీఎం సానుకూలంగా స్పం దించి వెంటనే చర్యలు చేపట్టారు. మత్స్యశాఖ విడుదల చేసిన జీవోపై ఆక్వా రైతు సంఘం నాయకులు హర్షంవ్యక్తం చేశారు. గుడివాడ ప్రజా వేదికలో ఎమ్మెల్యే రామును ఆక్వా రైతులు శనివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జీవోలోని నిబంధనలను రైతులుసద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రాము సూచించారు. గత ప్రభుత్వంలో పట్టించుకోని తమ సమస్యలకు కూటమి ప్రభుత్వంలో పరిష్కారం లభించిందని ఆక్వా రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు.



## దుర్గమ్మకు రు.5 లక్షల విలువైన బంగారు హారం

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ కనకదుర్గ అమ్మవారికి శనివారం పశ్చిమ గోదావరి జిల్లా, పాలకోలు మండలం భాగ్యేశ్వరం గ్రామానికి చెందిన దొంగ వెంకట త్రిమూర్తి సత్యనారాయణ బంగారు ఆభరణాన్ని దుర్గమ్మవారికి కానుకగా డిప్యూటీ ఈఓ కిశోర్ కుమార్‌కు అందించారు. దాదాపు రు5 లక్షల విలువైన, 32 గ్రాముల బరువుగల బంగారు లక్ష్మీ తాడును సమర్పించారు. ఈ ఆభరణంలో తెలుపు, ఎరుపు మరియు పచ్చ రాళ్లు పొదగబడి ఉన్నాయి. కానుక సమర్పించిన భక్తునికి ఆలయ మర్యాదలతో ప్రత్యేక దర్శనం కల్పించి, వేదపండితులచే ఆశీర్వచనం చేయించి అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను డిప్యూటీ ఈఓ శ్రీ కిషోర్ కుమార్ అందజేశారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** ఇంద్రకీలాద్రి, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథక విభాగమునకు విజయవాడ ఎనికేపాడు కెవిఆర్ కాలనీ వాస్తవ్యులు పి.రవి శంకర్ రూ.1,00,116లు మరియు హైదరాబాద్‌కు చెందిన చుండూరి శ్రీనివాసరావు రూ.1,00,000లు విరాళమును ఆలయ అధికారులకు అందచేయగా, అధికారులు దాతలకు అమ్మవారి చిత్రపటమును అందచేసి దర్శన ఏర్పాట్లు గావించారు. దర్శనానంతరం దాతలకు ఆలయ వేద పండితులు వేదాశీర్వచనం, ప్రసాదం అందజేశారు.

## 12 వ పీఆర్సీకి పచ్చజెండా: సిఎంకు కృతజ్ఞతలు

### ఆల్ఎన్జిజీవో జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం

**శ్రీకాకుళం, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** 12వ పీఆర్సీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం పట్ల ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబు నిర్ణయం పట్ల ఏపీ ఎన్జీవో కార్యాలయం వద్ద శనివారం బాణాసంచా కాల్చి ఏపీ ఎన్జీవో ప్రతిని ధులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాయిరాం మాట్లా డుతూ 2026 అక్టోబర్ ఒకటో తేదీ నుంచి రెండు డీఏల చెల్లింపునకు అంగీకరించినట్లు తెలిపారు. అలాగే సరెండర్ లీవ్స్ (పోలీసులకు అదనంగా సరెండర్ లీవ్) వేసేందుకు ఆమోదించారని చెప్పారు. రిటైర్ అయిన ఉద్యోగులకు అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను 2027 జనవరి నుంచి ఇచ్చేందుకు ఆమోదం అప్పట్లో ఆనందం వ్యక్తం చేశారు. మరోవైపు అక్టోబర్ ఒకటి నుంచి రెండు డీఏలు చెల్లించాలని నిర్ణయించిన ఏపీ ప్రభుత్వం.. 172024, 112025 డీఏలు విడుదల చేనుందని వివరించారు. ఏపీ ఎన్జీ జీవో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాయి వేణుగోపాల్ మాట్లాడుతూ 2022కు సంబంధించిన సరెండర్ లీవ్స్‌ను 2027 సంక్రాంతికి అకౌంట్‌లో వేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగీకరించిందని వివరించారు. పోలీస్ సిబ్బందికి ఒక అడిషనల్ సరెండర్ లీవ్ ఈ విజయదశమికి చెల్లించనున్నారు. రిటైర్ అయిన వారికి జనవరి 2027 నుంచి అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ ఇవ్వనుండగా.. 70 సంవత్సరాలు దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్లు దాటిన వారికి 15 శాతం చొప్పున అందించనున్నారని చెప్పారు. మరోవైపు ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) బకాయిలను వచ్చే నెల నుంచి ఏ నెలకు ఆ నెల చొప్పున ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కి చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించినట్లు గొప్ప విషయం అన్నారు. మరోవైపు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని ప్రభుత్వ పథకాల్లో లబ్ధిదారులుగా చేర్చాలని ముఖ్యమంత్రిని విద్యాసాగర్ కోరడం హర్షనీయమన్నారు. అలాగే స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల సిబ్బందికి నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరిందిని చేశారు. సీఎం చంద్రమనాయుడు తీసుకునే నిర్ణయం పట్ల రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు హర్షత రేఖలు వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ నిర్ణయాలు ఉద్యోగ సంఘ నాయకుల విజయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్జి జీవో సంఘ ప్రతినిధులు జిల్లా కార్యదర్శి చల్లా శ్రీనివాస్, కంట జయరావు పాల్గొన్నారు.

MN 11PAGE-GNTv:MN 11PAGE-GNTv 01/01/2001 10:41 Page 1



# శిథిలాల్లో చరిత్ర..

**లాకర్లలో ఉత్సవమూర్తులు.. ఆలయానికి పునరుజ్జీవం కావాలి!**

## వెన్నముద్ద వేణుగోపాలుడికి పునర్నిర్మాణం ఎప్పుడో?

**యడ్లపాడు, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** చారిత్రక ప్రాశస్త్యం కలిగిన కొండవీడు కొండల పరిసర ప్రాంతాల్లోని అనేక పురాతన దేవాలయాలు ఏళ్లుగా జీర్ణోద్ధరణకు నోచుకోక శిథిలావస్థకు చేరుతున్నాయి. నాటి రాజులు, జమీందారులు నిర్మించిన ఈ ఆలయాలను సందర్శించేందుకు వివిధ ప్రాంతాల నుంచి నిత్యం పర్యాటకులు వస్తున్నప్పటికీ, వాటి పరిరక్షణపై పూర్తిస్థాయి దృష్టి సారించకపోవడంతో చారిత్రక సంపద కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. కొండవీడు ప్రాంతంలో ప్రత్యేక ప్రాశస్త్యం కలిగిన ఆలయాల్లో చిలకలూరిపేట జమీందార్ రాజా మానూరి వెంకటకృష్ణ రాయల్ బహదూర్ నిర్మించిన వెన్నముద్ద వేణుగోపాలస్వామి ఆలయం ఒకటి. పురాతన కట్టడమైన ఈ ఆలయంలో స్వామివారికి నేటికీ భక్తులు నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. అయితే ఆలయం ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో తాత్కాలిక మరమ్మతులతోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఆలయంలోని విలువైన దేవతామూర్తులు, ఉత్సవమూర్తుల భద్రత కూడా ఆందోళనకరంగా మారింది. భద్రతా కారణాల దృష్ట్యా ఉత్సవమూర్తులను లాకర్లలో భద్రపరచాల్సిన పరిస్థితి నెలకొనడం ఆలయ దుస్థితికి అద్దం పడుతోంది. పర్యాటకాభివృద్ధికి అవకాశంవెన్నముద్ద వేణుగోపాలస్వామి ఆలయాన్ని చారిత్రక ప్రాధాన్యతను కాపాడేలా పునర్నిర్మిస్తే భక్తులు, పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఆలయ అభివృద్ధితో గ్రామానికి పర్యాటక ఆదాయం పెరగడంతో పాటు స్థానికులకు ఉపాధి, ఇతర ఆదాయ మార్గాలు కూడా ఏర్పడతాయని తెలిపారు. చారిత్రక వారసత్వానికి ప్రతీకగా నిలిచిన ఆలయాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి పునర్నిర్మాణ పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. పురాతన ఆలయాలు, విగ్రహాలను సంరక్షించడం ద్వారా భావితరాలకు చారిత్రక వారసత్వాన్ని అందించవచ్చని వారు పేర్కొన్నారు

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**చిలకలూరిపేట, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:** క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసము కలిగిన విద్యార్థులు జీవితములో అంతిమ ధ్యేయాన్ని చేరుకోగలరని ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు తోటకూర రామసీత అన్నారు. ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మురికిపూడి లోని కందిమల్ల శారదాంబ జిల్లా పరిషత్ హై స్కూలులో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ కలకత్తా విశ్వవిద్యాలయానికి రాధాకృష్ణన్ బదిలీ అయినప్పుడు విద్యార్థులు ఆయనను గుర్రపు బండిలో ఎక్కించుకొని స్వయంగా తమ భుజాలతో లాక్కుంటూ రైల్వేస్టేషన్కు తీసుకువెళ్లిన సంఘటనను గుర్తు చేస్తూ, నేటి అధ్యాపకులు కూడా విద్యార్థుల ఉన్నత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఆత్మీయతను ప్రదర్శిస్తూ బోధన చేయాలని సూచించారు. ఇన్నర్ వీల్





వేడుకలలో ప్రసంగిస్తూ నిజమైన చదువు, నిజమైన బోధనలు కేవలం విజ్ఞానాన్నే గాక, విద్యార్థుల వ్యక్తిత్వాన్ని కూడా తీర్చిదిద్దుతాయన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న రోటరీ జిల్లా 3150 మాజీ గవర్నర్ తాళ్ల రాజశేఖర్ రెడ్డి, చిలకలూరిపేట విద్యాసంఘం అధ్యక్షులు తేళ్ల సుబ్బారావు మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని, విద్యార్థులకు చదువు సంధ్యలతో పాటు నైతిక విలువలను కూడా బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. ఈ కార్యక్రమానికి స్పాన్సర్ గా వ్యవహరించిన రోటరీ అసిస్టెంట్ గవర్నర్ కాపు వెంకటరావు మాట్లాడుతూ మైసూరు విశ్వవిద్యాలయం నుండి సభ్యులు చిలకలూరిపేటలోని శారద మునిసిపల్ ఎలిమెంటరీ పాఠశాల అభివృద్ధికి అకుంఠిత దీక్షతో కృషిచేసి పదవీ విరమణ పొందిన హెడ్మాస్టర్ దండా విజయశ్రీ తో పాటు మురికిపూడి లోని శారదాంబ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన హెడ్మాస్టర్ డి ధనలక్ష్మి మరియు 22 మంది ఉపాధ్యాయులకు ఘనమైన సన్మానం చేశారు. శాలువా, మొమెంటో, స్వాతంత్ర సమరయోధులు గ్రంథాలను ఇచ్చి ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ సభ్యులు గట్టు సరోజినీ, కందిమల్ల అంజన, దండా విజయశ్రీ, శ్రీ హర్ష, తోటకూర వెంకటనారాయణ, సుంకర కొండలరావు, విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వాసవి ఫౌండేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఘన సత్కారం

**చిలకలూరిపేట, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:** సెప్టెంబర్ 5వ తేదీ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని వాసవి ఫౌండేషన్ సొసైటీ చిలకలూరిపేట వారి



ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణమండపం నందు శనివారం ఉదయం చిలకలూరిపేట పట్టణానికి చెందిన RVSCVS హైస్కూల్ నందు పనిచేస్తున్న హిందీ ఉపాధ్యాయురాలు చుండూరు అరుణ కుమారి, బొప్పూడి గ్రామంలోని ఆజాద్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న శిఖాకొల్లి వీర వెంకట సురేష్ కుమార్ మరియు వైస్కూల్ కొప్పరపాలెం గ్రామంలో ఉపాధ్యాయులుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న గాలం వీరాంజనేయులు గారిని వారి సేవలకు ప్రోత్సాహకంగా పూల మాలలు, శాలువాలు మరియు మెమెంటోలతో ఘనంగా సత్కరించడం జరిగినది. ఈ సందర్భంగా సేవా సంస్థ సభ్యులు అడిగిన ప్రశ్నకు ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా పనిచేస్తున్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి ఫౌండేషన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు అయితా వెంకట ప్రసాద్, కార్యదర్శి చేబ్రోలు చంద్రశేఖరరావు, కోశాధికారి శిఖాకొల్లి రామారావు, అధ్యాపకులు మరియు ప్రధానోపాధ్యాయులు ఉప్పలపాటి వెంకటేశ్వరరావు, సన్మాన గ్రహీతల దంపతులు వారి తల్లిదండ్రులు, సోదరులు, విశ్రాంత ఉపాధ్యాయులు చెన్నారెడ్డి వాసవి ఫౌండేషన్ సొసైటీ సభ్యులు చేవూరి కృష్ణమూర్తి, గ్రంధి రామకృష్ణ, ఓబుల శెట్టి మల్లికార్జునరావు, దామిశెట్టి సునీల్ కుమార్, ఆలపాటి కాలేషా, దోగిపర్తి రాంబాబు, పోలిశెట్టి మల్లికార్జునరావు, జెల్లా మల్లికార్జునరావు తదితరులు 40 మందికి పైగా పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయు అవార్డు అందుకుంటున్న నాగమల్లేశ్వరి

**చిలకలూరిపేట, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:** పట్టు వదలని విక్రమార్కుడు లాగా విజయం సాధించే వరకు ఎంతటి కష్టమైనా సరే ఇష్టంగా వర్క్ చేయటం అడ్డా కష్టానికి ప్రతిఫలం దక్కితే ఆ దేవుడిచ్చే ఆనందం అంతా ఎంత కాదు... కుటుంబాన్ని కంటికి రెప్పలా చూసుకుంటూ భర్తనే బిడ్డలను తన ప్రాణ సమానంగా ప్రేమిస్తూ అనురాగంగా చూసుకుంటూ టీచర్ ఉద్యోగం చేస్తూ ఉద్యోగుల ఎంతోమంది బిడ్డలను ఉన్నత స్థాయి స్థితికి చేర్చాలని ఒక దృఢ సంకల్పంతో ఎంతోమంది విద్యార్థులను ఐఏఎస్ ఐపీఎస్ చేసిన ఘనత ఆమెది.... ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలి అనే మాటకు నిలువెత్తు రూపం సొసైటీలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు తాను తోడై ఉంటూ రోటరీ క్లబ్ వారు చేసే సేవా కార్యక్రమంలో తన వంతు సహాయం చేస్తూ ప్రజలకు సహాయం చేసే మంచి గుణం కలిగిన మంచి వ్యక్తి.... శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గారి కుడి భుజం అనుచరుడు తూబాటి శ్రీహరి ఈ పేరు తెలియని వారు నియోజకవర్గంలో ఉండరు రాష్ట్రంలోనే కొన్ని విషయాల్లో సంచలనం నిలిపిన పేరు... ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా భార్యని ఉన్నత స్థాయిలో చూడాలని కోరిక అతనిది ఏది ఏమైనా ఆ దేవుని ఆశీస్సులు



మెండుగా ఆ కుటుంబానికి ఉండాలని మనసారా కోరుకుంటూ... మా తూబాటి శ్రీహరి అన్నయ్య సతీమణి నాగమల్లేశ్వరి గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం... మీరు లాగా కష్టపడే వారికి ఆ దేవుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయి ఇంకా ఎంతో ఉన్నత స్థాయి కి చేరి ఎంతోమంది బిడ్డల భవిష్యత్తును కీర్తించిన ఈ చేయి ఆశీస్సులు అందరికీ ఉండాలి అని కోరుకుంటూ మరోసారి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం

## సర్వేపల్లి ఆశయాలు ఆదర్శప్రాయం

### కెఎల్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఐ.పవన్ కుమార్



**తాడేపల్లి, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :** మహోన్నత విద్యావేత్త, దార్శనికులు సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలను నేటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కెఎల్ యూనివర్శిటీ ఇంఛార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.ఐ.పవన్ కుమార్ పేర్కొన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం యూనివర్శిటీలోని హాబీక్లబ్స్ ఆధ్వర్యంలో సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయులు కేవలం విద్యను బోధించటమే కాకుండా విద్యార్థుల్లో విలువలు, క్రమశిక్షణ, నైతికత, సామాజిక బాధ్యతలను పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధివర్మ, ప్రోవైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, ఇంఛార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.ఐ.పవన్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ టికె.రామకృష్ణారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇంచార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్, హాబీక్లబ్స్ ప్రొఫెసర్ ఇంఛార్జి డాక్టర్ ఆర్.శుభాకరరాజు పలువురు అధ్యాపకులు తదితరులు నివాళులర్పించారు.

## రోడ్డు భద్రత పై అవగాహన



**చిలకలూరిపేట, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:** జరిగిన రోడ్డు ప్రమాదం నేపద్యం లో ఈ రోజు అనగా శనివారం స్థానిక అంబేద్కర్ భవనం లో ఆటో రిక్షా డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించినాము. ఆటోలలో పరిమితి కి మించి ప్రయాణికులను తీసుకుని వెళ్తుండడం వలన ఎక్కువ ప్రమాదములు జరుగుచున్నాయని, అలాంటి ప్రమాదాలలో ఎక్కువ మంది తమ విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని, ముఖ్యంగా ఆటో యొక్క వెనుక వైపు తలుపు తెరిచి వుంచి మరియు డ్రైవర్లకు ఇరువైపులా ప్రయాణికులను తీసుకుని వెళ్లరాదని, మరీ ముఖ్యంగా మద్యం సేవించి అధిక వేగం తో ప్రయాణీకులను తీసుకుని వెళ్ళడం వలన ప్రమాదం జరిగినప్పుడు వేగాన్ని నియంత్రణ చేయలేక ఎక్కువ మరణాలు సంభవించే అవకాశం వుందని, అందువలన ప్రమాదాలు జరిగిన తర్వాత పశ్చాతాప పడేకన్నా ప్రమాదము జరగకుండా చూసుకోవడం మంచిదని అందుకు అవసరమైన రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచనలు చేసినాము. సెల్ ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి, అధిక వేగంతో మరియు సరయిన రికార్డులు లేకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అవగాహన చేసినాము. ఈ కార్యక్రమం లో నరసరావుపేట సహాయ మోటరు వాహనముల తనిఖీ అధికారి పవన్ కుమార్, స్థానిక పట్టణ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ సోమేశ్వర రావు, ఆటో డ్రైవర్లు, ఆటో యూనియన్ నాయకులు రాజు పాల్గొన్నారు.

## హెల్తీ క్యాంపస్ కాన్సెప్ట్‌తో బీసీ హాస్టళ్ళ అభివృద్ధి పై హర్షం : కేసన శంకరరావు



**తాడేపల్లి, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :** విజన్ 2047 లక్ష్య సాధనలో భాగంగా ఖిఖిహెల్తీ క్యాంపస్ కాన్సెప్ట్ఖిఖి తో బిసి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం లో బీసీ హాస్టళ్లను అభివృద్ధి పరచడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి ఎస్.సవితను అభినందిస్తున్నామని, ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. గత మూడు నెలలుగా అన్ని జిల్లాలలోని మా సంఘ నాయకత్వాలు బీసీ హాస్టళ్ల నిర్వహణపర్యవేక్షణలపై అధ్యయనం చేసి, పలు సమస్యలపై ప్రభుత్వానికి విజ్ఞాపన పత్రాలను సమర్పించిన మేరకు స్పందించి, పలు సంస్కరణలు తీసుకొచ్చినందుకు ధన్యవాదాలన్నారు. బీసీ హాస్టళ్ళలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం రూ:6 కోట్లతో 11 రకాల వస్తువులతో కూడిన శానిటరీ కిట్లను, విద్యార్థుల సంఖ్యను బట్టి 5 కేటగిరీలుగా విభజించి, అవసరానికి అనుగుణంగా శానిటేషన్ సామాగ్రిని అందించే విధానం అనుసరణీయమన్నారు. టాయిలెట్లు, వాష్ రూమ్ లు, కారిడార్లు, తాగునీటి ట్యాంకుల పరిశుభ్రతకు సిబ్బందికి ఎస్ఓపీలు జారీచేసి, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వంటి ప్రత్యేక సేవలు అందించడం ముదావహమన్నారు. హాస్టళ్ల లో పారిశుధ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా, కొత్తగా 1100 టాయిలెట్లు నిర్మించి 1290 మంది పారిశుధ్య కార్మికులను విద్యార్థుల సంఖ్య కనుగుణంగా కేటాయించడం సంతోషదాయకమన్నారు. ఇన్నాళ్లకు మా బీసీ విద్యార్థుల స్థితిగతులు మెరుగుపరచడానికి మంచి ప్రణాళికలతో ముందుకొస్తున్న రాష్ట్ర ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వానికి శంకరరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపా

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న షేక్ కరీముల్లా


**చిలకలూరిపేట, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:** డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో భాగంగా, పల్నాడు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును షేక్ కరీముల్లా



అందుకున్నారు. జిల్లా కేంద్రంలో ఘనంగా జరిగిన ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, నరసరావుపేట శాసనసభ్యులు చదలవాడ అరవిందబాబు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ముఖ్య అతిథులుగా హాజరై ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేశారు. విద్యా రంగంలో షేక్ కరీముల్లా అందిస్తున్న విశిష్ట సేవలు, బోధనలో చూపిస్తున్న నిబద్ధతను గుర్తించి అధికారులు ఈ అవార్డుతో ఘనంగా సత్కరించారు. మిత్రులు, సహచరుల హర్షంషేక్ కరీముల్లా ప్రతిష్ఠాత్మక జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు సాధించడం పట్ల ఆయన మిత్రులు, బంధువులు, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ, భవిష్యత్తులో విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తూ మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## ఎల్ఓసి చెక్కు అందజేత

**చిలకలూరిపేట, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:** చిలకలూరిపేట పట్టణం, పోలిరెడ్డిపాలెంకి చెందిన దేవరపు ఏడుకొండలు ముందస్తు చికిత్స కోసం సీఎం సహాయనిధి నుండి 4,00,000 రూపాయల ఎల్ఓసిను



ఏడుకొండలు కుటుంబసభ్యులకు మాజీ మంత్రివర్యులు, నియోజకవర్గ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గారు అందజేశారు. అనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతూ సకాలంలో వైద్యం చేయించుకోలేక బాధపడుతున్న ప్రతి ఒక్కరిని ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం ఆదుకుంటుందని, కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు ఎటువంటి కష్టం వచ్చిన తోడుగా ఉండే ప్రభుత్వం అని తెలిపారు...

## మంగళగిరిలో స్థానిక సంస్థ ఎన్నికలకు సిద్ధం

### -ఎస్ ఐ ఆర్ పూర్తయిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి -వైసీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



**మంగళగిరి, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పూర్తిగా సిద్ధంగా ఉందని మంగళగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం మంగళగిరి ఆత్మకూరు బైపాస్ రోడ్డులోని నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని పోటీగా ముందుకు తీసుకెళ్లాలని అధినేత ఆదేశించారని, అందులో తప్పేమీ లేదన్నారు. మేము పోటీ చేస్తాం. మా ఓటు బ్యాంక్ మాకుంది అని స్పష్టం చేశారు. మంగళగిరిలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత గెలిచింది ఒక్కసారేనని, తాము వరుసగా నాలుగు సార్లు, ఐదోసారి అప్పట్లో పొత్తుల్లో భాగంగా సీపీఎం గెలిచింది, కాబట్టి ఇక్కడ తమకే ఎడ్జ్ ఉందని అన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఓటమికి అనేక కారణాలు ఉన్నాయని, వాటిని సమీక్షించుకుని తప్పులను సరిదిద్దుకుని మళ్లీ పోరాటానికి సిద్ధమయ్యామని తెలిపారు. ఎంటీఎంసీ కార్పొరేషన్ ఏర్పడిన తర్వాత చుట్టుపక్కల గ్రామాలు, తాడేపల్లి పట్టణం కలవడంతో తమ బలం పెరిగిందని, కార్పొరేషన్‌ను గెలవడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. సమగ్ర ఓటర్ జాబితా సవరణ ప్రస్తుతం జరుగుతున్న సర్వే పూర్తయిన తర్వాత వచ్చే తాజా లిస్ట్ ఆధారంగా ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎస్ ఐ ఆర్ పూర్తి కాకుండా తప్పులతడకలతో ఇష్టానుసారంగా ఎన్నికలు నిర్వహించడం ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు. సవరణలో అవకతవకలను సరి చేసి, త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, తప్పకుండా ఎన్నికల్లో పాల్గొంటామన్నారు

## న్యాయవాది రమేష్ బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:** చిలకలూరిపేట పట్టణ ప్రముఖ న్యాయవాది నక్కా రమేష్ బాబు గత కొంతకాలంగా అనారోగ్య



సమస్యతో బాధపడుతూ హాస్పటల్ నందు చికిత్స పొందుతూ ఇటీవల స్వర్గస్తులైనారు. ఈ విషయం తెలుసుకొని పట్టణంలోని వారి స్వగృహం వద్ద ఉంచిన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబసభ్యులను పరామర్శించిన మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు...

## ఉద్యోగుల సమస్యల పై సానుకూల నిర్ణయాలకు కృతజ్ఞతలు

### సీఎం చంద్రబాబుకు ఏపీ జేఏసీ, ఏపీ ఎన్జీవో సంఘం నేతల ధన్యవాదాలు

**గుంటూరు మెడికల్, సెప్టెంబరు 5, పభాతవార్త :** ఉద్యోగ సంఘాల డిమాండ్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించి పలు కీలక నిర్ణయాలు తీసుకోవడం పట్ల గుంటూరు జిల్లా ఏపీ జేఏసీ చైర్మన్ ఘంటసాల శ్రీనివాసరావు, కన్వీనర్ కాలీద్ హర్షం వ్యక్తం చేశారు. ఏపీ ఎన్జీవో హోంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వానికి సంఘం తరఫున ప్రత్యేక





కృతజ్ఞతలు తెలిపారు. 12వ పీఆర్సీ నియామకానికి అంగీకారం, 2024 జూలై 1, 2025 జనవరి 1 నుంచి రావాల్సిన రెండు డీఏలను విడుదల చేసి అక్టోబరు 1 నుంచి చెల్లింపు, 2022 సరెండర్ లీవుల మొత్తాన్ని వచ్చే సంక్రాంతికి చెల్లింపు, పోలీసులకు అదనపు సరెండర్ లీవ్, 2027 జనవరి నుంచి అదనపు పెన్షన్ అమలు వంటి నిర్ణయాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. 70 ఏళ్లు దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్లు దాటిన వారికి 15 శాతం అదనపు పెన్షన్, ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని క్రమబద్ధీకరించడం, స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల వయోపరిమితిని 60 నుంచి 62 ఏళ్లకు పెంచే అంశాన్ని జీఓఎం ద్వారా పరిష్కరించాలని ఆదేశించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమని, వారికి సాధ్యమైనంత మేరకు అండగా ఉంటామని సీఎం చంద్రబాబు హామీ ఇవ్వడం పట్ల నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయాల అమలుతో ఏటా రూ.2,880 కోట్ల అదనపు భారం పడనున్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సాయి ప్రసాద్, ఆర్థిక శాఖ సీనియర్ అధికారులు ఎస్.ఎస్.రావత్, పీయూష్ కుమార్, అల్లాడ గౌతమ్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో జిల్లా కార్యదర్శి శ్యామ్ సుందర్ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ నాగూర్ షరీఫ్, నగర అధ్యక్ష, కార్యదర్శులు చింతల కళ్యాణ్‌కుమార్, కోటేశ్వరరావు, జిల్లా ఉమన్ చైర్‌పర్సన్ తాజున్నిసా, జిల్లా నాయకులు నరసింహారావు, సయ్యద్ జానీబాషా, అనిల్ కుమార్, విజయ్ బాబు, మరీలు తదితరులతో పాటు జిల్లా, గుంటూరు సిటీ మహిళా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**చిలకలూరిపేట, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:** చిలకలూరిపేట పట్టణంలో వాసవి గ్రాండ్ ఏసీ నందు మోడరన్ జూనియర్ కాలేజీ విద్యార్థిని విద్యార్థులచే ఉపాధ్యాయ దినోత్సవం అత్యంత వైభవంగా జరిగింది ఈ కార్యక్రమానికి మోడల్ జూనియర్ కాలేజీ డైరెక్టర్ చేబ్రోలు శ్రీరాములు అధ్యక్షులు వహించారు ముఖ్య



అతిథిగా జడ్జి సాతులూరి యమునా మరియు ఆరా ఫౌండేషన్ వ్యవస్థాపకులు షేక్ మస్తాన్ ముఖ్యఅతిదులుగా చేశారు ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు దాన్లో భాగంగా మోడరన్ విద్యాసంస్థల చైర్మన్ చేబ్రోలు మహేష్ ను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథులు చేతుల మీదుగా బహుమతి ప్రధానం జరిగిందివిద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు సభికులను అలరించాయి

## కొండవీడులో ఘనంగా వరలక్ష్మీ వ్రత పూజలు

**యడ్లపాడు, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** కొండవీడు కొండలపై నెలకొని ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వనమాలి క్షేత్రంలో శ్రావణ మాసం సందర్భంగా వరలక్ష్మీ వ్రత పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు భారీ సంఖ్యలో క్షేత్రానికి విచ్చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వరలక్ష్మీ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, వ్రతాన్ని ఆచరించారు. ఆలయ ప్రాంగణం మహిళా భక్తులతో సందడిగా మారింది. అమ్మవారి ఆశీస్సులు తమ కుటుంబాలపై ఉండాలని, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని మహిళలు ప్రార్థించారు.



## ఫైన్ ఆర్ట్స్ కళా ప్రదర్శనను సందర్శించిన రెక్టార్ రామినేని

**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, సెప్టెంబరు5, ప్రభాతవార్త:** ఏఎన్‌యు ఫైన్ ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్వర్ణోత్సవ వేడుకల కళా ప్రదర్శనను శనివారం రెక్టార్ ఆచార్య రామినేని శివరాం ప్రసాద్ సందర్శించారు. విద్యార్థులు ప్రదర్శనకు ఉంచిన కళాకృతులను పరిశీలించారు. వివిధ మాధ్యమాల్లో విద్యార్థులు సృజనాత్మకతతో రూపొందించిన కళాకృతులను ఆయన అభినందిస్తూ, యువ కళాకారుల్లోని ప్రతిభను వెలికితీయడంలో ఫైన్ఆర్ట్స్ విభాగం చేస్తున్న కృషిని అభినందించారు. సృజనాత్మకతతో ఽకూడాన విభిన్న ప్రక్రియలు, ఆలోచనలు, సమకాలీన అంశాలను ప్రతిభింబించే కళాకృతులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంలో ఇసి మెంబర్‌లు ఆచార్య త్రిమూర్తిరావు, ఆచార్య సుధాకర్, యూజిసి కోఆర్డినేటర్ ఆచార్య వై.అశోక్‌కుమార్, సిడిఇ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్‌లు సందర్శించి విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ఈ కార్యక్రమంలో విభాగం కోఆర్డినేటర్ పి.దేవకాంత్, 4వ ఏడాది విద్యార్థులు కె.సంజయ్, కృపాసింగ్, 2వ ఏడాది విద్యార్థులు గాయంత్రి, అలీసు, బలరాం, కళ్యాణ్‌సింగ్, తులసి తదితరులు పాల్గొన్నారు.






# మహిళల హాకీ ఆసియా కప్: భారత్ విజయంతో ప్రారంభం

## దక్షిణ కొరియాపై 4-1 తేడాతో గెలుపు

**మోకి:** మహిళల జూనియర్ ఆసియా కప్‌ను దక్షిణ కొరియాపై భారత్ ఘన విజయంతో ప్రారంభించింది. శనివారం మోకిలో జరిగిన తమ ప్రారంభ మ్యాచ్‌లో దక్షిణ కొరియాపై 4-1 తేడాతో ఘన విజయం సాధించింది. భారత్ తరఫున సానికా చంద్రకాంత్ మానే, పూర్ణిమా యాదవ్, పూజా సాహూ, మధు సిదర్ గోల్స్ చేశారు. భారత్ బలంగా ప్రారంభించి, తొలి పావుగంటలో అనేక అవకాశాలను సృష్టించుకోవడంతో 8వ నిమిషంలో ఫలించింది. సానికా చంద్రకాంత్ మానే గోల్ చేసి భారత్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించింది. తదుపరి తొలి పావుగంటలో భారత్ రెండు పెనాల్టీ కార్నర్‌లను సంపాదించగా ఆ రెండు అవకాశాలను కూడా గోల్స్‌గా మలచలేకపోయింది. రెండవ క్వార్టర్ మొదటి ఐదు నిమిషాల్లోనే మరో పెనాల్టీ కార్నర్‌ను సంపాదించినా, దక్షిణ కొరియా రక్షణ పటిష్టంగా నిలిచింది. క్వార్టర్ చివరి క్షణాల్లో 30వ నిమిషంలో పూర్ణిమా యాదవ్ గోల్ చేసి భారత్ ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. దీంతో డిఫెండింగ్ ఛాంపియన్లు 2-0 ఆధిక్యంతో హాఫ్ టైంకు వెళ్లారు. మూడవ క్వార్టర్‌లో మరో పెనాల్టీ కార్నర్ లభించగా, పూజా సాహూ గోల్ చేసి స్కోరును 3-0కి చేర్చింది. ఆఖరి క్వార్టర్‌లో కూడా భారత్ మరో పెనాల్టీ కార్నర్ లభించినా దక్షిణ కొరియా ఆ ప్రయత్నాన్ని విజయవంతంగా అడ్డుకుంది. 51వ నిమిషంలో మధు సిద్ధర్ గోల్ చేసి ఆధిక్యాన్ని 4-0కి పెంచడంతో, భారత ఒత్తిడి చివరికి ఫలించింది. దక్షిణ కొరియా ఆఖరి విజిల్ వరకు పోరాడి, 57వ నిమిషంలో ఒక గోల్‌ను తిరిగి సాధించింది. చివరకు భారత్ పట్టుదలతో పోరాడి 4-1 తేడాతో విజయం




### వాలీబాల్ ఛాంపియన్‌షిప్: తొలి మ్యాచ్‌లో

# చైనా చేతిలో భారత్ ఓటమి

**జపాన్:** పురుషుల వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లో హోరాహోరీగా జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్, చైనా చేతిలో స్ట్రెయిట్ సెట్స్‌లో ఓటమి పాలైంది. శనివారం చైనాతో జరిగిన ఈ వాలీబాల్ కాంటినెంటల్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ 0-3 తేడాతో ఓటమిని చవిచూసింది. అయితే, జపాన్‌లోని కితాక్యూషు సిటీ జనరల్ జిమ్నాసియంలో జరిగిన పూల్ బి పోటీలో, తమ కంటే ఉన్నత ర్యాంకులో ఉన్న ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇచ్చింది. చివరి దశలలో చైనా సంయమనం పాటించడంతో, రెండవ, మూడవ సెట్లు నిర్ణీత పాయింట్లను దాటి సాగడంతో భారత్ 21-25, 26-28, 25-27 తేడాతో ఓడిపోయింది. ఈ ఫలితంతో, పూల్ బిలో ఇరాన్, న్యూజిలాండ్‌లతో జరగనున్న మిగిలిన మ్యాచ్‌లలో భారత్ గట్టిగా పుంజుకోవాల్సిన అవసరం ఏర్పడింది. అయితే, జూన్‌లో అహ్మదాబాద్‌లో జరిగిన ఏవీసీ పురుషుల వాలీబాల్ కప్‌లో కాంస్యం గెలుచుకోవడంతో భారత్ ఈ టోర్నమెంట్‌లోకి ఆత్మవిశ్వాసంతో అడుగుపెట్టింది. ఆ టోర్నమెంట్ పూల్ దశలో భారత్ 5-0 రికార్డుతో అజేయంగా నిలిచి, కాంస్య పతకం కోసం జరిగిన మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ బహ్రెయిన్‌ను 3-1 తేడాతో ఓడించింది. అంతకుముందు ఇండోనేషియాతో జరిగిన ఉత్కంఠభరితమైన సెమీఫైనల్‌లో వారు 2-3 తేడాతో ఓడిపోయారు. ఈ పరిస్థితుల్లో భారత్ కీలకమైన ఇరాన్ పరీక్షను ఎదుర్కొంటోంది. ఇందులో గెలిచిన వారు 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్ క్రీడలలో జరిగే పురుషుల వాలీబాల్ పోటీకి నేరుగా అర్హత సాధిస్తారు. భారత్, చైనా, ఇరాన్, న్యూజిలాండ్‌లతో పాటు కఠినమైన పూల్ బిలో ఉంది.

# దులీప్ ట్రోఫీ: నేడే ఫైనల్ సమరం

### ఈస్ట్, సౌత్ మధ్య హోరాహోరీ పోరు

**చెన్నై:** దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్ సమరంలో భాగంగా సౌత్ జోన్, ఈస్ట్ జోన్ జట్లు ఢీకొట్టబోతున్నాయి. ఈ నెల 6న చెన్నైలోని ఎం.ఏ. చిదంబరం స్టేడియం (చెపాక్) వేదికగా రెండ్‌బాల్ మ్యాచ్ జరగనుంది. టైటిల్ కైవసం చేసుకునేందుకు రెండు జట్లు దూకుడు కనపరుస్తున్నాయి. ఈ ఫైనల్ పోరుకు ముందు సౌత్ జోన్ జట్టుకు భారీ ఊరట లభించింది. మరోపక్క 14 సంవత్సరాల క్రితం ఇదే వేదికపై చివరి టైటిల్ గెలుచుకున్న ఈస్ట్ జోన్ దులీప్ ట్రోఫీ ఫైనల్ కోసం చెన్నైకి తిరిగి వస్తోంది చరిత్ర అడుగుజాడలను తిరగరాయాలని చూస్తుంది. ఇటీవల శ్రీలంకతో టెస్టు సిరీస్ ఆడి వచ్చిన స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్, బ్యాటర్ దేవదత్ పడిక్కల్ తిరిగి సౌత్ జోన్ జట్టులోకి వచ్చారు. మరో ఇద్దరు స్టార్లతో పాటు సూర్యవంశీ ప్రాతినిధ్యంపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఈ ఫైనల్ మ్యాచ్ కోసం సౌత్ జోన్ స్క్వాడ్‌ను మరింత బలోపేతం చేశారు. శ్రీలంకతో ముగిసిన రెండు టెస్టుల సిరీస్‌లో పాల్గొన్న హైదరాబాదీ పేసర్ మహమ్మద్ సిరాజ్, యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ సౌత్ జోన్ జట్టులో చేరారు. వీరిద్దరి చేరికతో సౌత్ జోన్ బౌలింగ్, బ్యాటింగ్ విభాగాలు మరింత బలంగా మారాయి. కేఎల్ రాహుల్ కూడా ఈ ఫైనల్లో ఆడతాడని ప్రచారం జరిగినప్పటికీ, అతడి పాల్గొనడంపై ఇంకా ఎలాంటి అధికారిక సమాచారం వెలువడలేదు. సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ, ఈస్ట్ జోన్ సారథి ఇషాన్ కిషన్ ఫైనల్ మ్యాచ్ ఆడటంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ ఇరువురు ఆటగాళ్లు ఈ నెల 13 నుంచి అఫ్గానిస్థాన్‌తో జరిగే మూడు టీ20ల సిరీస్‌కు ఎంపికయ్యారు. కాగా డిఫెండింగ్ ఛాంపియన్ సెంట్రల్ జోన్‌ను సెమీఫైనల్లో ఓడించి ఫైనల్కు దూసుకొచ్చిన ఇషాన్ కిషన్ నేతృత్వంలోని ఈస్ట్ జోన్ జట్టులో అనుభవజ్ఞులైన స్టార్లతో పాటు ఉత్సాహవంతులైన యువ ఆటగాళ్లు ప్రధాన బలంగా నిలిచారు.




కెప్టెన్ ఇషాన్ కిషన్ మిడిలార్డర్‌లో జట్టుకు వెన్నెముకగా నిలుస్తున్నాడు. మహ్మద్ షమీ, ముకేష్ కుమార్ ఈస్ట్ జోన్ బౌలింగ్ విభాగానికి ప్రధాన బలాలు. సెమీఫైనల్‌లో ముకేష్ కుమార్ (మొత్తం మ్యాచ్‌లో 7 వికెట్లు) ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలవగా, షమీ అనుభవం జట్టుకు అదనపు బలాన్ని ఇస్తోంది. టాప్ ఆర్డర్ విషయానికి వస్తే అభిమన్యు ఈశ్వరన్ లాంటి నమ్మకమైన ఓపెనర్లు బ్యాటింగ్ విభాగానికి పటిష్టమైన పునాదిని అందిస్తున్నారు.

ఆట




### వరల్డ్ టెన్నిస్ టోర్నమెంట్..

# శ్రీనితికి డబుల్ స్వర్ణాలు

**బెంగళూరు:** భారత్‌కు చెందిన శ్రీనితి వరల్డ్ టెన్నిస్ జూనియర్ జే30 బెంగళూరు టోర్నమెంట్‌లో బాలికల సింగిల్స్, డబుల్స్ టైటిల్స్ రెండింటినీ గెలుచుకుని స్వర్ణ డబుల్ సాధించింది. బెంగుళూరులోని ఎస్ఎం కృష్ణ టెన్నిస్ స్టేడియంలో శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో 15 ఏళ్ల నాలుగో సీడ్ క్రీడాకారిణి బాలికల సింగిల్స్ ఫైనల్‌లో అహిదా సింగ్‌ను 6-4, 6-2 తేడాతో ఓడించి, ఆ తర్వాత రిద్ధి షిండేతో జతకట్టి డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. బాలికల సింగిల్స్ ఫైనల్‌లో ఆహిదా బలమైన ఆరంభాన్ని కనబరిచింది. మొదటి, మూడవ గేమ్‌లలో శ్రీనితి సర్వ్‌ను బ్రేక్ చేసి 3-0 ఆధిక్యాన్ని సాధించింది. దీనికి ప్రతిస్పందనగా శ్రీనితి దూకుడుగా రిటర్న్‌లు చేస్తూ, నెట్ వద్ద తరచుగా దాడులు చేసింది. 4-4తో స్కోరును సమం చేసిన తర్వాత, తర్వాతి రెండు గేమ్‌లను గెలుచుకుని తొలి సెట్‌ను కైవసం చేసుకుంది. ఆమె ఆ ఊపును రెండవ సెట్‌లోకి కొనసాగించి, ఆరంభంలోనే అహిదా సర్వీస్‌ను బ్రేక్ చేసి, మ్యాచ్‌పై పట్టు సాధించింది. అహిదా తిరిగి పుంజుకోవడానికి ప్రయత్నించినప్పటికీ, శ్రీనితి సంయమనం కోల్పోకుండా మ్యాచ్‌ను 6-2 తేడాతో ముగించింది. అలాగే హోరాహోరీగా సాగిన డబుల్స్ ఫైనల్‌లో శ్రీనితి-షిండే జోహా జోడీ తమ ప్రత్యర్థి జోడీ ఖురేషీ-దీప్తి వెంకటేశన్‌పై 4-6,6-2, 13-11తో విజయంసాధించింది. ఇకబాలుర సింగిల్స్ ఫైనల్‌లో, ఆరోసీడ్ ఫజల్ అలీమీర్,అమెరికాకు చెందిన మూడోసీడ్ నియంత్ బద్రీనారాయణన్‌ను 6-4,4-6,2-0 తేడాతో ఓడించాడు. నిర్ణయాత్మక సెట్‌లో నియంత్ తొందరగా వైదొలగడంతో ఈ విజయం సాధ్యమైంది.

### యుఎస్ ఓపెన్..


# రౌండ్ 2కు శ్రీరామ్

**న్యూయార్క్:** యూఎస్ ఓపెన్‌లో జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో, ఎన్ శ్రీరామ్ బాలాజీ-అతని అమెరికన్ భాగస్వామి ఇవాన్ కింగ్, డచ్ జంట సాండర్ అరెండ్స్-డేవిడ్ పెల్‌పై 3-6, 7-6(7), 7-6(10) తేడాతో విజయం సాధించే క్రమంలో ఆరు మ్యాచ్ పాయింట్లను కాపాడుకుని అద్భుతంగా తప్పించుకున్నారు. శనివారం జరిగిన ఈ టోర్నమెంట్‌లో తొలుత ఆరెండ్స్-పెల్, మొదటి సెట్‌ను 6-3తో గెలుచుకుని విజయం దిశగా సాగుతున్నట్లు కనిపించారు. కానీ బాలాజీ, కింగ్ మ్యాచ్‌ను చేజార్చుకోలేదు. వారు రెండవ సెట్ టైబ్రేక్‌లో రెండు మ్యాచ్ పాయింట్లను కాపాడుకుని, నిర్ణయాత్మక సూపర్ టైబ్రేక్‌కు దారితీశారు. మూడవ సెట్‌లో 6-5 ఆధిక్యంలో ఉన్నప్పుడు మూడు మ్యాచ్ పాయింట్లతో సహా, డచ్ జంట మళ్లీ విజయానికి చేరువైనప్పటికీ, బాలాజీ-కింగ్ నెగ్గుకొచ్చారు. నిర్ణయాత్మక టైబ్రేక్‌లో ఇండోఅమెరికన్ ద్వయం చివరికి తమ సంయమనాన్ని కోల్పోకుండా 12-10 తేడాతో గెలిచి, రెండో రౌండ్‌లో స్థానాన్ని ఖాయం చేసుకుంది. ఆగస్టులో కెరీర్‌లో అత్యుత్తమ డబుల్స్ ర్యాంక్ అయిన 54వ స్థానానికి చేరుకున్న ఈ 36 ఏళ్ల భారత ఆటగాడు, ఈ ఏడాది ఇప్పటికే ఫ్రెంచ్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. రౌండ్ ఆఫ్ 32లో బాలాజీ మరియు కింగ్ తదుపరి మొనాకోకు చెందిన 12వ సీడ్ హ్యూగో నైస్-ఫ్రాన్స్‌కు చెందిన ఎడ్వర్డ్ రోజర్‌వాసెలిన్‌లను ఎదుర్కొంటారు. ఈ సీడెడ్ జంట ఇప్పటికే తమ తొలి మ్యాచ్‌లో విజయం సాధించింది.



### రూ.980 కోట్ల రుణాల వ్యవహారంలో

# సుభాష్ చంద్రపై సిబిఐ కేసు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 5:** ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్‌నుంచి సుమారు రూ.980 కోట్ల రుణాలు పొందిన వ్యవహారంలో జీగ్రూప్‌ఛైర్మన్ సుభాష్ చంద్రపై సిబిఐ కేసు నమోదుచేసింది. ఈ రుణాల కారణంగా తమకు మొత్తం సుమారు రూ.1,322 కోట్ల నష్టం వాటిల్లిందని ఎల్ఐసి హెచ్ఎఫ్ఎల్ సిబిఐకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.నేరపూరిత కుట్ర, మోసం, నమ్మకద్రోహం, అనుచిత ప్రయోజనాలు కల్పించడంవంటి ఆరోపణలపై సిబిఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఎల్ఐసిహెచ్ఎఫ్ఎల్ ప్రధాన కార్యాలయం నుంచి అందిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు నమోదైంది.రెండు రుణ సదుపాయాలు.. రూ.980 కోట్లు వివిధ రుణగ్రహీత సంస్థలకు ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ మంజూరు చేసిన రెండు రుణ సదుపాయాలకు సంబంధించినదని వెల్లడించింది. మొదటి రుణం సుమారు రూ.500 కోట్లు. వసంత్ సాగర్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్, దాని సహ రుణగ్రహీత పాన్ ఇండియా ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు వ్యాపార విస్తరణ కోసం టేకోవర్ అండ్ టాప్అప్ ఫెసిలిటీ కింద మంజూరు చేశారు. అనంతరం ఈ రుణం నిరర్థక ఆస్తిగా (ఎన్‌పీఏ) మారింది. బకాయి మొత్తం సుమారు రూ.570.50 కోట్లకు చేరింది.రెండో రుణ సదుపాయం సుమారు రూ.480 కోట్లు. డిజిటల్ సబ్‌స్క్రైబర్ మేనేజ్‌మెంట్ అండ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, దాని సహ రుణగ్రహీత స్పిరిట్ ఇన్‌ఫ్రా పవర్ అండ్ మల్టీ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అద్దె ఆదాయాన్ని ఆధారంగా చేసుకుని ఈ రుణాన్ని మంజూరు చేశారు. ఈ రుణం కూడా అనంతరం ఎన్‌పిఎగా మారింది. బకాయి మొత్తం సుమారు రూ.507.25 కోట్లుగా ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎల్ఐసి హెచ్ఎఫ్ఎల్ ఫిర్యాదు ప్రకారం, రూ.500 కోట్ల రుణానికి సుభాష్ చంద్ర 2018 మార్చి 28న వ్యక్తిగత హామీ ఇచ్చారు. రుణం మంజూరు ప్రక్రియలో భాగంగా తన నికర ఆస్తుల విలువకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని కూడా సమర్పించారు. 2018 మార్చి 28న డిఐఎం అండ్ కో జారీ చేసిన ఆ ధ్రువీకరణ పత్రంలో 2017 మార్చి 31 నాటికి సుభాష్ చంద్ర నికర ఆస్తుల విలువ 6,197.62 మిలియన్ డాలర్లు, అంటే సుమారు రూ.59,113 కోట్లుగా పేర్కొన్నారు.రెండో రుణానికి సంబంధించి ఎల్ఐసి హెచ్ఎఫ్ఎల్‌కు సమర్పించిన మరో నికర ఆస్తుల ధ్రువీకరణ పత్రంలో చంద్ర ఆస్తుల విలువ సుమారు రూ.40,562 కోట్లుగా పేర్కొన్నారు. చార్టర్డ్ అకౌంటెంట్లు ఎంపిజె అండ్ కో ఈ పత్రాన్ని 2018 జూలై 6న జారీ చేశారు. రుణాలు పొందేందుకు ఈ నికర ఆస్తుల విలువలను భారీగా పెంచి చూపించిన ధ్రువీకరణ పత్రాలను ఉపయోగించారని ఎల్ఐసి హెచ్ఎఫ్ఎల్ ఆరోపించింది. దివాలా మరియు దివాళా చట్టం (ఐబిసి) కింద సుభాష్ చంద్రపై వ్యక్తిగత దివాలా ప్రక్రియ ప్రారంభమైందని ఎల్ఐసి హెచ్ఎఫ్ఎల్ ఫిర్యాదులో పేర్కొంది.



# సావరిన్ గోల్డ్‌బాండ్లకు భారీ రిటర్నులు

**ముంబయి, సెప్టెంబరు 5:** సావరిన్ గోల్డ్ బాండ్లలో పెట్టుబడి పెట్టిన వారికి భారీ లాభం వచ్చింది. 2021-22 సిరీస్ ఆరోసిరీస్ బాండ్ల ముందస్తు రిడెంప్షన్ ధరను రిజర్వుబ్యాంకు రూ.15,334గా నిర్ణయించింది. ఈ బాండ్లను 2026 సెప్టెంబర్ 7నుంచి ముందుగానే వెనక్కి తీసుకునే అవకాశం ఉంది. 2021 సెప్టెంబర్‌లో జారీచేసిన ఈ ఎస్‌జీబిసిరీస్ ఆన్‌లైన్ కొనుగోలుదారులకు గ్రాము రూ.4,682 ధరకు లభించింది. ప్రస్తుతరిడెంప్షన్ ధరతోపోలిస్తే గ్రాముకు రూ.10,652 లాభం వస్తుంది. అంటే దాదాపు 228శాతం రాబడి. వడ్డీని ఇందులో లెక్కించలేదు. 2021లో ఈ సిరీస్‌లో రూ.1 లక్ష పెట్టుబడి పెట్టినట్లయితే బాండ్ విలువ ఇప్పుడు దాదాపు రూ.3.28 లక్షలకు చేరుతుంది. ఇది 228 శాతం మూలధన రాబడిని సూచిస్తుంది. దీనికి అదనంగా ఎస్‌జీబీపై యేడాదికి 2.50 శాతం వడ్డీ కూడా లభిస్తుంది. వడ్డీని ఆరు నెలలకు ఒకసారి చెల్లిస్తారు. ఐదేళ్లు పూర్తైన తర్వాత వడ్డీ చెల్లించేతేదీన మాత్రమే ఎస్‌జిబి ముందస్తు రిడెంప్షన్ చేయవచ్చు. రిడెంప్షన్ ధరను నిర్ణయించేందుకు ముందు మూడు పనిదినాల్లో 999 స్వచ్ఛత బంగారం ముగింపు ధరల సగటును తీసుకుంటారు. సెప్టెంబర్ 7న జరగనున్న రిడెంప్షన్‌కు సెప్టెంబర్ 2,3, 4 ధరలను పరిగణనలోకి తీసుకున్నారు.

### ఎఐ బూమ్‌తో 15.1 లక్షలకోట్ల డాలర్లకు

# బిలియనీర్ల సంపద




**ముంబయి, సెప్టెంబరు 5:** కార్పొరేట్‌రంగంలో వెల్లువలా వచ్చిన కృత్రిమమేధ బూమ్‌తో బిలియనీర్ల సంపద 15.1 ట్రిలియన్ డాలర్లకు పెరిగింది. అలాగే బిలియనీర్ల సంఖ్య 2025లో రికార్డు స్థాయికి చేరుకుంది. వెల్త్ ఇంటెలిజెన్స్ సంస్థ ఆల్ట్రాటా విడుదల చేసిన నివేదిక ప్రకారం 2025లో ప్రపంచవ్యాప్తంగా బిలియనీర్ల సంఖ్య 3,795కు చేరుకోగా, వారి మొత్తం సంపద 15.1 ట్రిలియన్ డాలర్లకు పెరిగింది. 2025లో బిలియనీర్ల సంపద 12.8 శాతం పెరిగింది. అదే సమయంలో బిలియనీర్ల సంఖ్య 8.2 శాతం పెరిగింది. ఎఐ రంగంలో వృద్ధి, టెక్నాలజీ షేర్ల మెరుగైన పనితీరు బిలియనీర్ల సంపద పెరుగుదలకు దోహదపడ్డాయి.బిలియనీర్ల సంపద పెరుగుదలకు గణనీయంగా దోహదపడిన 150 లిస్టెడ్ కంపెనీలను ఆల్ట్రాటా గుర్తించింది. గత ఐదేళ్లలో కనీసం 30 మిలియన్ డాలర్లను ఎఐలో పెట్టుబడి పెట్టిన కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ 2024-25 మధ్యకాలంలో ఎఐలో ఇలాంటి పెట్టుబడులు చేయని కంపెనీలతో పోలిస్తే 23 శాతం అధికంగా పెరిగినట్లు నివేదిక వెల్లడించింది. ఎఐతో అనుసంధానమైన టెక్నాలజీ షేర్ల అద్భుతమైన పనితీరు భారీ సంపదలను సృష్టించింది. 50 బిలియన్ డాలర్లకు పైగా సంపద కలిగిన 29 మందిని ఆల్ట్రాటా సూపర్ బిలియనీర్లుగా పేర్కొంది. వీరి మొత్తం సంపద 4.1 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. ప్రపంచంలోని బిలియనీర్ల మొత్తం సంపదలో ఇది దాదాపు 27 శాతానికి సమానం. 2017లో 50 బిలియన్ డాలర్లకు పైగా సంపద కలిగిన వారు కేవలం 10 మంది మాత్రమే ఉండగా, వారి వద్ద ప్రపంచ బిలియనీర్ల సంపదలో 7.2 శాతం మాత్రమే ఉండేది. ఎఐ రంగంపై మార్కెట్ అంచనాలు, ఆల్ట్రాటా థాట్ లీడర్‌షిప్ అండ్ అనలిటిక్స్ విభాగం అధిపతి మాయా ఇంబర్గ్ మాట్లాడుతూ మార్కెట్‌లో సంపద ఒకే రంగంలో కేంద్రీకృతం కావడం తప్పనిసరిగా బబుల్‌కు సంకేతం కాదని అన్నారు. టెక్నాలజీ రంగం పైనే, అందులోనూ ఎఐపై అధికంగా ఆధారపడటం వల్ల ముప్పు ఉంటుందని పేర్కొన్నారు. ప్రపంచంలో అత్యధిక మంది బిలియనీర్లు ఉన్న ప్రాంతంగా ఉత్తర అమెరికా కొనసాగింది. ఈ ప్రాంతంలో బిలియనీర్ల సంఖ్య 11.6 శాతం పెరిగి 1,337కు చేరుకుంది. అమెరికా ప్రైవేట్, పబ్లిక్ టెక్నాలజీ మార్కెట్లలో బలమైన స్థానాన్ని కలిగి ఉండటంకూడా ఈవృద్ధికి కారణమని ఆల్ట్రాటా తెలిపింది. యూరప్‌లో బిలియనీర్ల సంఖ్య 7.9శాతం పెరిగి 1,081కు చేరుకుంది. ఆసియాలో 6.5 శాతం వృద్ధితో బిలియనీర్ల సంఖ్య 881గా నమోదైంది. ప్రపంచ బిలియనీర్లలో మహిళల వాటా 13 శాతంగా ఉంది.అత్యధిక మంది బిలియనీర్లు స్వయంగా తమ సంపదను నిర్మించుకున్నవారే. పూర్తిగా వారసత్వంగా సంపదను పొందిన బిలియనీర్లు కేవలం 8 శాతం మాత్రమే ఉన్నట్లు ఆల్ట్రాటా నివేదిక వెల్లడించింది.

# బ్యాంకింగ్ వ్యవస్థలో రూ.10.5 లక్షలకోట్ల మిగులు

**ముంబయి, సెప్టెంబరు 5:** దేశ బ్యాంకింగ్ వ్యవస్థలో మిగులు నగదు రికార్డు స్థాయికి చేరింది. దీంతో దీన్ని నియంత్రించేందుకు భారతీయ రిజర్వు బ్యాంకు తక్షణచర్యకు సిద్ధమైంది. సోమవారం రూ.ఏడు లక్షల కోట్లను 30 రోజుల పాటు బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి వెనక్కి తీసుకునేందుకు వేరియబుల్ రేట్ రివర్స్ రెపో వేలం నిర్వహించనున్నట్లు ఆర్‌బిఐ ప్రకటించింది. ఇటీవల నిర్వహించిన లిక్విడిటీ ఆపరేషన్లతో పోలిస్తే ఇది ఎక్కువ కాలం ఉండే చర్య. గతంలో గరిష్ఠంగా 15 రోజుల వరకు మిగులు నగదును తీసుకునేలా వేలం నిర్వహించారు. ఇప్పుడు 30 రోజుల పాటు నిధులను ఆర్‌బీఐ వద్ద ఉంచే అవకాశం ఉంది. దీంతో స్వల్పకాలిక మనీ మార్కెట్‌పై కేంద్ర బ్యాంకుకు మరింత నియంత్రణ లభించనుంది. ప్రస్తుతం దేశ బ్యాంకింగ్ వ్యవస్థలో దాదాపు




రూ.10.5 లక్షల కోట్ల మిగులు నగదు ఉన్నట్లు అంచనా. విదేశాల్లో ఉన్న భారతీయులు బ్యాంకుల్లో భారీగా డాలర్ డిపాజిట్లు చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.
ఆ విదేశీ కరెన్సీని ఆర్‌బిఐ రూపాయల్లోకి మార్చడంతో బ్యాంకింగ్ వ్యవస్థలోకి పెద్ద మొత్తంలో నగదు వచ్చింది. విదేశాల్లో ఉన్న భారతీయుల నుంచి డాలర్ డిపాజిట్లను ఆకర్షించేందుకు ఆర్‌బిఐ తీసుకొచ్చిన పథకం భారీగా విజయవంతమైంది. ఆగస్టులో పథకం ముగిసే సమయానికి రికార్డు స్థాయిలో 127 బిలియన్ డాలర్లు సమీకరించారు.
నిర్ణీత గడువు కంటే నెల ముందుగానే ఈ పథకాన్ని ముగించారు. బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థలకు కల్పించిన ఇతర రుణ సదుపాయాలతో కలిపి ఆర్థిక వ్యవస్థలోకి దాదాపు 136.4 బిలియన్ డాలర్లు వచ్చాయి. భారీగా నగదు రావడం వల్ల బ్యాంకుల మధ్య రాత్రికి రాత్రి జరిగే రుణాల వడ్డీ రేట్లు కూడా తగ్గుతున్నాయి. ప్రస్తుతం వెయిటెడ్ యావరేజ్ కాల్ రేట్ ఆర్‌బిఐ పాలసీ రేటు కంటే దిగువకు చేరింది. మిగులు నగదును క్రమంగా వెనక్కి తీసుకుంటూ మార్కెట్లపై ప్రభావం పడకుండా చూడటం ఇప్పుడు ఆర్‌బీఐ ముందున్న ప్రధాన సవాలుగా మారింది.

# మార్కెట్‌లోకి 12 కొత్త ఫండ్ ఆఫర్లు




**ముంబయి, సెప్టెంబరు 5:** మ్యూచువల్ ఫండ్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టాలనుకునే వారికి, పోర్ట్ ఫోలియోను వైవిధ్యపరుచుకోవాలనుకునే ఇన్వెస్టర్లకు అసలైన సమయం వచ్చింది. ప్రస్తుతం మార్కెట్లో వివిధ ఫండ్ హౌస్‌లు ప్రారంభించిన 12 కొత్త ఫండ్ ఆఫర్లు సబ్‌స్క్రిప్షన్ కోసం అందుబాటులోకి వచ్చాయి. వివిధ కేటగిరీలకు చెందిన ఈ ఎన్ఎఫ్ఒలలో ఇండెక్స్ ఫండ్లు, థిమాటిక్ ఫండ్లు, స్థిరమైన రాబడులు ఇచ్చే డెట్ ఫండ్లు అందుబాటులో ఉన్నాయి. తక్కువ ధరలో అంటే యూనిట్ విలువ రూ.10ల ప్రాథమిక ధరతో కూడా వచ్చే న్యూఫండ్ ఆఫర్లు ఉన్నాయి. మార్కెట్ సూచీలైన నిఫ్టీ, సెన్సెక్స్ ట్రాకింగ్ ఆధారంగా తక్కువ నిర్వహణ వ్యయంతో పని చేసే అనేక ప్యాసివ్ ఇండెక్స్ ఫండ్లు ఈ లిస్టులో ఉన్నాయి. డిజిటల్ ఇండియా, ఇన్నోవేషన్, కన్జంప్షన్ రంగాలను లక్ష్యంగా చేసుకుని పనిచేసే ప్రత్యేక థిమాటిక్ ఫండ్లు సైతం ఇందులో ఉన్నాయి. మార్కెట్ హెచ్చుతగ్గుల నుంచి రక్షణ కోరుకునే ఇన్వెస్టర్ల కోసం తక్కువ రిస్క్ కలిగిన ఫిక్స్‌డ్ ఇన్‌కమ్, హైబ్రిడ్ ఆప్షన్లు సైతం అందుబాటులోకి తీసుకొచ్చారు. సాధారణంగా వీటిల్లో కనీస పెట్టుబడి రూ.100 నుంచి రూ.5000 మధ్య ఉంటుంది. లైఫ్ సైకిల్ ఫండ్స్ కేటగిరీలో ఐసిఐసిఐ ప్రూ లైఫ్ సైకిల్ ఫండ్ 2031 ఐసిఐసిఐ ప్రూ లైఫ్ సైకిల్ ఫండ్ 2036, ఐసిఐసిఐ ప్రూ లైఫ్ సైకిల్ ఫండ్ 2041, జెరోధా లైఫ్ సైకిల్ ఫండ్ 2031,న్యూ ఫండ్ ఆఫర్స్ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభించాయి. ఈ మూడు పథకాలు సెప్టెంబర్ 9, 10 తేదీల్లో సబ్‌స్క్రిప్షన్ ముగించనున్నాయి. ఇండెక్స్ ఫండ్స్ కేటగిరీలో యుటిఐ బిఎస్ఇ ఇండియా సెక్టార్ లీడర్స్ ఇండెక్స్ ఫండ్, నావీ నిఫ్టీ ఆర్ఇటిఎస్ అండ్ రియాల్టీ ఇండెక్స్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభించాయి. ఈరెండు ఫండ్లు ఈనెల 10, 11 తేదీల్లో సబ్‌స్క్రిప్షన్ ముగించనున్నాయి. పాసివ్ ఫండ్స్ కేటగిరీలో యుటిఐ బిఎస్ఇ ఇండియా లీటర్స్ ఇటిఎఫ్, ఐసిఐసిఐ ప్రూడెన్షియల్ డైనమిక్ అసెట్ అలకేషన్ పాసివ్ ఫండ్ ఆఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఇప్పటికే ప్రారంభం కాగా ఈ 2 ఫండ్లు ఈనెల 9, 11 తేదీల్లో సబ్‌స్క్రిప్షన్ ముగించనున్నాయి. మల్టీ క్యాప్ కేటగిరీ నుంచి ద వెల్త్ కంపెనీ మల్టీ క్యాప్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ కోసం వచ్చింది. సెప్టెంబరు 10వ తేదీ వరకు కొనసాగనుంది. మోనార్క్ ఓవర్‌నైట్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ సెప్టెంబర్ 7వ తేదీతో ముగుస్తుంది. థిమాటిక్ ఫండ్ కేటగిరీ నుంచి మోతీలాల్ ఓస్వాల్ క్వాలిటీ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ కోసం వచ్చింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14